www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గురువారం | 26-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 268 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి రా. 12.44 తదుపరి ద్వాదశి; నక్షత్రం: స్వాతి రా. 6.09 తదుపరి విశాఖ; వర్జ్యం: రా. 12.17-2.02; దుర్ముహూర్తం: ఉ. 10.26-11.09, మ. 2.49-3.33; అమృతఘడియలు: ఉ. 8.19-10.06; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.46; సూర్యాస్తమయం: 5.44 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కజకిస్థాన్‌లో నేలకూలిన విమానం

38 మంది ప్రయాణికుల మృతి

సాంకేతిక లోపంతో ల్యాండింగ్‌కు ప్రయత్నిస్తున్న క్రమంలో ఘోరం

పక్షులు ఢీకొనడంతోనే సమస్య తలెత్తిందంటూ వార్తలు 2


కజకిస్థాన్‌లోని అక్టౌ విమానాశ్రయం సమీపంలో కుప్పకూలిన విమానం

● శాంటాకారం.. వరాల వర్షం

కేజ్రీ ఎన్నికల హామీలు

కృత్రిమ మేధతో శాంటాక్లాజ్ అవతారంలో కేజ్రీవాల్ వీడియో

ఢిల్లీ ఎన్నికల నేపథ్యంలో రూపొందించిన ఆమ్ ఆద్మీ పార్టీ 2



త్వరలో తప్పుడు కేసులో అతిశీ అరెస్టు : కేజ్రీవాల్

ప్రభువు ఆశీస్సులతోనే ప్రజా ప్రభుత్వం

క్రైస్తవ మిషనరీల స్ఫూర్తితో పేదలకు విద్య, వైద్యం

మెదక్ చర్చితో నాకు విడదీయరాని అనుబంధం

గతంలో పీసీసీ అధ్యక్షుడిగా వచ్చినప్పుడే.. 13

ముఖ్యమంత్రి హోదాలో మళ్లీ వస్తానని మొక్కుకున్నా

సంక్షేమంలో దళిత, గిరిజన క్రైస్తవులకు ప్రాధాన్యం

మెదక్ చర్చిలో క్రిస్మస్ సంబరాల్లో సీఎం రేవంత్

ఏడుపాయల వనదుర్గమాత సన్నిధిలో పూజలు



● మీసాల తాత.. మిస్టర్ కూల్

క్రిస్మస్ వేడుకల్లో ధోనీ

శాంటాక్లాజ్ వేషధారణలో టీమిండియా మాజీ కెప్టెన్ 11

కుమార్తె జివా కోరిక మేరకు..

కుటుంబసభ్యులు, స్నేహితులతో కలిసి సంబరాలు

ఇన్‌స్టాలో ఫొటోలు పోస్ట్ చేసిన ధోనీ భార్య సాక్షి సింగ్


భార్య సాక్షి, కుమార్తె జివాతో ధోనీ

రూ.2 కోట్ల సాయం

శ్రీతేజ్ కుటుంబానికి అల్లు అర్జున్ కోటి, నిర్మాతలు 50 లక్షలు, దర్శకుడు 50 లక్షలు

ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజుకు చెక్కుల అందజేత

మెరుగు పడుతున్న శ్రీతేజ్ ఆరోగ్యం

వెంటిలేటర్, ఆక్సిజన్ లేకుండా శ్వాస

నేడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమావేశం కానున్న సినీ ప్రముఖులు

చిరంజీవి, అల్లు అరవింద్, నాగవంశీ, సురేశ్‌బాబు తదితరులు పాల్గొనే అవకాశం!

సినీ పరిశ్రమ సమస్యలపై చర్చించే చాన్స్



దిల్‌రాజుకు చెక్కులు అందజేస్తున్న అల్లు అరవింద్, పుష్ప నిర్మాత రవిశంకర్

బోయినపల్లి/హైదరాబాద్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పుష్ప-2 సినిమా బెనిఫిట్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన రేవతి కుటుంబానికి ఆ చిత్ర యూనిట్ రూ.2 కోట్ల సాయం అందజేసింది. చిత్ర కథానాయకుడు అల్లు అర్జున్ రూ.కోటి, నిర్మాణ సంస్థ మైత్రీ మూవీమేకర్స్ రూ.50 లక్షలతోపాటు ఆ సినిమా దర్శకుడు సుకుమార్ మరో రూ.50 లక్షలు ఇచ్చారు. ఈ మేరకు అల్లు అర్జున్ తండ్రి అల్లు అరవింద్, సుకుమార్ తరఫున ఆయన కుటుంబ సభ్యులు సంబంధిత చెక్కులను ఎఫ్‌డీసీ చైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్ రాజుకు అందజేశారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో గాయపడి సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రేవతి కుమారుడు శ్రీతేజ్‌ను బుధవారం దిల్ రాజుతో కలిసి అల్లు అరవింద్ మరోసారి పరామర్శించారు శ్రీతేజ్ ఆరోగ్యంపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియా పాయింట్ వద్ద అల్లు అరవింద్ మాట్లాడుతూ.. శ్రీతేజ్ కోలుకుంటున్నాడని, అతని ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉన్నట్లు వైద్యులు చెప్పారని తెలిపారు. శ్రీతేజ్ శరీరంలో పూర్తి స్థాయిలో కదలికలు వచ్చాయని చెప్పారన్నారు. అతని ఆరోగ్యం పూర్తిస్థాయిలో మెరుగు పడేంతవరకు అన్నిరకాల వైద్య చికిత్సలు అందించడానికి తమవైపు నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు. శ్రీతేజ్ త్వరగా కోలుకుని మనందరితో కలిసి తిరుగుతాడని ఆశిస్తున్నట్లు చెప్పారు. వారి కుటుంబానికి చేయదలచుకున్న ఆర్థిక సాయానికి సంబంధించి ప్రభుత్వ ప్రతినిధిగా దిల్ రాజుకు అందజేస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఆ కుటుంబానికి ఏ కష్టం వచ్చినా తాము అండగా ఉంటామన్నారు. శ్రీతేజ్ కోలుకుంటున్నాడని, వెంటిలేటర్, ఆక్సిజన్ లేకుండా 72 గంటలుగా

మిగతా 10వ పేజీలో...

తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు

సోషల్ మీడియాలో పోస్టులపై పోలీసుల హెచ్చరిక

అల్లు అర్జున్ రాకముందే తొక్కిసలాట జరిగిందంటూ ప్రచారం

ప్రజల్ని అపోహలకు గురిచేసేలా వీడియోలు 10

ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం వ్యాప్తి: పోలీస్ శాఖ



కర్త, కర్మ, క్రియ.. కేటీఆరే!

ఆయన ఆదేశాలతోనే నిధుల మళ్లింపు

సీనియర్ ఐఏఎస్ దానకిశోర్ వాంగ్మూలం!

ఫార్ములా-ఈ రేసు కేసులో కీలక పరిణామం

నాలుగు గంటల పాటు ప్రశ్నించిన ఏసీబీ

పలు అంశాలకు సంబంధించి ఆధారాల సేకరణ

అరెస్టు వద్దంటూ ప్రభుత్వానికి అర్వింద్ వినతులు

అప్రూవర్‌గా మార్చుకునే యోచనలో ఏసీబీ

ఆయన విచారణ తర్వాత కేటీఆర్‌కు నోటీసులు

కోర్టు తదుపరి ఉత్తర్వుల అనంతరమే?

హైదరాబాద్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కారు రేసు కేసులో కేటీఆర్‌కు ఉచ్చు బిగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాతపూర్వక ఫిర్యాదు ఇచ్చిన ఐఏఎస్ అధికారి దానకిశోర్ వాంగ్మూలాన్ని ఏసీబీ అధికారులు రికార్డు చేశారు. ఏసీబీకి చెందిన సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ (సీఐయూ) బృందం దానకిశోర్ నుంచి కీలక ఆధారాలు సేకరించింది. రేసుకు సంబంధించి నాటి ప్రభుత్వానికి, బ్రిటన్‌కు చెందిన ఫార్ములా-ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈవో) సంస్థకు మధ్య జరిగిన ఒప్పందాలు, ఇన్‌వాయిస్‌లు, 2023 సెప్టెంబరు 27న నాటి పురపాలకశాఖ ప్రత్యేక కార్యదర్శి అర్వింద‌కుమార్ నాటి మంత్రి కేటీఆర్‌కు పంపిన ఫైల్ ప్రతులను ఏసీబీ అధికారులు తీసుకున్నారు. దానకిశోర్ ఫిర్యాదులో పేర్కొన్న ప్రతి అంశానికి సంబంధించిన ఆధారాలనూ సేకరించారు. మంగళవారం సాయంత్రం దాదాపు నాలుగు గంటల పాటు దానకిశోర్‌ను

మిగతా 3వ పేజీలో...



ప్రజాపాలన భేష్!

హామీలన్నీ అమలు చేసే దిశగా తెలంగాణ సర్కారు

రవాణా, బీసీ సంక్షేమ శాఖకు అభినందనలు 13

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు రాహుల్ గాంధీ లేఖ

తక్కువ ధరకే
ఇసుక, ఉక్కు, సిమెంటు

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు.. ప్రభుత్వ నిర్ణయం!

ఉక్కు, సిమెంట్ ధరలపై కంపెనీలతో చర్చించనున్న రాష్ట్ర సర్కారు

ప్రభుత్వ పరిధిలోనే ఇసుక లభ్యత.. 500 మండలాల్లో నమూనా ఇళ్ల నిర్మాణం

ఇప్పటి వరకు 80.5 లక్షల దరఖాస్తులు.. గ్రామీణ ప్రాంతాల్లోనే అత్యధికం



హైదరాబాద్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారులకు శుభవార్త..! ముందుగానే ప్రకటించిన నాలుగు విడతల్లో రూ.5 లక్షల ఆర్థిక సాయంతో పాటు.. లబ్ధిదారులకు ఆర్థిక ఉపశమనం కలిగించేలా ఇసుక, ఉక్కు, సిమెంటును తక్కువ ధరకే అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటి ధరలు బహిరంగ మార్కెట్లో చుక్కలనంటుతున్న నేపథ్యంలో.. పేదలపై పెద్దగా ఆర్థిక భారం పడకుండా చూడాలని భావిస్తోంది. ఈ మేరకు

మిగతా 13వ పేజీలో...

తుమ్మిడిహెట్టికి దిగువన ప్రాణహిత బ్యారేజీ

12 కి.మీ. దూరంలోని బోరేపల్లి వద్ద అనువైన స్థలం ఉన్నట్లుగా గుర్తింపు

ముంపు, అటవీ సమస్యలు లేవు 13

165 టీఎంసీల నీటి లభ్యత అంచనా

గ్రావిటీతో ఎల్లంపల్లికి కలిపే అవకాశం

కొత్తగా ప్రతిపాదనలు.. ప్రభుత్వ పరిశీలన



13

హైడ్రాతో రియల్ ఎస్టేట్ తగ్గలేదు

2024 ప్రథమార్ధంలో ఇళ్ల గిరాకీ..

ఇళ్ల విక్రయాల విలువ రూ.58వేల కోట్లు

2025 నవంబరుకు డ్రాఫ్ట్ మాస్టర్‌ప్లాన్

పది రోజుల్లో ఎలివేటెడ్ కారిడార్ పనులు

ఈ నెలలో ఆరాంఘర్ ఫ్లైఓవర్ ప్రారంభం

మీడియాతో చిట్‌చాట్‌లో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కమిషనర్లు


ఢిల్లీలో జేపీ నడ్డా నివాసంలో జరిగిన ఎన్డీఏ భేటీలో అమిత్‌షా, చంద్రబాబు, కుమారస్వామి

తప్పుగా మాట్లాడలేదు

అంబేడ్కర్‌పై నా వ్యాఖ్యలను కాంగ్రెస్ వక్రీకరించింది

కేంద్ర హోంమంత్రి అమిత్ షా పునరుద్ఘాటన

జేపీ నడ్డా నివాసంలో ఎన్డీఏ నేతల భేటీ

కూటమిలో మరింత సమన్వయంపై చర్చలు

పాల్గొన్న ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

న్యూఢిల్లీ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బాబాసాహెబ్ అంబేడ్కర్ గురించి తానేమీ తప్పుగా మాట్లాడలేదని, కాంగ్రెస్సే తన మాటలను వక్రీకరించిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. మాజీ ప్రధాని

మిగతా 2వ పేజీలో...

ముసురుకున్న మేఘాలు!

రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో చిరుజల్లులు

నేడు, రేపు ఓ మోస్తరు వర్షాలు


భూపాలపల్లిలో కొనుగోలు కేంద్రాల్లోనే 50 వేల టన్నుల ధాన్యం

సరిపడా టార్పాలిన్ కవర్లు లేక ఆందోళనలో రైతులు 14

స్నేహితుడిని కొట్టి తరిమేసి..
అన్నా వర్సిటీలో విద్యార్థినిపై గ్యాంగ్ రేప్

చెన్నై, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాజధాని చెన్నై నడిబొడ్డున ఉన్న అన్నా యూనివర్సిటీలో ఇంజనీరింగ్ సెకండియర్ చదువుతున్న విద్యార్థినిపై ఇద్దరు దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ నెల 23న రాత్రి 8 గంటల సమయంలో వర్సిటీ క్యాంపస్ ప్రాంగణంలోని ఓ భవనం వెనుక ఆమె, తన స్నేహితుడితో మాట్లాడుతుండగా అక్కడికి వచ్చిన దుండగులు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారు. ముందుగా ఆ ఆమె స్నేహితుడిని కొట్టి తరిమేసి, ఆమెపై లైంగిక దాడికి తెగబడ్డారు. ఘటనపై మంగళవారం రాత్రి ఆ యువతి స్థానిక కొట్టూర్పురం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగుచూసింది. అత్యాచారం అనంతరం తనను నగ్నంగా వీడియో తీసినట్లు ఆ యువతి ఫిర్యాదులో పేర్కొంది. యూనివర్సిటీ క్యాంపస్ హాస్టల్లోనే ఉండి చదువుకుంటున్న ఆ యువతి స్వస్థలం కన్యాకుమారి జిల్లా అని పోలీసులు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు, దర్యాప్తు ముమ్మరం చేసి, సాంకేతిక ఆధారాలతో జ్ఞానశేఖరన్ (37)ను అరెస్టు అరెస్టు చేశారు. మరొకరి కోసం గాలిస్తున్నారు. నిందితుడు నేరాన్ని అంగీకరించాడని, ఫుట్‌పాత్‌పై బిర్యానీ విక్రయించే ఇతడిపై గతంలోనూ పలు కేసులు ఉన్నట్లు తెలిపారు.

స్వదేశీ విమాన ఇంజన్ 'కావేరీ' సిద్ధం!



న్యూఢిల్లీ, డిసెంబరు 25: గగనతల సాంకేతికతకు సంబంధించిన స్వదేశీ పరిజ్ఞానం అభివృద్ధిలో డీఆర్‌డీవో కీలక మైలురాయిని దాటింది. దశాబ్దాలుగా కొనసాగుతున్న కావేరీ ఇంజన్ ప్రాజెక్టు ఒక కొలిక్కి వచ్చిందని, పరీక్షలకు కావేరీ ఇంజన్ సిద్ధమైందని ప్రకటించింది. డీఆర్‌డీఓ పరిధిలోని గ్యాస్ టర్బైన్ రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్ ఈ ఇంజన్‌ను అభివృద్ధి చేసింది. యుద్ధవిమానాలకు అవసరమైన ఇంజన్లను స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించుకోవాలన్న లక్ష్యంతో కావేరీ ప్రాజెక్టు 1980ల చివర్లలో ప్రారంభమైంది. ఆ తర్వాత నాలుగు దశాబ్దాల కాలంలో అనేక సవాళ్లను ఎదుర్కొంది. వాటన్నింటినీ అధిగమించి ఎట్టకేలకు స్వదేశీ విమాన ఇంజన్ రూపుదాల్చింది. తదుపరి దశలో భాగంగా కావేరీ ఇంజన్‌ను పలు విమానాల్లో, పలు రకాల వాతావరణ పరిస్థితుల్లో పరీక్షించనున్నారు. వాటిలో కూడా విజయవంతమైతే విమాన ఇంజన్ల కోసం విదేశాల మీద ఆధారపడాల్సిన పరిస్థితి తప్పుతుంది.

శబరిమలలో నేడే మండల పూజ

శబరిమల, డిసెంబరు 25: శబరిమలలో మండల పూజోత్సవానికి సర్వం సిద్ధమైంది. గురువారం మధ్యాహ్నం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరగనున్నందున వర్చువల్ బుకింగ్‌లో 50 వేల మంది.. స్పాట్ బుకింగ్‌లో 5 వేల మంది భక్తులకు మాత్రమే దర్శనానికి అవకాశం కల్పిస్తామని ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు(టీడీబీ) వెల్లడించింది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో మండల పూజోత్సవం ప్రారంభమవుతుందని, రాత్రి 11 గంటలకు 'హరివరాసనం'తో ఆలయం తలుపులను మూసివేస్తామని తెలిపింది. మకర విళక్కు సీజన్ సందర్భంగా ఈ నెల 30న సాయంత్రం 5 గంటలకు అయ్యప్ప స్వామి సన్నిధానాన్ని తిరిగి తెరుస్తామని చెప్పారు. జనవరి 14న మకర విళక్కు పూజలు ఉంటాయని, 18వరకు ఆలయం తెరిచి ఉంటుందని వివరించారు. పునలూర్-మువత్తుపుళ రాష్ట్ర రహదారిపై జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో తెలంగాణకు చెందిన 11 మంది భక్తులు గాయపడ్డారు.

మోదీ, యోగిపై కుంభమేళాలో దాడి చేస్తాం: పన్నూ

న్యూఢిల్లీ, డిసెంబరు 25: ప్రధాని మోదీ, యూపీ సీఎం యోగిలపై దాడి చేస్తామంటూ ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూ బెదిరించాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇటీవల ముగ్గురు ఖలిస్థానీ ఉగ్రవాదులను ఎన్‌కౌంటర్‌లో హతమార్చారు. ఇందుకు తన ఉగ్రవాద సంస్థ సిఖ్స్ ఫర్ జస్టిస్ (ఎస్ఎఫ్‌జే) కుంభమేళా సందర్భంగా ప్రతీకారం తీర్చుకుంటుందన్నాడు. నకిలీ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు సిక్కు యువతను చంపినట్టు ఆ వీడియోలో పన్నూ ఆరోపించాడు. చనిపోయిన ఉగ్రవాదుల కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సాయం చేయనున్నట్టు హామీ ఇచ్చాడు. కుంభమేళాలలో భాగంగా షాహి స్నానాలకు శుభప్రదమైన జనవరి 14, 29, ఫిబ్రవరి 3వ తేదీల్లో దాడులు చేయనున్నట్టు చెప్పాడు. ఆ రోజుల్లో ప్రధాని మోదీ, సీఎం యోగిలు ప్రయాగ్‌రాజ్‌లో ఉంటారని నొక్కిచెప్పాడు.

జగ్జీత్ పేరుతో మా సైన్యంలో ఎవరూ లేరు: బ్రిటన్

న్యూఢిల్లీ, డిసెంబరు 25: పంజాబ్‌లోని గురుదాస్‌పూర్‌లో ఇటీవల ఓ పోలీసు పోస్టుపై జరిగిన ఉగ్రదాడి వెనుక బ్రిటిష్ సైనికుడు జగ్జీత్ సింగ్ హస్తం ఉందన్న ఆ రాష్ట్ర పోలీసుల ప్రకటనను బ్రిటన్ ఖండించింది. జగ్జీత్ సింగ్ పేరుతో తమ సైన్యంలో ఎవరూ లేరని పేర్కొంది. ఈ మేరకు బ్రిటన్ రక్షణశాఖ ప్రతినిధి రియాన్ షిల్లాబీర్ ఓ ప్రకటన చేశారు. ఈ ఘటనకు సంబంధించి తమను భారత అధికారులెవరూ సంప్రదించలేదని తెలిపారు. మరోవైపు, దర్యాప్తు అధికారుల ప్రకటనకు తాము కట్టుబడి ఉన్నామని పంజాబ్ డీజీపీ గౌరవ్ యాదవ్ వెల్లడించారు. ఈ కేసు వ్యవహారాన్ని సంబంధిత అధికారుల ద్వారా బ్రిటన్ దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు.

అఫ్ఘాన్‌పై పాక్ దాడులు..46 మంది మృతి

కాబూల్, డిసెంబరు 25: అఫ్ఘానిస్థాన్‌పై పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడుల్లో 46 మంది మరణించినట్లు తాలిబన్ ప్రభుత్వం ప్రకటించింది. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడినట్లు తెలిపింది. ఈ దాడులకు తప్పక ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించింది. మంగళవారం అర్ధరాత్రి సరిహద్దుల్లో ఉండే పక్తికా ప్రావిన్స్‌లోని బార్మల్ జిల్లాలో నాలుగు గ్రామాలే లక్ష్యంగా పాక్ వైమానిక దాడులు చేసింది. ఇందులో ఒక ఇంటిపై జరిగిన దాడిలో ఒకే కుటుంబానికి చెందిన 18 మంది మరణించారు. 2021లో తాలిబన్ సర్కారు అధికారం దక్కించుకున్నప్పటి నుంచి ఇరు దేశాల మధ్య సరిహద్దు ఉద్రిక్తతలు పెరిగాయి.

ప్రపంచంలో శాంతి పరిఢవిల్లాలి: పోప్ ఫ్రాన్సిస్



వాటికన్ సిటీ, డిసెంబరు 25: ప్రపంచంలో శాంతి పరిఢవిల్లాలని, ఆయుధాలు మౌనం పాటించాలని, శత్రువులు సైతం మిత్రత్వం అనే బంధంలోకి రావాలని పోప్ ఫ్రాన్సిస్ ఆకాంక్షించారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగియాలని, ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంతో ఇరువైపులా క్రైస్తవులు ఇబ్బందులకు గురవుతున్నారని, వీటికి ముగింపు పలకాలని అభిలషించారు. క్రిస్మస్ సందర్భంగా బుధవారం ఆయన వాటికన్‌సిటీలోని 'హోలీ డోర్ ఆఫ్ సెయింట్ పీటర్' ప్రార్థన మందిరం వద్ద ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ.. గత ఏడాది అక్టోబరు 7న హమాస్ అపహరించిన ఇజ్రాయెలీలను బేషరతుగా వదిలిపెట్టాలని సూచించారు.

నేవీలో హెలికాప్టర్
తొలి మహిళా పైలట్‌గా అనామిక

విశాఖ ఐఎన్ఎస్ డేగలో తొలి పోస్టింగ్



విశాఖపట్నం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): భారత నౌకాదళంలో హెలికాప్టర్ తొలి మహిళా పైలట్ లెఫ్టినెంట్ అనామిక రాజీవ్ బుధవారం విశాఖపట్నంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి నేవీ వైమానిక స్థావరం ఐఎన్ఎస్ డేగలో ఆమె విధులు నిర్వహించనున్నారు. నేవీ హెలికాప్టర్లలో సీ కింగ్, ఏఎల్‌హెచ్ ధ్రువ్, చేతక్, ఎంహెచ్-60ఆర్ సీ హాక్స్‌కు ఆమె సారథ్యం వహిస్తారు. నాలుగేళ్ల క్రితం నిఘా విమానం డార్నియర్‌లో తొలి మహిళా పైలట్‌గా శుభాంగి స్వరూప్ బాధ్యతలు చేపట్టారు. ఈసారి హెలికాప్టర్లను నడిపే బాధ్యత మహిళలకు అప్పగించారు. అందులో అనామికకు మొదటి అవకాశం లభించింది. అనామిక రాజీవ్ స్వస్థలం కేరళలోని తిరువనంతపురం. ఆమె తమిళనాడులోని ఐఎన్ఎస్ రజాలీలో హెలికాప్టర్ శిక్షణ పొందారు. అక్కడ ప్రతిభా పాటవాలు ప్రదర్శించి ఆరు నెలల క్రితం తూర్పు నౌకాదళం చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్ చేతులు మీదుగా 'గోల్డెన్ వింగ్స్'ను పొందారు. ఆమెకు తొలి పోస్టింగ్ విశాఖపట్నం ఐఎన్ఎస్ డేగలో ఇచ్చారు.

కోచింగ్ 'కోట'కు బీటలు

కోటాలోని కోచింగ్ సెంటర్లలో 40% మేర తగ్గిన ప్రవేశాలు



- తీవ్ర సంక్షోభంలోకి హాస్టళ్లు
- చిరు వ్యాపారులపైనా ప్రభావం
- ఐదో వంతుకు పడిపోయిన అద్దెలు

కోటా.. జాతీయస్థాయిలో పేరొందిన కోచింగ్ సెంటర్ల కేంద్రం! నీట్, యూపీఎస్సీ, ఐఐటీ జేఈఈ.. తదితర ప్రవేశపరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి, జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలనుకునే విద్యార్థుల తొలి గమ్యస్థానం!! కానీ.. లక్షలాది మంది విద్యార్థులతో కళకళలాడిన కోటా ఇప్పుడా పూర్వవైభవాన్ని కోల్పోయింది! విద్యార్థుల ఆత్మహత్యల సంఖ్య పెరుగుతుండడంతో.. అక్కడి శిక్షణ కేంద్రాల్లో కొత్తగా చేరే విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది. నిరుటితో పోలిస్తే ఈ ఏడాది ఆ సంఖ్య 30-40% మేర పడిపోయింది. ఆ ప్రభావం.. హాస్టళ్లు, మెస్‌లు, ఇతర చిరువ్యాపారాలపై తీవ్రంగా పడుతోంది!! రద్దీ లేని రోడ్లు.. ఎటు చూసినా 'అద్దెకు', 'అమ్మకానికి' అనే బోర్డులు.. ఇదీ ఇప్పుడు అక్కడి పరిస్థితి!!

కోటా, డిసెంబరు 25: విద్యార్థులను వారి జ్ఞానంతో కాకుండా.. బట్టీపట్టడం ద్వారా వచ్చే మార్కులతో, ర్యాంకులతో మాత్రమే కొలిచే సమాజం మనది. అలాంటి చదువుల'బట్టీ'లకు పేరొందిన నగరం.. రాజస్థాన్‌లో మూడో అతిపెద్ద నగరమైన కోటా. కండరాలు క్షీణించే (మస్క్యులర్ డిస్ట్రోఫీ) వ్యాధితో చక్రాల కుర్చీకే పరిమితమైన వినోద్ కుమార్ బన్సల్ అనే ఐఐటీ పట్టభద్రుడు.. 1991లో ఎనిమిది మంది విద్యార్థులకు తన ఇంట్లో డైనింగ్ టేబుల్ వద్ద మొదలుపెట్టిన శిక్షణ కోటాలో కోచింగ్ కేంద్రాల విస్ఫోటానికి కేంద్ర బిందువు. ఆయన దగ్గర శిక్షణ పొందిన ప్రమోద్ మహేశ్వరి అనే మరో ఐఐటీ పట్టభద్రుడు 'కెరీర్ పాయింట్' పేరుతో మరో కోచింగ్ కేంద్రాన్ని ప్రారంభించాడు. అలా ఒకదాని తర్వాత ఒకటిగా వందల సంఖ్యలో కోచింగ్ సెంటర్లు పుట్టుకురావడంతో కోటా దేశంలోనే అతిపెద్ద 'ప్రవేశ పరీక్షల శిక్షణ కేంద్రం'గా మారిపోయింది. ఎలెన్, రెజొనెన్స్, మోషన్, అన్అకాడమీ, ఫిజిక్స్‌వాలా, ఆకాశ్, సర్వోత్తమ్.. ఇలా జాతీయస్థాయిలో పేరొందిన కోచింగ్ దిగ్గజాలతోపాటు చిన్నాచితకా శిక్షణ కేంద్రాలతో దాదాపు రెండున్నర దశాబ్దాలుగా కళకళలాడుతూ వస్తున్న కోటా నగరం ఈ ఏడాది చిన్నబోయింది. కోటాలో విద్యార్థుల ఆత్మహత్యల గురించి విస్తృతంగా ప్రచారం జరగడం, కోచింగ్ సెంటర్లను నియంత్రిస్తూ ఈ ఏడాది జనవరిలో కేంద్ర సర్కారు తీసుకొచ్చిన కొత్త మార్గదర్శకాలు, ప్రముఖ కోచింగ్ సెంటర్లు దేశవ్యాప్తంగా తమ శాఖలను విస్తరించడం.. ఇలా రకరకాల కారణాల వల్ల కోటాకు వచ్చే విద్యార్థుల సంఖ్య ఈ ఏడాది బాగా తగ్గిపోయింది. అంకెల్లో చెప్పాలంటే.. సాధారణంగా కోటాకు ఏటా దాదాపు లక్షన్నర నుంచి రెండు లక్షల మంది దాకా విద్యార్థులు.. వివిధ ప్రవేశపరీక్షలకు సంబంధించిన శిక్షణ నిమిత్తం వస్తుంటారు. కానీ, ఈ ఏడాది ఆ సంఖ్య దాదాపు 85 వేల నుంచి లక్ష దాకా మాత్రమే ఉన్నట్టు సమాచారం. కోచింగ్ సెంటర్ల వల్ల అక్కడ జరిగే వ్యాపారం కిందటి సంవత్సరంగా దాకా ఏడాదికి రూ.6,500 కోట్ల నుంచి రూ.7 వేల కోట్ల దాకా ఉండేది. అది ఈ ఏడాది రూ.3,500 కోట్లకు పడిపోయింది!! కోచింగ్ సెంటర్లే కాదు.. విద్యార్థుల కోసం నిర్మించిన వేలాది హాస్టళ్లు సైతం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. కోటా నగరం మొత్తమ్మీదా ఇలా విద్యార్థుల కోసం నిర్మించిన హాస్టళ్లు 4,500 దాకా ఉంటాయని అంచనా. ఒకప్పుడు విద్యార్థులతో నిండిపోయి కళకళలాడిన ఈ హాస్టళ్లన్నీ.. ఇప్పుడు 40-50 శాతం ఆక్యుపెన్సీ కూడా లేక వెలవెలబోతున్నాయి. బ్యాంకుల్లో అప్పులు తీసుకుని హాస్టళ్లు నిర్మించి వాటిని నడిపినవారు.. ఇప్పుడు విద్యార్థులు లేక, రాబడి రాక.. బ్యాంకులకు నెలవారీ చెల్లింపులు చేయలేక ఇబ్బంది పడుతున్నారు. కిందటి సంవత్సరం దాకా నెలకు రూ.15 వేలు వసూలు చేసిన హాస్టళ్లు.. ఇప్పుడు రూ.9 వేలకే అన్ని సౌకర్యాలూ కల్పించడానికి సిద్ధమైనా పూర్తిగా నిండని పరిస్థితి నెలకొంది. అలాగే.. ఈ కోచింగ్ సెంటర్లపై ఆధారపడి జీవనం సాగించే జిరాక్స్ సెంటర్లు, స్టేషనరీ దుకాణాలవారు, ఆటో డ్రైవర్లు, హోటళ్లు, మెస్‌ల యజమానులు, వాటిలో పనిచేసే సిబ్బంది.. ఇలా లక్షలాదిమందిపై ఈ సంక్షోభం తీవ్ర ప్రభావం చూపుతోంది. అలాగే దుకాణాల అద్దెలు రూ.15 వేల నుంచి రూ.3 వేలకు పడిపోయాయి. అంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కోటాకు విద్యార్థుల రాక తగ్గిపోయి ఆ ప్రభావం స్థానిక ఆర్థిక వ్యవస్థపై పడడంతో.. అక్కడి వ్యాపారులు ఐటీ పరిశ్రమపై దృష్టి సారించారు.

24

రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం కోటాలో 2023లో ఆత్మహత్య చేసుకుని చనిపోయిన విద్యార్థుల సంఖ్య ఇది. 2022లో ఈ సంఖ్య 15 కాగా.. 2019లో 18 మంది, 2018లో 20 మంది, 2017లో ఏడుగురు, 2016లో 17 మంది, 2015లో 18 మంది చనిపోయారు. 2020, 2021 సంవత్సరాల్లో కరోనా కారణంగా కోటాలోని కోచింగ్ సెంటర్లన్నీ మూతపడడంతో ఆ రెండేళ్లూ విద్యార్థులు క్షేమంగా ఉన్నారు.

అలా మొదలైంది..

1994లో.. కోటాలోని కోచింగ్‌సెంటర్లకు చెందిన 15 మంది విద్యార్థులకు ఐఐటీల్లో ప్రవేశం లభించడంతో ఆ నగరం పేరు దేశవ్యాప్తంగా మారుమోగిపోయింది. ఆ తర్వాత ఏడాది ఏకంగా 51 మంది ఐఐటీల్లో సీట్లు సాధించడంతో.. అందులో ఐదుగురు టాప్100లో చోటు సాధించారు. 2000 సంవత్సరంలో.. ఐఐటీల్లో సీట్లు సాధించిన టాప్-10లో ముగ్గురు (1, 2, 7 ర్యాంకులు) కోటా విద్యార్థులే కావడంతో.. అక్కడి కోచింగ్ సెంటర్లకు దేశం నలుమూలల నుంచి విద్యార్థులు వెల్లువెత్తడం మొదలైంది.

లోకం తీరు

బీజేపీ నేతలు బహిరంగంగా ఓట్లు కొంటున్నారు: కేజ్రీవాల్



అతీశీని త్వరలో
తప్పుడు కేసులో అరెస్టు చేస్తారు

ఢిల్లీ ఎన్నికల నేపథ్యంలో కేజ్రీవాల్ జోస్యం

ఢిల్లీ, డిసెంబరు25: ఓ తప్పుడు కేసులో ఢిల్లీ సీఎం అతీశీని త్వరలో అరెస్టు చేస్తారని ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ కేజ్రీవాల్ జోస్యం చెప్పారు. అంతకంటే ముందే ఆప్ సీనియర్ నేతల ఇళ్లపై కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు దాడులు జరుపుతాయని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మహిళలకు నెలకు రూ.2,100 మహిళా సమ్మాన్ యోజన కింద ఇచ్చే పథకంతో పాటు వృద్ధులకు ఉచిత వైద్యం అందించే సంజీవని యోజన పథకానికి అనూహ్య స్పందన వస్తుండటంతో బీజేపీ అధిష్ఠానం బెంబేలెత్తిపోతోందన్నారు. అందుకే ఈడీ, సీబీఐ, ఐటీ ద్వారా అతీశీని తప్పుడు కేసులో అరెస్టు చేయించే యోచనలో ఉన్నారని కేజ్రీవాల్ ఆరోపించారు. మరోవైపు తనను తప్పుడు కేసులో అరెస్టు చేసినా.. తర్వాత నిజమేంటో అందరికీ తెలుస్తుందని అతీశీ చెప్పారు. మరోవైపు, 2013లో ఆమ్ ఆద్మీ పార్టీకి 40 రోజుల పాటు మద్దతు ఇవ్వడం వల్లే ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ బలహీనపడిందని, అదే తాము చేసిన పొరపాటని కాంగ్రెస్ పార్టీ నేత మాకెన్ అన్నారు.

కేజ్రీవాల్ శాంటాకారం



న్యూఢిల్లీ, డిసెంబరు 25: క్రిస్మస్ సందర్భంగా కేజ్రీవాల్ శాంటాక్లాజ్(క్రిస్మస్ తాత) అవతారమెత్తారు. ఆయన 'శాంటా' కారం దాల్చి మెర్రీ క్రిస్మస్ సందేశం ఇస్తున్నట్లు కృత్రిమ మేధ(ఏఐ)తో రూపొందించిన వీడియోను ఆప్ ఎక్స్‌లో షేర్ చేసింది. 'ఢిల్లీ సొంత శాంటా.. ఏడాది పొడవునా వరాలిస్తున్నారు' అని దానికి శీర్షిక పెట్టింది. రూ.2100 అని రాసి ఉన్న గిఫ్ట్ బాక్సును ఒక మహిళకు కేజ్రీవాల్ ఇస్తున్నట్లు ఆ వీడియోలో చూపారు. 'కేజ్రీవాల్ నెలనెలా రూ.2100 ఇస్తారు. ఆనందం తెస్తారు'.. అని అర్థం వచ్చే నేపథ్యంలో పాట ఈ వీడియోకే హైలైట్‌గా నిలిచింది.

పోల్ డేటాలో పొరపాట్లు జరగవు

ఓటింగ్ లెక్కల్లో వ్యత్యాసం వట్టిమాట.. కాంగ్రెస్ నేతలకు ఈసీ స్పష్టం

చండీగఢ్, డిసెంబరు 25: హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో పోలైన ఓట్లకు, లెక్కించిన ఓట్లకు మధ్య తేడా ఉన్నదంటూ కాంగ్రెస్ పార్టీ వ్యక్తంచేసిన అనుమానాలను భారత ఎన్నికల సంఘం(ఈసీ) తోసిపుచ్చింది. ఓటింగ్ డేటాలో వ్యత్యాసాలు కనిపిస్తున్నాయన్న ఆ పార్టీ వాదనను కొట్టి వేసింది. మహారాష్ట్రతోపాటు హరియాణా ఎన్నికల్లో పెద్దఎత్తున అవకతవకలు జరిగాయని అనుమానిస్తున్న కాంగ్రెస్.. దీనిపై పార్టీ స్థాయిలో కరణ్ దలాల్ నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటుచేసింది. ఈ కమిటీ సోమవారం భారత ఎన్నికల సంఘాన్ని కలిసి తన అభ్యంతరాలను వెల్లడించింది. అయితే, కాంగ్రెస్ వాదనలను ఈసీ కొట్టిపడేసింది. పోల్ గణాంకాలను మార్పు చేయడానికి వీలుఉండదని తెలిపింది. మొత్తం ఎంత ఓటింగ్ జరిగిందో తెలిపే 17-సీ ఫామ్, ప్రతి పోలింగ్ స్టేషన్‌లో ఓటింగ్ ముగిసిన తర్వాత పార్టీల అభ్యర్థుల ఏజెంట్లకు అందుబాటులో ఉంటుందని వివరించింది. "పోలైన ఓటింగ్ వివరాలను ప్రచురించాల్సిన చట్టబద్ధ బాధ్యత మాపై లేదు. అదంతా పోలింగ్ స్టేషన్ల పరిధిలోని వ్యవహారం" అని వివరించింది. కొన్ని సందర్భాల్లో.. మొత్తం ఓటింగ్‌కు, లెక్కించిన ఓట్లకు మధ్య వ్యత్యాసం ఉండే అవకాశం ఉందని ఈసీ అంగీకరించింది.








కజకిస్థాన్‌లో కుప్పకూలిన విమానం

38 మంది ప్రయాణికుల మృతి

మాస్కో, డిసెంబరు 25: కజకిస్థాన్‌లో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. అజర్‌బైజాన్ నుంచి రష్యా వెళుతున్న విమానం అక్టౌ విమానాశ్రయానికి 3 కి.మీ. దూరంలోని భూముల్లో కూలిపోయింది. ఈ ప్రమాదంలో 38 మంది మరణించారు. మరో 29 మంది తీవ్రంగా గాయపడ్డారు. విమానంలో ఐదుగురు సిబ్బంది సహా 67 మంది ఉన్నారు. అజర్‌బైజాన్‌కు చెందిన ఈ విమానం రాజధాని బాకూ నుంచి రష్యాలోని గ్రోజ్నీకి వెళుతోంది. అక్కడ మంచు వల్ల దారి మళ్లించారు. కూలిపోవడానికి ముందు అక్టౌలో అత్యవసర ల్యాండింగ్‌కు అనుమతి కోరారు. విమానం పక్షుల గుంపును ఢీకొందని, దాంతో పైలట్లు 'డిస్ట్రెస్ సిగ్నల్' పంపారని సమాచారం. అక్కడ దిగే క్రమంలోనే కీలక వ్యవస్థలు విఫలమయ్యాయి. విమానం అకస్మాత్తుగా కిందకు వచ్చేయడం, అంతలోనే కూలి మంటలు రేగిన దృశ్యాలు ఓ వీడియోలో కనిపించాయి.

తప్పుగా మాట్లాడలేదు

(మొదటి పేజీ తరువాయి)



వాజపేయి శత జయంతి సందర్భంగా బుధవారమిక్కడ బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అధ్యక్షతన ఆయన నివాసంలో జరిగిన ఎన్డీయే నేతల భేటీలో అమిత్ షా మాట్లాడారు. ఈ సమావేశంలో టీడీపీ అధినేత చంద్రబాబు, కేంద్ర మంత్రులు కుమారస్వామి(జేడీఎస్), జితన్ మాంఝీ(హెచ్ఏఎం) లలన్‌సింగ్(జేడీయూ), అనుప్రియా పటేల్(అప్నాదళ్-ఎస్), పెమ్మసాని చంద్రశేఖర్ (టీడీపీ), ఆర్ఎల్ఎం అధ్యక్షుడు ఉపేంద్ర కుష్వాహా తదితరులు పాల్గొన్నారు. ఇటీవలి పార్లమెంటు సమావేశాలు, రాజ్యాంగంపై జరిగిన చర్చ, అంబేడ్కర్ అంశం, సుపరిపాలన, రాజకీయ వ్యూహాలపై చర్చించారు. పార్లమెంటు లోపల, బయట మరింత సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. అంబేడ్కర్‌పై తన వ్యాఖ్యలను కాంగ్రెస్ వివాదం చేస్తోందని షా నేతలతో అన్నారు. వాజపేయి జయంతిని పురస్కరించుకుని సమావేశాలు ఏర్పాటుచేసి ఆయన వారసత్వాన్ని స్మరించుకోవాలని ఎన్డీయే నిర్ణయించింది. సమావేశంపై నడ్డా 'ఎక్స్' వేదికగా స్పందించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ అపూర్వ మైలురాళ్లను చేరుకుంటూ ప్రపంచ సూపర్ పవర్‌గా తనను తాను నిలబెట్టుకుందన్నారు.

10వేల పీఏసీలను ప్రారంభించిన షా

అమిత్‌షా 10వేల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీల)తో పాటు పాడి మత్స్య సహకార సంఘాలను ప్రారంభించారు. రానున్న ఐదేళ్లలో దేశవ్యాప్తంగా 2 లక్షల పీఏసీలను ప్రారంభించే యోచనలో కేంద్రం ఉందని ఆయన తెలిపారు. సహకార సంఘాలలోని రైతులకు రూపే కిసాన్ క్రెడిట్ కార్డులతో పాటు మైక్రో ఏటీఎమ్‌లను పంపిణీ చేశారు. ప్రతి సహకార సంఘానికి ఒక మైక్రో ఏటీఎమ్‌ను సమకూరుస్తామన్నారు.

కేంద్ర గ్రాంట్ల దుర్వినియోగం

గ్రామీణాభివృద్ధి నిధుల పక్కదారిపై రాష్ట్రాలను తప్పుబట్టిన పార్లమెంటరీ కమిటీ

న్యూఢిల్లీ, డిసెంబరు 25: గ్రామీణాభివృద్ధి కోసం పంచాయతీరాజ్ సంస్థలకు కేంద్రం మంజూరుచేసిన గ్రాంట్ల వినియోగంలో రాష్ట్రాలు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని పార్లమెంటరీ కమిటీ తప్పుబట్టింది. రాష్ట్రాల్లో గ్రాంట్ల నిర్వహణ, నిధుల వినియోగం, రికార్డుల నిర్వహణ, ఆర్థిక నివేదికల రూపకల్పనలో తీవ్రమైన లోపాలున్నాయని కమిటీ గుర్తించింది. ఈ మేరకు రూపొందించిన నివేదికను కమిటీ ఇటీవల కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖకు సమర్పించింది. ఈ నెల మొదట్లో ఆ నివేదికను పార్లమెంటులో ప్రవేశపెట్టారు. అప్రాధాన్య అంశాలకు నిధులను మళ్లించడం, నిధుల వినియోగంలో పారదర్శకత లేకపోవడంపై కమిటీ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. 15వ ఆర్థిక సంఘం(2021-2026) సిఫారసుల ఆధారంగా కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా పంచాయతీరాజ్ సంస్థలు టైడ్, అన్‌టైడ్ గ్రాంట్లు పొందుతున్నాయి. 2026 మార్చి 31 నాటికి ఈ గ్రాంట్లు ముగిసిపోతాయి. టైడ్ గ్రాంట్లను శానిటేషన్, తాగునీటి సరఫరా, వర్షం నీటి సేకరణ, నీటి రీసైకిలింగ్, బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడం తదితర నిర్దిష్ట ప్రాథమిక పనులకు వినియోగిస్తారు. అన్‌టైడ్ గ్రాంట్లను రాజ్యాంగంలోని 11వ షెడ్యూల్‌లో పేర్కొన్న 29 రకాల పనులకు వినియోగిస్తారు. అయితే, టైడ్ గ్రాంట్ల కింద విడుదలైన నిధుల్లో గతనెల 21 నాటికి దాదాపు 45% వరకు యూపీ వినియోగించుకోలేకపోయిందని కమిటీ తెలిపింది. అలాగే, మహారాష్ట్రకు విడుదలైన రూ.7,276 కోట్లలో రూ.5,023 కోట్లు ఇంకా వినియోగం కాలేదని తెలిపింది. తెలంగాణ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు నిధులను భారీగా అప్రాధాన్య అంశాలకు మళ్లించేశాయని తెలిపింది. ఆడిట్‌లలో తెలంగాణ(12,129 కేసులు), యూపీ(19,732 కేసులు) వెలుగుచూడటం పారదర్శకత లేమిని ఎత్తిచూపుతోందని పేర్కొంది.

కాంగ్రెస్.. శంకుస్థాపనల స్పెషలిస్ట్!



- ప్రాజెక్టులు 35-40 ఏళ్లు ఆలస్యం
- మధ్యప్రదేశ్‌లో ప్రధాని మోదీ ధ్వజం
- నదుల అనుసంధాన ప్రాజెక్టుకు శంకుస్థాపన

ఖజురహో, డిసెంబరు 25: గత కాంగ్రెస్ ప్రభుత్వాలపై ప్రధాని మోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేయడంలో ఆ పార్టీ స్పెషలిస్టు అని ఎద్దేవా చేశారు. పునాది రాళ్లు వేసినా.. ప్రాజెక్టులను 35-40 ఏళ్లు ఆలస్యం చేసిందని.. ఉత్తుత్తి ప్రకటనలు మాత్రమే చేస్తుందని.. ప్రజాప్రయోజనాలు దానికి పట్టవని ధ్వజమెత్తారు. బుధవారం మధ్యప్రదేశ్‌లోని ఖజురహోలో కెన్-బెత్వా నదుల అనుసంధానానికి ఆయన శంకుస్థాపన చేశారు. దేశంలో జలసంరక్షణ చర్యలను కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని.. ముఖ్యంగా బుందేల్‌ఖండ్ వంటి ప్రాంతాల్లో రైతుల అవసరాలను గుర్తించడంలో విఫలమయ్యాయని ఈ సందర్భంగా జరిగిన సభలో చెప్పారు. అంబేడ్కర్‌ను అమిత్‌షా అవమానించారంటూ ఉద్యమిస్తున్న కాంగ్రెస్‌పై మండిపడ్డారు. దేశ జలసంరక్షణ విధానాల రూపకల్పనలో అంబేడ్కర్ పాత్ర చాలా ఉందని, నేడు కేంద్ర జలసంఘం ఉనికి ఉందంటే ఆయన చొరవ, దూరదృష్టే కారణమని చెప్పారు. ఆయన కృషిని కాంగ్రెస్ ఏనాడూ గుర్తించలేదని, ఆయనకు ఇవ్వాల్సినంత క్రెడిట్ ఇవ్వలేదని ఆక్షేపించారు. 'అధికారం తన జన్మహక్కు' అని కాంగ్రెస్ భావిస్తుంది. కానీ సత్పరిపాలన అందించడంలో విఫలమైంది. శంకుస్థాపనలు చేసిన తర్వాత దశాబ్దాలపాటు ప్రాజెక్టుల జోలికి వెళ్లలేదు. కాంగ్రెస్, ప్రభుత్వం కలిసి సాగవు' అని వ్యాఖ్యానించారు. నీటి కొరతను నివారించడానికి నదుల అనుసంధాన ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. ఈ 21వ శతాబ్దిలో సమృద్ధిగా నీరు, నీటి ప్రాజెక్టుల సమర్థ నిర్వహణ ఉన్న దేశాలే ముందుకెళ్తాయన్నారు. మధ్యప్రదేశ్‌లో గ్రామీణాభివృద్ధి కోసం 1,153 అటల్ గ్రామ సేవాసదన్‌లు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ బెత్వా, కెన్ నదుల జలాలను రెండు కలశాల్లో ఆయనకు అందజేశారు. ఆ నీటితో అనుసంధాన ప్రాజెక్టు నమూనాను ఆయన అభిషేకించారు.

వాజపేయికి ప్రధాని నివాళి

మాజీ ప్రధాని వాజపేయి శత జయంతి సందర్భంగా బుధవారం ఢిల్లీలోని 'సదైవ్ అటల్'(వాజపేయి స్మారకం పేరు) వద్ద రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్, ప్రధాని మోదీ తదితర ప్రముఖులు నివాళులర్పించారు. వాజపేయి రాజ్యాంగ విలువలకు కట్టుబడిన తీరు ఎల్లకాలం గుర్తుండిపోతుందని మోదీ ఈ సందర్భంగా అన్నారు. సదైవ్ అటల్ వద్ద వాజపేయికి నివాళులర్పించిన వారిలో ఏపీ సీఎం చంద్రబాబు కూడా ఉన్నారు. వాజపేయి దూరదృష్టి వల్లే భారత్ ప్రపంచ దేశాలతో పోటీ పడుతోందని ఆయన అన్నారు.

కెనడా కాలేజీలపై ఈడీ దర్యాప్తు

మహారాష్ట్ర, గుజరాత్‌లోని 8 చోట్ల సోదాలు

న్యూఢిల్లీ, డిసెంబరు 25: కెనడా సరిహద్దుల మీదుగా అమెరికాలోకి భారతీయులను అక్రమంగా తరలిస్తున్న వ్యవహారంపై ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. ఇందులో కొందరు భారత్‌కు చెందిన వ్యక్తులు, సంస్థలతో పాటు కెనడాలోని కొన్ని కాలేజీల పాత్ర ఉందని చెబుతోంది. గుజరాత్‌లోని డిగుంచా గ్రామానికి చెందిన నలుగురు సభ్యుల కుటుంబం 2022 జనవరి 19న కెనడా-అమెరికా సరిహద్దును అక్రమంగా దాటడానికి ప్రయత్నించింది. అక్కడ చలి తీవ్రతకు తట్టుకోలేక వారంతా మృత్యువాత పడ్డారు. ఈ కేసులో భవేశ్ అశోక్‌భాయ్ పటేల్‌తో పాటు మరికొందరిపై మనీలాండరింగ్ చట్టం కింద ఈడీ కేసు నమోదు చేసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ముంబై, నాగ్‌పూర్, గాంధీనగర్, వడోదరల్లోని ఎనిమిది ప్రాంతాల్లో ఈ నెల 10, 19 తేదీల్లో అధికారులు సోదాలు నిర్వహించారు. కెనడియన్ కాలేజీల్లో అడ్మిషన్ల నెపంతో నిందితులు మానవ అక్రమ రవాణాకు పాల్పడే సంస్థలతో చేతులు కలిపి, భారతీయులను కుట్రపూరితంగా దేశ సరిహద్దులు దాటిస్తున్నారని, ఆ తర్వాత కెనడా మీదుగా అక్రమంగా అమెరికాకు తరలిస్తున్నారని వెల్లడించారు. వీరిలో ఒక్కొక్కరి నుంచి రూ.55లక్షల నుంచి రూ. 65లక్షల వరకూ వసూలు చేస్తున్నారని ఈడీ పేర్కొంది. ముందుగా వీరికి కెనడియన్ స్టూడెంట్ వీసా మంజూరు చేస్తారని, వారు ఆ దేశానికి వెళ్లిన తర్వాత అక్కడి కాలేజీలో చేరకుండా సరిహద్దులు దాటి చట్ట విరుద్ధంగా అమెరికాలోకి పోతున్నారని తెలిపింది. విదేశీ వర్సిటీల్లో భారతీయ విద్యార్థులకు అడ్మిషన్లు ఇప్పించడానికి ముంబై, నాగపూర్‌లో రెండు సంస్థలు కమీషన్ ప్రాతిపదికన పనిచేస్తున్నట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో వారి ప్రమేయంపై దర్యాప్తు చేస్తున్నామని ఈడీ తెలిపింది.

కర్త, కర్మ, క్రియ.. కేటీఆరే!

(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నించారు. ప్రస్తుతం తమకు అందుబాటులో ఉన్న ఫైళ్ల ప్రకారం నిధుల మళ్లింపు అంతా నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని.. దీనికి కర్త, కర్మ, క్రియ అంతా నాటి పురపాలక శాఖ మంత్రి కేటీఆరేనని దానకిషోర్ స్పష్టం చేసినట్లు సమాచారం. నోట్ ఫైల్ తర్వాత ఒప్పందం జరగడానికి నెలపైగానే సమయం పడితే, అంతకుముందే నిధులు విడుదల చేయడం పూర్తిగా నిబంధనల ఉల్లంఘనేనని, అనుమానాస్పద వ్యవహారమని ఆయన పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఎఫ్ఈఓకు, పురపాలక శాఖకు మధ్య గత ఏడాది అక్టోబరు 30న ఒప్పందం జరగ్గా.. అక్టోబరు 3, 11వ తేదీల్లోనే ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు నుంచి రూ.46 కోట్లను ఎఫ్ఈఓకు పంపడంపై ఏసీబీ అధికారులు స్పష్టత తీసుకున్నట్లు సమాచారం.

సీఎస్‌ను పరిగణనలోకి తీసుకోకుండానే..

ఏ శాఖకు సంబంధించి అయినా నాన్ బడ్జెట్ నిధులు వాడాలంటే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమాచారం ఇచ్చి ఫైళ్లను ఆర్థిక శాఖకు పంపాల్సి ఉంటుందని, సీఎం లేదా సంబంధిత మంత్రి ఆమోదిస్తేనే ఇది సాధ్యం అవుతుందని, కేటీఆర్ ఆదేశాల మేరకే తాను నిధులను పంపానని అర్వింద్‌కుమార్



అంగీకరించిన విషయాన్ని దానకిశోర్ అధికారులకు చెప్పినట్లు తెలిసింది. అర్వింద కుమార్ అప్పట్లో పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదాలో ఉండడంతో సీఎస్‌ని కూడా పరిగణనలోకి తీసుకోకుండా ఫైళ్లను నడిపించారని తెలుస్తోంది. గత ఏడాది జనవరిలో శాంతికుమారి సీఎస్‌గా నియమితులైనప్పటికీ పురపాలకశాఖ ఫైళ్లు ఆమె వద్దకు రాకుండానే పరుగులు తీసేవని సమాచారం. ఈ క్రమంలో అర్వింద‌కుమార్‌ను విచారించిన తర్వాతే కేటీఆర్‌కు నోటీసులు ఇవ్వాలని ఏసీబీ అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకటిరెండు రోజుల్లో అర్వింద‌కుమార్‌కు నోటీసులు ఇవ్వనున్నట్లు సమాచారం. అయితే హైకోర్టు కేటీఆర్‌కు ఇచ్చిన గడువు ఈ నెల 30న ముగుస్తుండడంతో ఆ తర్వాతే నోటీసులకు వెళ్లాలా? అని కూడా ఆలోచిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఈ కేసు నుంచి తనను బయటపడేయాలని, అరెస్టు వరకు వెళ్లకుండా చూడాలని అర్వింద‌కుమార్ ప్రభుత్వానికి సందేశాలు పంపుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన్ను అప్రూవర్‌గా మార్చుకొని దర్యాప్తులో ముందుకు వెళ్లే యోచన కూడా చేస్తున్నట్లు సమాచారం. హైకోర్టు గడువు కొద్ది రోజులే ఉన్న క్రమంలో కేటీఆర్‌కు ముందే నోటీసులు ఇవ్వడం వల్ల ఎక్కువ ప్రచారం వచ్చే అవకాశం ఉంటుందని, కోర్టు తదుపరి ఉత్తర్వుల వరకు ఆగి, ముందుకు వెళ్లడం మంచిదని రాజకీయ వర్గాలు ప్రభుత్వానికి సూచించినట్లు తెలుస్తోంది.

లగచర్ల కేసులో కేటీఆర్‌ను ఇరికించాలనుకున్నారు

- నేను జడ్జికి లేఖ రాయడంతో ఆగిపోయారు
- దీంతో ఈ-రేస్ కేసులో అరెస్ట్‌కు యత్నం
- నన్ను అక్రమంగా జైల్లో పెట్టి పైశాచికానందం పొందారు
- అల్లు అర్జున్‌పై కూడా అక్రమ కేసే: పట్నం నరేందర్‌రెడ్డి
- బొంరాస్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో హాజరైన మాజీ ఎమ్మెల్యే



పరిగి/బొంరాస్‌పేట్, , డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనలో తనతోపాటు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కూడా ఇరికించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నించారని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆరోపించారు. ఇది అక్రమ కేసు అని, తాను జైలు నుంచే స్వయంగా జడ్జికి లేఖ రాసి కుట్రను భగ్నం చేశానని తెలిపారు. తాను పంపిన లేఖను జడ్జి పరిశీలించిన తర్వాతే కేటీఆర్ అరెస్టును ఆపారని చెప్పారు. లగచర్ల ఘటనతో కేటీఆర్‌పై కక్ష సాధించే అవకాశం దక్కకపోవడంతో ఫార్ములా ఈ-రేస్ పేరుతో అరెస్ట్ చేయించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. బుధవారం వికారాబాద్ జిల్లా పరిగిలో మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి నివాసంలో నరేందర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి పాలన అంతా డైవర్షన్ పాలిటిక్స్, కక్ష సాధింపులేనని ఆరోపించారు. తనను 37 రోజులు జైల్లో పెట్టి పైశాచికానందం పొందారని మండిపడ్డారు. దేశ చరిత్రలో ఓట్లు వేసి గెలిపించిన రైతులకు బేడీలు వేసి జైలుకు పంపిన ఘనత ఒక్క ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. లగచర్ల ఘటనకు నిఘా వ్యవస్థ, పోలీసుల వైఫల్యమే కారణమని, ఈ ఘటనతో ముఖ్యమంత్రి పరువు పోవడంతో దానిని బీఆర్ఎస్‌పైకి మళ్లించే ప్రయత్నం చేశారని నరేందర్ రెడ్డి విమర్శించారు. సినీ నటుడు అల్లు అర్జున్‌పై పెట్టింది కూడా అక్రమ కేసేనన్నారు. రైతు రుణమాఫీ కేవలం 30-40 శాతం మందికి మాత్రమే అయిందని, మొత్తం మాఫీ అయిందని చెబుతున్న సీఎంది నోరేనా? అని విమర్శించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడం చేతకాకపోతే పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, లగచర్ల ఘటనలో అరెస్టయి బెయిల్‌పై విడుదలైన పట్నం నరేందర్‌రెడ్డి.. కోర్టు ఆదేశాల మేరకు బుధవారం బొంరాస్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో హాజరయ్యారు. ప్రతి బుధవారం పోలీస్‌స్టేషన్‌లో హాజరు కావాలని కోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే.

ఆనందారణ్యం.. ఆధ్యాత్మికం!

టూరిజం ప్రత్యేక కారిడార్‌గా కవ్వాల్ అభయారణ్యం

- ఎకో, టెంపుల్ టూరిజంల కోసం రూట్‌మ్యాప్ సిద్ధం
- అభయారణ్యం, వాటర్‌ఫాల్స్, ప్రాజెక్టుల సందర్శనకు ఏర్పాట్లు
- బాసర, కదిలి, బూరుగుపల్లి ఆలయాల సందర్శనకు అవకాశం



కవ్వాల్ అభయారణ్యంలో వన్య ప్రాణులు

నిర్మల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పచ్చని ప్రకృతి.. పిల్లగాలులు.. సెలయేళ్లు, వాటర్‌ఫాల్స్ మధ్య వన్య ప్రాణులను చూస్తూ గడిపితే ఆ ప్రశాంతతే వేరు! దీనికి ఆధ్యాత్మిక వాతావరణం తోడైతే గనక అక్కడి నుంచి కదలబుద్దేయదు! మరి కొంత సమయం గడిపితే బాగుణ్ను అని అనిపిస్తుంది. ఇదే అనుభూతిని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కవ్వాల్ అటవీ ప్రాంతంలో పర్యాటకులను కట్టిపడేయనుంది. టూరిజం ప్రత్యేక కారిడార్‌గా కవ్వాల్ అభయారణ్యాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేయనుంది. ఇందుకు ఎకో టూరిజం (పర్యావరణహిత పర్యాటకం) పేరిట అధికారులు ప్రత్యేక ప్రతిపాదనలతో కూడిన రూట్ మ్యాప్ ను రూపొందించారు. ఈ రూట్‌మ్యాప్‌లో భాగంగా టెంపుల్ టూరిజాన్ని చేర్చనున్నారు. నిర్మల్ జిల్లాలోని బాసర సరస్వతీ ఆలయం, ఆ జిల్లాలోని కదిలి పాపహరేశ్వరాలయం, బూరుగుపెల్లి రాజరాజేశ్వర స్వామి ఆలయం, ఆదిలాబాద్ సమీపంలోని సూర్య దేవాలయం వంటి వాటన్నింటినీ కలిపి టెంపుల్ టూరిజం కారిడార్‌గా ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్టు, వాటికి ఆమోదం లభించి, ఆ తర్వాత నిధులు మంజూరైన వెంటనే పనులు మొదలు పెట్టేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కాగా, మహారాష్ట్రలోని తడోబా తరహాలో కవ్వాల్ టైగర్ జోన్‌ను కూడా టూరిజం కారిడార్‌గా తీర్చిదిద్దాలని అధికారులు నిర్ణయించారు. నిర్మల్, మంచిర్యాల జిల్లాల పరిధిలోని 80వేల హెక్టార్లల్లో విస్తరించి ఉన్న కవ్వాల్ టైగర్ జోన్‌లో 20శాతం మేర కోర్, బఫర్ ఏరియాల్లో మాత్రమే ఈ టూరిజం స్పాట్‌ను ఏర్పాటు చేయనున్నారు. అడవిలో సందర్శించేందుకు అనుకూలమైన ప్రదేశాలకు సంబంధించి ప్రత్యేక రూట్ మ్యాప్‌ను కూడా అధికారులు సిద్ధం చేశారు. ఈ టూరిజం స్పాట్ నిర్వహణను పీపీపీ (పబ్లిక్, ప్రైవేటు, పార్టీసిపేషన్) కింద నిర్వహించనున్నారు. నిర్మల్ జిల్లాలోని కడెం, గంగాపూర్, ఎక్బాల్‌పూర్, ఉడుంపూర్, కల్పకుంట్ల, అకొండపేట్, గంగాపూర్ ప్రాంతాలను ఈ టూరిజం స్పాట్ పరిధిలోకి చేర్చారు. కడెం మండలంలోని ఉడుంపూర్ వద్ద గల ఐలవ్ కవ్వాల్ లోగో ప్రాంతం నుంచి మైసంపేట్, గంగాపూర్, లక్ష్మీపూర్ ప్రాంతాలను చూసేందుకు ప్రత్యేకంగా సఫారీని ఏర్పాటు చేయనున్నారు. టూరిస్టుల కోసం దిమ్మదుర్తి వద్ద 12, జన్నారం వద్ద 10 చొప్పున కాటేజీలను నిర్మించాలని ప్రతిపాదించారు. ఈ టూరిజం స్పాట్ కింద కడెం ప్రాజెక్ట్‌ను కూడా కవర్ చేస్తున్నారు. కడెం ప్రాజెక్టు సమీపంలో దాదాపు 550 మీటర్ల ఎత్తున గల గుట్టపై అధికారులు ఇప్పటికే వాచ్ టవర్‌ను నిర్మించారు. టూరిస్టులను ఇక్కడి వరకు తీసుకువెళ్లి కడెం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రాంతంతో పాటు దట్టమైన అడవులను చూపించనున్నారు.



కడెం బ్యాక్ వాటర్‌లో బోటింగ్ చేస్తున్న దృశ్యం

అందమైన గడ్డిమైదానాలు

ప్రస్తుతం అటవీ శాఖ 50 ఎకరాల్లో ఇప్పటికే అందమైన గడ్డి మైదానాలను పెంచిన సంగతి తెలిసిందే. ఈ టూరిజం స్పాట్‌లో ఈ గడ్డి మైదానాలను కూడా చేర్చారు. మరో నెల రోజుల్లో మొత్తం ఈ టూరిజం స్పాట్ పనులన్నీ పూర్తి కానున్నాయి. ఇప్పటికే సఫారీ వాహనాలు తిరిగేందుకు రోడ్ల నిర్మాణాలను సైతం అధికారులు పూర్తి చేశారు. టైగర్ కన్జర్వేషన్ ప్లాన్ పేరిట ఎకో టూరిజం కోసం ఈ యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేశారు. ప్రత్యేక గైడ్‌లను కూడా నియమించనున్నారు. ఈ టూరిజం స్పాట్ నిర్వహణ మాత్రం పీపీపీ పద్ధతి కింద చేపట్టనుండగా.. ప్రత్యేక చెక్‌పోస్టుల వద్ద అటవీ శాఖ ఎంట్రీ ఫీజు వసూలు చేయనుంది.

బాయిలర్ కోళ్లకు వింత వ్యాధి

- రంగారెడ్డిలోని ఓ రైతు షెడ్డులో ఒక్కరోజే 650 కోళ్ల మృతి
- నాలుగు నెలలుగా వేలాది కోళ్ల మృత్యువాత

యాచారం/మంచాల, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా యాచారం, మంచాల మండలాల్లో బాయిలర్ కోళ్లు కొన్ని నెలలుగా వింత వ్యాధి బారిన పడి మృతి చెందుతున్నాయి. ఈ మండలాల్లోని యాచారం, చౌదర్‌పల్లి, కుర్మిద్ద, చిన్నతూండ్ల, మాల్, తమ్మలోనిగూడ గ్రామాలలోని కోళ్ల ఫారాలలో బాయిలర్ కోళ్లు పెద్ద సంఖ్యలో చనిపోతున్నాయి. మంచాలకు చెందిన శ్రీనాథ్‌రెడ్డి బాయిలర్ కోళ్లషెడ్డులో బుధవారం ఒక్కరోజే 650 కోళ్లు మరణించాయి. చౌదర్‌పల్లికి చెందిన జంగయ్య షెడ్డులో నెలక్రితం నాలుగు వేల కోళ్లు చనిపోయాయి. కోళ్లు ఆరోగ్యంగానే కనిపిస్తున్నా ఒక్కసారిగా చనిపోతుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మామూలుగా వేసవిలో ఎండ తీవ్రతకు కోళ్లు ఎక్కువగా చనిపోతుంటాయి. కానీ చలికాలంలో ఇలా జరగడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో విద్యుద్దీపాలతో కోళ్లకు వేడి తగిలే విధంగా చర్యలు తీసుకుంటున్నామని రైతులు చెబుతున్నారు. వందల సంఖ్యలో కోళ్లు చనిపోతుండటంతో నిర్వహణ భారం అధికమై అప్పుల పాలవుతున్నామని వాపోతున్నారు. కోడిపిల్లలను పంపిణీ చేసే కంపెనీలు తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల నిర్బంధంపై హరీశ్ ఆగ్రహం

- వారికి ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్

హైదరాబాద్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మెదక్ పట్టణంలో శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులను ముఖ్యమంత్రి పర్యటన ఉందంటూ శిబిరం నుంచి బలవంతంగా పోలీసు స్టేషన్‌కు తరలించిన ఘటనపై మాజీ మంత్రి హరీశ్ రావు బుధవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమగ్రశిక్ష ఉద్యోగుల టెంట్ల ముందు నుంచి వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి వారి టెంట్లు పీకేయించడంకాకుండా వారి సమస్య పరిష్కరిస్తే బాగుంటుందన్నారు. 15 రోజులుగా ఆందోళన చేస్తున్న వారి సమస్యను అర్థం చేసుకోవాలని కోరారు. గత ఏడాది ఎన్నికల ప్రచారంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే చాయ్ తాగినంత సేపట్లో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలు తీరుస్తానని, వారి ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేస్తానని హామీ ఇచ్చి.. ఏడాది గడిచినా ప్రభుత్వం నుంచి ఉలుకూపలుకూ లేదని విమర్శించారు. అన్ని వర్గాలను మోసం చేస్తున్న విధంగానే కాంగ్రెస్ పార్టీ వీరిని మోసం చేసిందని హరీశ్‌రావు మండిపడ్డారు. ఎన్నికలకు ముందు సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీఆర్ఎస్ తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నానన్నారు.

తెలంగాణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా శివచరణ్‌రెడ్డి



శివచరణ్ రెడ్డికి నియామక పత్రాన్ని అందిస్తున్న ఉదయ్ భాన్ చిబ్

న్యూఢిల్లీ, మన్సూరాబాద్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎల్బీ నగర్‌లోని మన్సూరాబాద్‌కు చెందిన జక్కిడి శివ చరణ్ రెడ్డి ఎన్నికయ్యారు. ఢిల్లీలో శివ చరణ్ రెడ్డికి జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్ భాన్ చిబ్ నియామక పత్రాన్ని అందజేశారు. కాగా శివ చరణ్ రెడ్డి ఇటీవల జరిగిన యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో రెండు లక్షలకుపైగా ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. దీనికి సంబంధించిన అధికారిక పత్రాన్ని ఢిల్లీలో ఆయనకు అందించారు.

బీసీ విదేశీ విద్యా నిధిలో జాప్యం

- ఈ ఏడాది రెండు సీజన్లలో 2,141 అర్జీలు
- నెలలు గడుస్తున్నా జరగని స్ర్కూటినీ
- దరఖాస్తుదారుల ఎదురుచూపు
- గత ఏడాది విద్యార్థులకు అరకొర నిధులు
- కొలిక్కిరాని లబ్ధిదారుల పెంపు అంశం

హైదరాబాద్/ఖమ్మం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లాలనుకునే బీసీ విద్యార్థులకు విదేశీ విద్యా నిధి కింద ప్రభుత్వం నుంచి రావాల్సిన సాయం ఆశించిన స్థాయిలో అందడంలేదు. అంతేకాకుండా ఈ పథకం కింద ప్రస్తుతం ఉన్న లబ్ధిదారుల సంఖ్య పెంపు అంశంలోనూ ప్రభుత్వం ఒక నిర్ణయానికి రాలేదు. వెరసి ఒకవైపు దరఖాస్తు చేసుకున్న వారికి ఆర్థిక సాయం అందకపోవడంతో పాటు, మరోవైపు లబ్ధిదారుల సంఖ్యను కూడా పెంచకపోవడంతో ఎంతో మంది విద్యార్థులు నిరాశకు గురవుతున్నారు. తెలంగాణలోని బీసీ విద్యార్థులు విదేశాలకు వెళ్లి ఉన్నత విద్యను అభ్యసించేందుకు వీలుగా గత ప్రభుత్వం 'మహాత్మా జ్యోతి బాపూలే విదేశీ విద్యా నిధి' పథకాన్ని 2017-18లో ప్రారంభించింది. ఈ పథకం కింద బీసీ సంక్షేమ శాఖ ఫిబ్రవరి-మార్చి, సెప్టెంబరులో.. ఒక్కో సీజన్‌కు 150 చొప్పున 300 దరఖాస్తులను స్వీకరిస్తోంది. ఇవీకాక ముఖ్యమంత్రి విచక్షణ కింద కొన్నింటికి అవకాశం కల్పించేవారు. 2024 ఫిబ్రవరిలో 1,119, సెప్టెంబరులో 1,022 చొప్పున రెండు సీజన్లకు కలిపి 2,141 దరఖాస్తులు వచ్చాయి. కానీ, ప్రభుత్వం సాయం అందించే 300 దరఖాస్తుల్లో ఇప్పటి వరకు ఎవరికీ సాయం అందించకపోవడం గమనార్హం. వచ్చిన దరఖాస్తులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించి నెలలు గడుస్తున్నా.. ఇప్పటి వరకు ఎవరు అర్హులో తేల్చే స్ర్కూటినీ చేయలేదు. దీంతో తమకు సాయం అందుతుందో లేదోనని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. అసలు పథకం అమలుకు ఎందుకు జాప్యం జరుగుతుందన్న విషయంలో స్పష్టత లేదు. మరోవైపు 2023-24 ఏడాదిలో అర్హులైన లబ్ధిదారులకు కూడా పూర్తిస్థాయిలో ఆర్థిక సాయం అందలేదు. ఒకరికి మొదటి విడత సాయం అందితే.. ఇంకొకరికి రెండో విడత సాయం అందలేదు. మరికొంతమందికి అసలు సాయమే అందలేదు. గతంలో పథకం కింద ఎంపికైన వారికి సాయం అందించేందుకు ప్రస్తుత ప్రభుత్వం 2024-25 బడ్జెట్‌లో రూ.80కోట్లను కేటాయించింది. వీటిలో రూ.15కోట్లను మంజూరు చేయగా, ఇప్పటి వరకు రూ.10 కోట్ల మేర మాత్రమే చెల్లింపులు జరిగాయి. అంటే కేటాయించిన నిధులను కూడా పూర్తిస్థాయిలో అందించలేదు. కాగా, బీసీ విదేశీ విద్యానిధి పథకం కింద విద్యార్థులకు గరిష్ఠంగా రూ.20లక్షల వరకు ప్రభుత్వం సాయం అందిస్తోంది.

కొలిక్కిరాని లబ్ధిదారుల పెంపు..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల పరిధిలో అమలవుతున్న విదేశీ విద్యా నిధి పథకంలో ఇప్పటి వరకు ఉన్న లబ్ధిదారుల సంఖ్యను పెంచాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఆయా శాఖల నుంచి ప్రభుత్వానికి లబ్ధిదారుల పెంపునకు సంబంధించిన ప్రతిపాదనలు కూడా వెళ్లాయి. వాటి ప్రకారం.. బీసీ విదేశీ విద్యానిధిలో ప్రస్తుతం ఉన్న 300 దరఖాస్తులను 800 చేయాలని (ఫిబ్రవరి, సెప్టెంబరులో 250 చొప్పున 500, సీఎం కోటా కింద 300), ఎస్సీ శాఖలో ప్రస్తుతం ఉన్న 210 దరఖాస్తుల సంఖ్యను 500 వరకు చేయాలని, ఎస్టీలో ఉన్న 100ను 450-500 వరకు చేయాలని, మైనారిటీలో ఉన్న 500 సంఖ్యను కొంత మేర పెంచాలని ఆయా శాఖల అధి కారులు ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనల్లో పేర్కొన్నట్టు తెలిసింది. అయితే, నెలలు గడుస్తున్నా ఇంత వరకు వీటిపై ఒక నిర్ణయం తీసుకోలేదు. దీంతో అసలు లబ్ధిదారుల సంఖ్య పెరుగుతుందా..? లేదా..? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

వీవోఏను తొలగించినందుకు కలెక్టర్‌పై కేసు!

- మరో 11 మంది అధికారులపై కూడా..
- జనగామ కోర్టు ఆదేశాలతో నమోదు



స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామైఖ్య సంఘాల సహాయకురాలి (వీవోఏ)ని అకారణంగా విధుల నుంచి తొలగించినందుకు జనగామ జిల్లా పూర్వ కలెక్టర్ సహా 12 మంది అధికారులపై కేసు నమోదైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో అధికారులు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని తేల్చిన జనగామ కోర్టు వారిపై ఎఫ్ఐఆర్ నమోదుకు ఆదేశాలిచ్చింది. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తాటికొండకు చెందిన వీవోఏ చాడ సునీతపై 2020-21లో అవినీతి ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆ ఆరోపణలు అవాస్తవమని అధికారులకు మొర పెట్టుకుంది. అప్పటి కలెక్టర్ శివలింగయ్య వరకు వెళ్లినా పట్టించుకోకపోగా.. వీవోఏ విధుల నుంచి సునీతను తప్పించారు. అయితే తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమంటూ ఆమె కొన్ని నెలల క్రితం కోర్టును ఆశ్రయించింది. దీంతో కోర్టు మహోదయ గ్రామైఖ్య సంఘానికి సంబంధించిన రికార్డులను పరిశీలించింది. అందులో ఆమె ఏ అక్రమాలకు పాల్పడలేదని గుర్తించింది. అకారణంగా సునీతను వీవోఏగా తొలగించి అధికార దుర్వినియోగానికి పాల్పడిన అధికారులపై కేసులు నమోదు చేయాలని ఘన్‌పూర్ పోలీసులకు కోర్టు ఈనెల 22న ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు పోలీసులు 12 మంది అధికారులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వారిలో అప్పటి కలెక్టర్ శివలింగయ్య, డీఆర్‌డీవో రాంరెడ్డి, అదనపు కలెక్టర్ హమీద్ అన్సారి, ఏపీడీ నూరొద్దీన్, ఏపీఎం కవిత, డీపీఎం సమ్మక్క, డీపీఎం వరలక్ష్మి, గోవర్ధన్, ఆనందం, పూర్ణచందర్, బానోతు రాములు, ఎలేందర్ ఉన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పురానవ మైత్రీ బంధం

నిష్క్రమించనున్న 2024, భారత్‌కు దౌత్య రంగంలో ఒక సంతృప్తికరమైన సంవత్సరం. చైనాతో సంబంధాలు, ఐదేళ్ల ఉద్రిక్తతల తగ్గదలతో మెరుగుపడ్డాయి. ఇతర ఇరుగు పొరుగు దేశాలలో శ్రీలంక, మాల్దీవులు భారత్‌తో సుస్థిర స్నేహ సంబంధాలు నెరపాల్సిన ఆవశ్యకతను గుర్తించాయి. నేపాల్, భూటాన్‌ల అభీష్టం ఏమైనప్పటికీ న్యూఢిల్లీని అవి దూరం చేసుకోలేవు. ఇక పాకిస్థాన్ దాయాది జగడాలు ఇప్పట్లో తీరేవి కావు. బంగ్లాదేశ్ నుంచి సంక్లిష్ట సవాళ్లు అనివార్యం. అవి మన దౌత్య దక్షతకు పరీక్షలే. ఇదలా ఉంచితే మనకు మరీ దగ్గరగాను, మరీ దూరంగాను లేని కువైత్‌తో భారత్ సంబంధాలలో ఒక సరికొత్త అధ్యాయం ప్రారంభం కావడం ముదావహం.

ఇటీవల కువైత్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటన చరిత్రాత్మకమైనది. భారత ప్రధానమంత్రి ఒకరు ఇందిరా గాంధీ అనంతరం ఆ గల్ఫ్ రాజ్యాన్ని సందర్శించడం ఇదే మొదటిసారి. మనస్పర్థలు, మనస్తాపాలు పూర్తిగా తొలగిపోయిన వాతావరణంలో మోదీ పర్యటన జరిగింది. దశాబ్దాలుగా కువైత్‌తో మన సంబంధాలు ఉండవలసిన రీతిలో ఉండకపోవడానికి బాధ్యత మనదే అని అంగీకరించక తప్పదు. ఇరాక్ 1990లో కువైత్‌ను దురాక్రమించినప్పుడు, న్యూఢిల్లీ కొన్ని కారణాల వల్ల కువైత్ సార్వభౌమత్వానికి మద్దతు నివ్వలేదు. ఇది కువైత్‌ను బాధించింది. కష్ట కాలంలో విరోధి ఎత్తిపొడుపుల కంటే మిత్రుడి మౌనమే ఎక్కువగా కలవరపరుస్తుంది కదా. కువైత్ సహజంగానే మన పట్ల కినుక వహించింది. అయితే భారతీయ కార్మికులు, వృత్తి నిపుణులను యథావిధిగా ఆహ్వానించినా ద్వైపాక్షిక సంబంధాలు ముక్తసరి స్థాయిలోనే ఉండిపోయాయి. ప్రపంచ ఆర్థిక శక్తిగా, భౌమ రాజకీయాలలో కీలక దేశంగా భారత్‌కు ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో న్యూఢిల్లీతో సంబంధాలను పటిష్ఠం చేసుకునేందుకు కువైత్ మళ్లీ సుముఖమయింది.

కువైత్‌తో భారత్ సంబంధాలకు పురాతన చరిత్ర ఉన్నది. సింధు నాగరికతకు పూర్వం నుంచే భారత్ పశ్చిమ తీర ప్రాంతాలు, కువైత్ మధ్య వాణిజ్య సంబంధాలు ఉన్నట్లు ఇటీవలి పురావస్తు తవ్వకాలు ధ్రువీకరించాయి. ప్రాచీన కువైత్ వ్యాపారులు తమ సహజ ముత్యాలు, అరేబియన్ గుర్రాలు, బస్రా ఖర్జూరాలను తీసుకువచ్చి మన వస్త్రోత్పత్తులు, సుగంధ ద్రవ్యాలను తీసుకువెళ్లేవారు. 1929 ప్రపంచ ఆర్థిక మాంద్యం ఈ ముత్యాల వ్యాపారాన్ని చావుదెబ్బ తీసింది. ఆ తరువాత కొద్ది కాలానికే కువైత్‌లో చమురు నిక్షేపాలు వెలుగులోకి రావడంతో వాణిజ్య సంబంధాలు దాదాపుగా క్షీణించిపోయాయి. అయినప్పటికీ 1961లో బ్రిటిష్ వలసపాలన నుంచి స్వాతంత్ర్యాన్ని పొందే వరకు కువైత్‌లో భారతీయ రూపాయి ఆ దేశ అధికారిక కరెన్సీగా ఉండేది.

వాణిజ్యం, ప్రజల స్థాయిలో జీవన బంధాలు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలకు సుదృఢ ప్రాతిపదికలు. కువైట్ వాణిజ్య భాగస్వాములలో భారత్ అగ్రగామిగా ఉన్నది. 2023–24లో ఉభయ దేశాల మధ్య దాదాపు 1100 కోట్ల డాలర్ల విలువైన ద్వైపాక్షిక వాణిజ్యం జరిగింది. గత ఆర్థిక సంవత్సరంలోనే కువైట్ మనకు సరఫరా చేసిన క్రూడాయిల్ మన మొత్తం ఇంధన అవసరాలలో 3 శాతాన్ని తీర్చింది. కువైత్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ మన దేశంలో పరోక్షంగా 1000 కోట్ల డాలర్లకు పైగా మదుపులు చేసింది. కొవిడ్ విలయంలో కువైత్‌కు మన దేశం రెండు లక్షల వ్యాక్సిన్ డోస్‌లు సమకూర్చింది. ఆ ఆపత్సమయంలో కువైత్ మనకు 282 ఆక్సిజన్ సిలెండర్లు, 60 ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు, వెంటిలేటర్లు తదితర వైద్య సామగ్రిని సరఫరా చేసింది. ప్రజల స్థాయిలో సంబంధాలను చూస్తే అరకోటి కువైత్ జనాభాలో పది లక్షలమంది ప్రవాస భారతీయులే. తమ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి వారు విశేషంగా దోహదం చేస్తున్నందునే కువైట్ పాలకులు సాధారణ సమయాలలోను, ఏవైనా ఆపదలు సంభవించినప్పుడు ఈ ప్రవాసులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్నారు.


నాలుగు దశాబ్దాల అనంతరం తమ అతిథిగా వచ్చిన భారత ప్రధానమంత్రికి కువైట్ రాచరిక పాలకులు అపూర్వరీతిలో స్వాగతం పలికారు; అతిథి మర్యాదలు ఘనంగా చేశారు. తమ అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ ముబారక్ అల్ కబీర్'ను మోదీకి ప్రదానం చేశారు. 'భారత్ నుంచి కువైత్‌కు చేరేందుకు నాలుగు గంటల ప్రయాణమే అయినా (భారత) ప్రధానమంత్రికి నాలుగు దశాబ్దాలకు పైగా పట్టిందని' నరేంద్ర మోదీ తన గౌరవార్థం కువైట్ అమీర్ షేక్ మెషాల్ అల్ అహ్మద్ అల్ జాబెర్ అల్ సబాహ్ ఇచ్చిన విందు సందర్భంగా వ్యాఖ్యానించారు. భారత్ కువైత్‌ల మధ్య మోసులెత్తిన కొత్త స్నేహ సంబంధాలు సుదీర్ఘకాలం పాటు నిరంతరంగా, సుస్థిరంగా వర్థిల్లాలని భారతీయులూ, కువైతీలూ ఆకాంక్షిస్తున్నారనడంలో సందేహం లేదు.

ఆరు దశాబ్దాల శ్యామ్ బెనెగల్ సృజనాత్మక జగత్తును గమనించినప్పుడు ఆయనను ఒక శైలికో, ఒక మూసకో, బండ సైద్ధాంతిక కట్టుబాట్లకో పరిమితం చేసి చూడటం ఏ మాత్రం వీలు కాదు. దానికి కారణం– చివరి శ్వాస దాకా భూమ్మీద ఉన్న ప్రతి విషయం మీద ఆయనకున్న తీవ్ర జిజ్ఞాస, కొత్త పరిణామాలను ఆహ్వానించే సహృదయ దృష్టి.

'భారత్' బెనెగల్

అది 1975–77ల సమయం. ఎమర్జెన్సీ పేరిట అంతవరకూ అనుభవంలో లేని మాంఛి దమన వ్యవస్థ చక్కగా రాజ్యమేలుతున్న కాలంలో 'అంకుర్', 'నిశాంత్' సినిమాలను, తొలి యవ్వనంలో, వెండి తెరపై చూసిన అనుభవం. ఫ్యూడల్ దోపిడీ వ్యవస్థను ఎదిరిస్తూ తిరుగుబాటు అంకురార్పితమై ('అంకుర్'లో), ఆ తిరుగుబాటు తీవ్ర స్థాయికెదిగి సంకెళ్లను తెంపి పారేయగలగడం ('నిశాంత్'లో) ఇతివృత్తంగా సాగే ఈ రెండు చిత్రాల్లో కనిపించిన తెలంగాణ సామాజిక వాస్తవ జీవనం, భౌగోళిక ప్రాకృతిక దృశ్యాల చిత్రీకరణ, నటీనటుల అద్భుతమైన నటన, గొప్ప సాంకేతిక విలువలు– మన గురించిన సినిమా ఇలా ఉండడం సాధ్యమేనా అని అచ్చెరువును కలిగించాయి.

ఎవరీ శ్యామ్ బెనెగల్, మన నేపథ్యంతో, మన జీవితాల గురించి ఇంత బలంగా ఎక్కడి నుంచి వస్తున్నాయి ఈ హిందీ సినిమాలు. మనసును తొలిచేసే ఈ కళాత్మకత, ఈ జీవన పరిశీలనం ఏమిటి, ఈ చిక్కని కథా సంవిధానం ఏమిటి అని ఆశ్చర్యం నుంచి బయటపడి కుదురుగా అతగాణ్ణి అర్థం చేసుకోవడానికి చాలా రోజులు పట్టింది. 1981 లోగా 'మంథన్', 'భూమిక', 'కోండురా/అనుగ్రహం', 'జునూన్', 'కల్ యుగ్' వంటి చిత్రాలు వచ్చేస్తూ ఉంటే, ఈ మహాశయుడు తొలి దృశ్యం నుంచి చివరి వరకు ప్రేక్షకుణ్ణి ఎలా కట్టివేస్తున్నాడు, ఎన్ని కొత్త పోకడలు పోతున్నాడు; వేరు వేరు ప్రాంతాల్లో, కాలాల్లో అక్కడి సామాజిక, సాంస్కృతిక వాతావరణంలో లీనమై, ఆ స్థానికతను ఇంత చక్కగా, ఒక్కొక్క చిత్రం ఒక్కొక్క శైలిలో ఎలా తెరమీద ఆవిష్కరించేస్తున్నాడు; ఎన్నెన్ని కోణాల నుంచి జీవితాన్ని, సమాజాన్ని, వ్యక్తులను పరిశీలించి ఆ వైవిధ్యాన్ని చూపిస్తున్నాడు అని మరింత ఆశ్చర్యపోవడం మిగిలింది.



వ్యాపారాత్మక హిందీ సినిమాలకు ఎదురుగా ధైర్యంగా నిలబడి, మీ గోల మీది, మీతో మాకు గొడవలేదు కాని ఇలా సినిమా తీసి చూపిస్తాము, విజ్ఞత కలిగిన ప్రేక్షకుల మన్ననలు పొందుతాం, జాతీయ అంతర్జాతీయ అవార్డులు, ఖ్యాతి గెలుచుకుంటాం అని ఆర్ట్ (కళాత్మక)/ప్యారలల్/న్యూ వేవ్ సినిమాకు ఒక దృఢమైన స్థావరాన్ని ఏర్పరచగలిగాడు శ్యామ్ బెనెగల్. ఇటువంటి దర్శకుడు హైదరాబాదులో పెరిగి, చదువుకొని, ఇక్కడి మిశ్రమ సంస్కృతిని బాగా ఒంట పట్టించుకున్నాడు. తెలంగాణ, హైదరాబాదు, ఆంధ్రప్రదేశ్ నేపథ్యంగా ఐదు సినిమాలు ('అంకుర్', 'నిశాంత్', 'కోండురా/అనుగ్రహం', 'మండి', 'సుస్మన్'), ఒక టెలివిజన్ సీరియల్ ('అమరావతి కథలు') హిందీలో తీయడం గొప్ప విశేషం.

> **దాదాపు మూడు దశాబ్దాల పాటు భారతీయ సినీరంగాన్ని, ముఖ్యంగా హిందీ సినీరంగాన్ని ఈ దేశపు అనేకానేక స్థానికతల వైవిధ్యంతో రంగరించి ఆయన ప్రభావితం చేసిన తీరు అసమానమైనది, శాశ్వతంగా నిలిచిపోయేది.**

ఒక మరాఠీ నవల కథను తెలుగు నేపథ్యంలో, వాణిశ్రీ నాయికగా, విశాఖపట్నం దగ్గర తీసిన 'కోండురా' (తెలుగులో 'అనుగ్రహం') దైవిక విశ్వాసాలు సమాజంలో పనిచేసే తీరు గురించి ఇప్పటికీ ప్రేక్షకులకు సవాలుగా నిలిచే సంక్లిష్ట చిత్రం. ఇక మిగతా నాలుగు చిత్రాల గురించి... తెలంగాణ, హైదరాబాదు నేపథ్యంగా వచ్చిన సినిమాల్లో ఇవే ఇప్పటికీ ఉత్తమమైనవని చెప్పడం ఏ మాత్రం సత్య దూరం కాదు. బెనెగల్ దర్శకత్వం వహించిన 24 ఫీచర్ నిడివి గల చలనచిత్రాల్లో గొప్ప కళాత్మక చిత్రాలుగా చిరకాలం నిలిచిపోయే వాటిలో 'నిశాంత్', 'భూమిక', 'జునూన్', 'కల్ యుగ్', 'మండి', 'త్రికాల్', 'సూరజ్ కా సాత్వాన్ ఘోడా'లను నిశ్చయంగా చెప్పుకోవచ్చు.

ఆయన తీసిన ఫీచర్ చిత్రాలన్నీ ఒక ఎత్తైతే, దాదాపు నాలుగు సంవత్సరాల కాలం వెచ్చించి విస్తృతమైన పరిశోధనల అనంతరం, ఒక ఏడాది పాటు నిర్మించి దూరదర్శన్ కోసం తీసిన 53 భాగాల 'భారత్ ఏక్ ఖోజ్', బృహత్తర చిత్రమాలిక ఒక ఎత్తు. జవహర్‌లాల్ నెహ్రూ 'డిస్కవరీ ఆఫ్ ఇండియా' పుస్తకం ఆధారంగా, పలు తావుల్లో దానిని దాటిపోతూ, 5000 సంవత్సరాల భారత ఉపఖండ చరిత్రను, బౌద్ధిక, సాంస్కృతిక, కళా వారసత్వాన్ని పరమాద్భుతంగా, విశ్లేషణాత్మకంగా, ధైర్యంగా 53 భాగాలను ఆవిష్కరించారు. నవంబర్ 1988 నుంచి నవంబర్ 1989 దాకా వారం వారం వాటిని చూస్తూ భారతీయ టెలివిజన్ ప్రేక్షకులు కనువిప్పుతో కూడిన గొప్ప మైమరపునకు గురయ్యారు. జీవితంలో ఒక్కసారే ఇటువంటి పనిని చేపట్టడానికి వీలవుతుంది. ఒక అద్భుత సాహస యాత్ర లాంటిది వ్యక్తిగతంగా నాకు 'భారత్ ఏక్ ఖోజ్' అని 1997లో హైదరాబాద్ ఆకాశవాణికి ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో బెనెగల్ చెప్పారు.

'ఏమి ఈ నా భారత్?' – ప్రతి తరంలోనూ ప్రతి భారతీయుడు ఎదుర్కొనే, ఓ మాటున ఏ మాటునా తెగని ప్రశ్న ఇది. ఆ ప్రశ్నతో మల్లగుల్లాలు పడుతూ జీవితకాలం నిలిచిపోయే అనుభవాన్ని పొందడానికి 'భారత్ ఏక్ ఖోజ్' 53 భాగాలు ఎప్పుడూ పనికివస్తాయి. అంత విలువైన కార్యక్రమాలు అవి. ఆయన మిగతా చిత్రాలను ఈ దృష్టితోనే చూడాలేమో!

ఆరు దశాబ్దాల శ్యామ్ బెనెగల్ సృజనాత్మక జగత్తును గమనించినప్పుడు ఆయనను ఒక శైలికో, ఒక మూసకో, బండ సైద్ధాంతిక కట్టుబాట్లకో పరిమితం చేసి చూడటం ఏ మాత్రం వీలు కాదు. దానికి కారణం చివరి శ్వాస దాకా భూమ్మీద ఉన్న ప్రతి విషయం మీద ఆయనకున్న తీవ్ర జిజ్ఞాస, కొత్త పరిణామాలను ఆహ్వానించే సహృదయ దృష్టి లాంటివి. అంతేగాక ఒక గొప్ప సినీ దర్శకుడికి ఉండాల్సినవన్నీ– సృజనాత్మక ధైర్యం, కళాత్మక సమన్వయ శక్తి, అనేకమంది ప్రతిభావంతులను కలుపుకొని వెంట తీసుకువెళ్లే సామర్థ్యం, ఒక కొలిక్కి వచ్చేదాకా ఈ మొత్తం సంక్లిష్ట వ్యవహారాన్ని నడిపి ముగించడం– ఆయనకు ఉన్నాయి. అందువల్లే 1970ల నుంచి దాదాపు మూడు దశాబ్దాల పాటు భారతీయ సినీరంగాన్ని, ముఖ్యంగా హిందీ సినీరంగాన్ని ఈ దేశపు అనేకానేక స్థానికతల వైవిధ్యంతో రంగరించి ఆయన ప్రభావితం చేసిన తీరు అసమానమైనది, శాశ్వతంగా నిలిచిపోయేది. అనేక కారణాల వల్ల, జీవితం చివరి రెండు దశాబ్దాల్లో ఆయన తీసిన చాలా చిత్రాల్లో ఆ గొప్పతనం లోపించింది. కళాకారుల జీవితాల్లో ఇటువంటివి సాధారణమే!

○ సుమనస్పతి


అందరూ అంబేడ్కర్ ఆరాధకులే!

డిసెంబరు 17న రాజ్యసభలో హోం మంత్రి అమిత్ షా, కాంగ్రెసుని ఎద్దేవా చేస్తూ, "అంబేడ్కర్! అంబేడ్కర్! అంబేడ్కర్! అంబేడ్కర్! అంబేడ్కర్! అంబేడ్కర్' అనడం ఇప్పుడు కొందరికి ఒక ఫ్యాషన్ అయింది. అదే, దేవుడి పేరుని అన్నిసార్లు పలికితే, ఏడు జన్మలవరకూ ('సాత్ జనమ్ తక్') వాళ్ళకు స్వర్గం దొరుకుతుంది" అన్నాడు! దానికి నిరసనగా ప్రతిపక్షాలు, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ఎంపీలు, "అమిత్ షా, అంబేడ్కర్‌ని ('అంబేడ్కర్ ఏమన్నా దేవుడా, అన్నిసార్లు అనడానికి?' అనే అర్థంతో) అవమానించాడు కాబట్టి, ఆయన క్షమాపణ చెప్పాలి! అమిత్ షా, మంత్రి పదవికి రాజీనామా చెయ్యాలి! ప్రధానమంత్రి ఆయన్ని మంత్రిగా తీసివెయ్యాలి!" అని ప్రదర్శనలు చేశారు. కాంగ్రెసు వారి నిరసనలకి వ్యతిరేకంగా, బీజేపీ ఎంపీలు కూడా పోటీ ప్రదర్శనలు చేశారు. ఈ రెండు పార్టీలూ, వాటి మిత్రపక్షాలూ చేసిన, చేస్తున్న వాదనలు ఇలా ఉన్నాయి:

"అంబేడ్కరు రాజ్యాంగశిల్పి! ఆయన్ని మీరు (బీజేపీ) అవమానించారు. అసలు మీకు రాజ్యాంగం మీద నమ్మకమే లేదు. మీ నమ్మకమంతా మనుస్మృతి మీదే! ఆ మనుస్మృతి పుస్తకాన్ని అంబేడ్కరు, 1927 డిసెంబరు 20న తగలపెట్టేశాడు. 1949 డిసెంబరులో, మీ ఆరెస్సెస్ వాళ్ళూ, హిందూమహాసభ వాళ్ళూ, అంబేడ్కరు దిష్టిబొమ్మని తగలబెట్టారు. అంబేడ్కరు రాసిన రాజ్యాంగం అంతా విదేశీయమైనదని దాన్ని ఖండించారు. మీ పదేళ్ళ పాలనలో, ఎస్సీల మీదా, ఎస్టీల మీదా 30 వేల, 4 వందల దాడులు జరిగాయి. అంబేడ్కర్ పెట్టిన రిజర్వేషన్లని క్రమంగా రద్దు చెయ్యాలని కుట్ర పన్నుతున్నారు." ఈ రకంగా సాగింది కాంగ్రెస్ వాదన!

"అంబేడ్కర్‌ని కాంగ్రెస్ గతంలో రెండుసార్లు ఎన్నికల్లో ఓడించింది. 'భారత రత్న' లాంటి అత్యున్నత బిరుదుల్ని మీ కుటుంబ సభ్యులకే మీరే ఇచ్చుకున్నారు గానీ, మహా మేధావి అయిన అంబేడ్కరుకి ఇవ్వలేదు. 1990లో, వీపీ సింగ్ ప్రభుత్వం మా పార్టీ మద్దతుతో నడుస్తూ, ఆ గొప్ప బిరుదుని అంబేడ్కరుకి ఇచ్చింది. అప్పట్లో, కర్ణాటకలో ఐదేళ్ళపాటు జరిగిన మీ పాలనలో ఎస్సీ ఎస్టీల మీద దాదాపు తొమ్మిదివేల దాడులు జరిగాయి. 1940లో అంబేడ్కరు, పాకిస్తాన్ గురించి రాస్తూ, 'ఇస్లాం మతం– మనుషుల్ని ముస్లింలుగానూ, ముస్లింలు కాని వారుగానూ విభజిస్తుంది' అని విమర్శించాడు. మీరేమో, ఓట్లకోసం మమ్మల్ని మతతత్వవాదులుగా విమర్శిస్తూ, హిందువులకు వ్యతిరేకంగా ముస్లింలను బుజ్జగిస్తున్నారు. 1939లో అంబేడ్కరు, ఆరెస్సెస్ ఆఫీసుని సందర్శించి, వారి శాఖల్లో, కుల వివక్షలేదని గమనించి ప్రశంసించాడు." ఇది బీజేపీ వాదం!

ఈ రకంగా, రెండు ప్రధాన పార్టీల కూటములూ పరస్పరం– అంబేడ్కరుని మీరు అవమానించారంటే, కాదు మీరు అవమానించారని, ఒకరినొకరు పరుషపదాలతో వాదులాడుకున్నారు. ఇంగ్లీషూ, హిందీ టీవీల డిబేట్లలో, రెండు కూటముల మేధావి సమర్థకులు కూడా గొంతులు చించుకుని, 'అంబేడ్కర్ ఆశయాలను ఆచరించేది మేమంటే, మేము' అని పోటీలు పడి చెప్పుకున్నారు. కానీ, కొన్ని వాదనలకు ఇరు పక్షాలూ జవాబులు చెప్పలేకపోతున్నాయి. అయినా, కొన్నిటికి చరిత్రనించీ ఆధారాలను చూపుతున్నారు. ఉదాహరణకి, 1949 సెప్టెంబరు 7న, తనని కలిసిన ఆనాటి ఆరెస్సెస్ అగ్రనాయకుడైన గురు గోల్వాల్కర్‌తో అంబేడ్కరు ఏమన్నాడో కాంగ్రెస్ సమర్థకులు ఆ మాటల్ని కోట్ చేశారు. "ఆరెస్సెస్ ఒక విషవృక్షం లాంటిది. అది పీష్వాల పాలనని కలగంటున్నది! నేను దానితో ఉండడం సాధ్యం కాదు" అని అంబేడ్కరు అన్నాడని పాత పుస్తకాల నుంచీ, బీజేపీ వ్యతిరేకులు రుజువు చూపుతున్నారు!



> **ఏ సమాజంలో అయినా, పాలిత వర్గం నించీ వచ్చి పోరాడే అంబేడ్కర్ లాంటి సంస్కర్తల్ని, పాలక వర్గాలు తమలో ఇముడ్చుకోవడానికి ప్రయత్నిస్తాయి. ఎందుకంటే, అణచివేతకి గురయ్యే ప్రజల ప్రయోజనాలు కాపాడే మేధావికి, పాలకవర్గాలు ఒక ఉన్నత స్థానమూ, గౌరవమూ ఇచ్చినప్పుడు, ప్రజలు ఆ పాలకుల మీద కొన్ని భ్రమలతో ఉంటారు. ప్రజలు ఎంత కాలం భ్రమలలో ఉంటే అంత కాలం పాలన సాఫీగా సాగుతుంది. అందుకే, పాలకవర్గ పార్టీలు పోటీలు పడి మరీ అంబేడ్కర్‌ని పొగుడుతాయి.**

కొందరు కొన్నిటికి ఏ ఆధారాలూ చూపకుండా మాట్లాడుతున్నారు. ఆరెస్సెస్‌లో, కుల వివక్ష లేదని అంబేడ్కర్ మెచ్చుకున్నాడనే దానికి, బీజేపీ సమర్థకులు తారీకులూ దస్తావేజులూ చూపలేదు! రెండు పార్టీలూ చేసిన వాదనలలోనూ, కొన్నిటిని చెప్పి, కొన్నిటిని మరుగుపరిచి చేసిన వాదనలు కూడా ఉన్నాయి. ఉదాహరణకి, 'పాకిస్తాన్ లేదా దేశ విభజన' అనే పుస్తకంలో (సంపుటి–8, పేజీ–358), అంబేడ్కరు ఇస్లాం గురించి చేసిన విమర్శ గురించి మాత్రమే మాట్లాడి, అదే పుస్తకంలో అంబేడ్కరు హిందూమతం గురించి విమర్శ చేసినా, దాని గురించి బీజేపీ వారు మాట్లాడడం లేదట! ఇది, కాంగ్రెస్ వారి విమర్శ

"హిందువులు ఏమన్నా చెప్పనీ, హిందూ మతం అనేది స్వేచ్ఛా, సమానత్వమూ, సోదరభావమూ అనే వాటికి వ్యతిరేకమైనదే. ఆ రకంగా, అది ప్రజాస్వామ్యంతో పొసగదు (ఇన్ కంపాటిబుల్)" – ఈ మాటలు అంబేడ్కరు అన్నాడని బీజేపీ వ్యతిరేకులు చూపే రుజువులు.

ఈ కూటములు రెండింటిలోనూ, అంబేడ్కర్ పట్ల చూపే ఆరాధనాభావం గురించి రకరకాల వ్యాఖ్యానాలు వినవస్తున్నాయి. ఆ రెండు పార్టీల ఆరాధనా ప్రకటనలూ నిజం కావనీ, ఏ రాజకీయ పక్షమూ, ఆయన ఆశయాల ప్రకారం నడవడం లేదని, కొందరు మేధావుల అభిప్రాయం. రెండు పార్టీలూ కూడా, రాజకీయ అవకాశవాదాలతో ఉన్నాయని కూడా ఆ మేధావుల అభిప్రాయం. దళిత ఓటర్లకి ఆరాధ్యదైవమైనవాడిగా ఉన్న అంబేడ్కర్‌ని స్వంతం చేసుకుంటే, దాని వల్ల దళిత ఓట్లన్నీ ఎక్కువ శాతం తమకు పడతాయనేది పార్టీలకు తక్షణ ఎత్తుగడ అని మరో అభిప్రాయం.

ఇక్కడ ఎవరికైనా ఒక ప్రశ్న వస్తుంది. రావాలి. అధికారం కోసం తీవ్ర ఘర్షణపడే రెండు పార్టీలు, ఒకే వ్యక్తిని 'నా వాడు' అంటే, 'నా వాడు' అని పోటీలు పడి చెప్పుకుంటున్నారంటే, దానికి అర్థం ఏమిటై ఉంటుంది? ఆ వ్యక్తికి ఉన్న భావజాలంలో ఏదో ఒక అంశమో, కొన్ని అంశాలో, ఇరుపక్షాలకూ అవసరమైనవై, అంగీకారమై ఉండివుంటాయి. ఉదాహరణకి– ఈ విషయంలో కాంగ్రెస్ సంగతి చూద్దాం. 1945 జూన్‌లో అంబేడ్కరు ఒక పెద్ద పుస్తకం రాశారు. ఏమనీ? "కాంగ్రెసూ, గాంధీ, అస్పృశ్యులకు ఏమి చేశారు?" అని అద్భుతంగా విమర్శిస్తూ రాశారు అంబేడ్కరు. అది రాసిన రెండేళ్లకే అంబేడ్కరుని గాంధీ సలహా మీద నెహ్రూ ఆహ్వానించగా, అప్పటిదాకా తను కాంగ్రెస్ మీద చేసిన విమర్శని పక్కన పెట్టి అంబేడ్కర్, కాంగ్రెస్ ప్రభుత్వంలో న్యాయశాఖ మంత్రిగా చేరారు. చేరిన కొన్ని వారాలకే, కొత్త రాజ్యాంగం రాయడానికి ఏర్పాటుచేసిన కమిటీకి చైర్మన్‌గా కూడా అయ్యారు. చైర్మన్ హోదాలో 25–11–1949న కాంగ్రెస్ పార్టీని అంబేడ్కర్ ఇలా పొగిడారు... "ఈ రాజ్యాంగం పని ఎటువంటి గందరగోళానికీ ఆస్కారం లేకుండా ఒక పద్ధతిలో, ఒక క్రమశిక్షణతో నడవడానికి, రాజ్యాంగ సభలో కాంగ్రెస్ పార్టీ ఉండడమే కారణం. కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ వల్లనే, రాజ్యాంగంలో ప్రతీ అధికరణమూ ఎలా ఉంటుందో, ప్రతీ సవరణా ఎలా జరుగుతుందో ఖచ్చితంగా తెలిసేలాగ, డ్రాఫ్టింగ్ కమిటీ ఈ రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభలో ప్రవేశపెట్టగలిగింది. కాబట్టి, రాజ్యాంగం డ్రాఫ్టు, ఎటువంటి ఆటంకాలూ లేకుండా రావడానికి ఖ్యాతి అంతా కాంగ్రెస్ పార్టీకే చెందుతుంది." ఇంతలా తమ పార్టీని ప్రశంసించిన అంబేడ్కర్‌ని, కాంగ్రెస్ వారు స్వంతం చేసుకున్నారు. తమతో విభేదించి, నాలుగేళ్ళ తర్వాత వెళ్ళిపోయినా అంబేడ్కర్‌ని, 'రాజ్యాంగ శిల్పి' అని పిలుచుకుంటూనే ఉన్నారు! ఆయనకి 'భారత రత్న' ఎందుకు ఇవ్వలేదో మాత్రం చెప్పరు.

ఇకపోతే, బీజేపీకి అంబేడ్కరంటే ఇష్టం ఎందుకూ? హిందూ మతం మీద అంబేడ్కర్ తీవ్రమైన విమర్శలు చేసినప్పటికీ, బౌద్ధమతంలోకి మారినప్పటికీ, కాంగ్రెస్‌తో నాలుగేళ్ళ సంబంధాన్ని తెంచేసుకున్నందుకు బీజేపీకి అంబేడ్కరంటే ఆరాధన.

రెండు పక్షాలూ కూడా రాజ్యాంగం మీద ప్రమాణం చేసేవే కాబట్టి, ఆ రాజ్యాంగాన్ని తయారు చేసిన కమిటీకి చైర్మన్ అయిన అంబేడ్కర్‌ని, లోపల ఎలా వున్నా, నాలిక చివరినించైనా కీర్తిస్తాయి. ఆ రాజ్యాంగం, ప్రధానంగా సంపన్న వర్గాల ప్రయోజనాలను కాపాడేది. ఈ రెండు రాజకీయ పక్షాలేమో, ఆ సంపన్న వర్గాల పక్షాన నిలిచేవే! అట్లాంటి రాజ్యాంగం తయారై, 75 ఏళ్ళు కావచ్చింది కాబట్టి, ఆ సందర్భం పేరుతో, పార్లమెంటులో ఉపన్యాసాల పరంపర సాగింది. ఆ పరంపరలో అంబేడ్కర్‌ని కీర్తించడంతో పాటు, తమ వ్యతిరేక పార్టీని దూషించడం చేశాయి ఆ పార్టీలు.

నిచ్చెన మెట్ల సమాజంలో, శారీరక శ్రమలు చేసే అట్టడుగు కులానికి చెందిన కుటుంబం నించీ, అనేక కష్టాలు పడి, ఉన్నత స్థాయి మేధాశ్రమలు చేసే స్థితికి వచ్చిన ఆనాటి అతి కొద్దిమంది వ్యక్తుల్లో అంబేడ్కరు ఒక ప్రముఖుడు. అనేక సంవత్సరాలు అంటరానికులాల వారి కోసం పాటుబడిన సంస్కర్త ఆయన. ఏ సమాజంలో అయినా, పాలిత వర్గం నించీ వచ్చి పోరాడే ఇలాంటి సంస్కర్తల్ని, పాలక వర్గాలు తమలో ఇముడ్చుకోవడానికి ప్రయత్నిస్తాయి. ఎందుకంటే, అణచివేతకి గురయ్యే ప్రజల ప్రయోజనాలు కాపాడే మేధావికి, పాలకవర్గాలు ఒక ఉన్నత స్థానమూ, గౌరవమూ ఇచ్చినప్పుడు, ప్రజలు ఆ పాలకుల మీద కొన్ని భ్రమలతో ఉంటారు. ప్రజలు ఎంత కాలం భ్రమలలో ఉంటే అంత కాలమూ పాలన సాఫీగా సాగుతుంది. అందుకే, పాలకవర్గ పార్టీలు పోటీలు పడి మరీ అంబేడ్కర్‌ని పొగుడుతాయి. అవి కేవలం పొగడ్తలు మాత్రమే! కుల విధానానికి వ్యతిరేకమైన దృష్టితో మాత్రం కాదు. తమకు అనుకూలమైన రాజ్యాంగం తయారీలో పాల్గొన్నందుకు! ("పాలకవర్గం, పాలిత వర్గపు మేధావుల్ని ఎంత ఎక్కువగానైతే తనలో ఇముడ్చుకుంటుందో, అంత స్థిరంగానూ, అంత ప్రమాదకరంగానూ, దాని పాలన తయారవుతుంది" – 'కాపిటల్'లో, మార్క్సు)

■ నౌరోజీ

తీరానికి కాలు చాపే ఉన్నాం!

సాగర తీరం చూసినప్పుడల్లా
నీ గాయాలు తడుముతూనే ఉన్నాయి
కెరటాలు ఎగసినప్పుడల్లా
నీ జ్ఞాపకాలు తరుముతూనే ఉన్నాయి

నువ్వు ముప్పేట విరుచుకుపడి
రెండు పదులు దాటొచ్చిందేమోగానీ
అప్పటి నీ జ్ఞాపకాలింకా
గుండె గదుల్లో తాజాగానే ఉన్నాయి

ఎక్కడో దూరాన, సుమత్రా దీవుల్లో
భూమి పొరల్లోంచి మొదలైన నీ దాహార్తికి
సముద్రాన్నే మా మీదకు తరుముకొచ్చి
ఊడ్చుకుపోయింది అంతా ఇంతా కాదు

కట్టు బట్టలతో మిగులున్నా
కూడబెట్టుకోయిందురేమో
కొన ఊపిరితో మిగులున్నా
లేచి ఉసురుకోయిందురేమో

కడుపులో దాచుకున్న కాఠిన్యం ఏదో
కుండ బద్దలు కొట్టినట్టు
ఒక్క ఉదుటున లక్షలాది మందిని
పొట్టన పెట్టుకోవడం నీకే సాధ్యమైంది

నీ మనసు బోద్దైపోయాక...
ఒడ్డుకు కొట్టుకొచ్చిన చేపల్లా
ఎవరివారో, ఎక్కడెక్కడివారో
తీరం పొడుగునా, రుణం తీరినోళ్లే

నీవు వదిలి వెళ్ళిన భయమేదో
నీడలా వెంటాడుతూనే ఉంది
బ్రతుకు పోరు ఊగిసలాటలో
తీరం, తనవైపు లాగుతూనూ ఉంది

తీరం బతుకులంటేనే.. తీరిన బతుకుల్లా!
ఒడ్డును నమ్ముకొనే బతుకును నెట్టుకొస్తూ
చావు బ్రతుకుకూ మధ్య, కాటికి కాదు..
తీరానికి కాలు చాపే ఉన్నాం!

– వినోద్ కుత్తుం

('సునామీ' విషాదానికి నేటితో ఇరవయ్యేళ్లు)

అందరిదీ కాని ఈ అభివృద్ధిపై ఎక్కుపెట్టాల్సిన ప్రశ్నలు

'ఈ సమాజంలో భూమి ఎవరికాడ ఉంటే వాళ్లదే అధికారం అంతా. అయితే ఆ అధికారాన్ని ఎట్ల వాడతారు, ముఖ్యంగా ఏమీ లేని మా అసంటోల్ల మీద ఎట్ల వాడతారు అనేదే విషయం. వాల్ల ఉద్దేశంలో మాకు అసలు భూమే ఉండొద్దు, అన్నది మాకు అర్థమైంది. మా తాత ముత్తాతల్లెక్క మేము ఎన్నటికీ పాలేర్లు లెక్క బతకాలన్నదే వాల్ల ఉద్దేశం'. ఇది ఒక 40 ఏళ్ల సామాన్య ఆదివాసీ నాయక పోడు మహిళ అయిన పోషవ్వకు భూమి కోసం చేసిన పోరాటంలో కలిగిన అవగాహన. ఇక్కడ 'వాళ్లు' అంటే ఆ గ్రామంలోని ఆదివాసీయేతర ఆధిపత్య కులాలకు చెందినవాళ్లు. 'భూమి దళితుల, పేదల చేతుల్లో ఉన్నంత కాలం పనికిరానిది, విలువ లేనిది గానే ఉంటుంది. ఆ భూమి చేతులు మారిన మరుక్షణం, అభివృద్ధి పేరుతో దాని విలువ పదుల రెట్లు పెరిగిపోతుంది'. ఇది దళితులు, పేదల భూమి హక్కుల కోసం ఏళ్ల తరబడి పనిచేసిన దళిత నాయకుడు రెడ్డన్న అనుభవం. పై రెండు వ్యాఖ్యానాలూ కేవలం ఒక గ్రామానికో, ఒక ప్రాంతానికో లేదా కొంతమందికో, ఒకానొక కాలానికో పరిమితం కాదు. మొత్తం వ్యవస్థకు సర్వ కాలాల్లోనూ వర్తించేవి. కేవలం పాత్రధారులు మారతారంతే. ఆ ఒక్క గ్రామంలోని పెత్తందార్ల స్థానంలో మనం మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులను; ప్రభుత్వ అధికారులను, ఉద్యోగస్తులను, ప్రజలే ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులను, ప్రభుత్వంలోని మంత్రులను, సాక్షాత్తు ముఖ్యమంత్రిని కూడా ఊహించుకోవచ్చు. వారు వ్యవహరించే తీరు, ఆలోచనా ధోరణి ఒకటే.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ మధ్య పాలమూరు రైతు పండగ సభలో మాట్లాడుతూ– అభివృద్ధి, ఉద్యోగాలు కావాలంటే భూ సేకరణ చేయాల్సిందేననీ, రైతులు తమ భూములను త్యాగం చేయాల్సిందేననీ, కావాలంటే ఎకరానికి 10 లక్షల బదులు 20 లక్షల రూపాయలు ఇప్పిస్తా, ఆ డబ్బులతో మరోచోట భూములు కొనుక్కోవచ్చుననీ చెప్పారు. ఈ వ్యాఖ్యలు లగచర్ల భూ సేకరణ సందర్భంలో చెప్పినవి. అయితే ఇటువంటి వ్యాఖ్యలు చేసినవారిలో ఆయన మొదటి వ్యక్తీ కాదు, చివరి వ్యక్తీ కాబోరు. అధికారంలో ఉన్న వారందరూ, అధికారం ఉన్నప్పుడల్లా చేసే వ్యాఖ్యలే ఇవి. నాగార్జునసాగర్ నుండి మల్లన్నసాగర్ దాకా; సింగరేణి బొగ్గు గనుల నుండి, శ్రీ సిటీ గుండా, ఫార్మా సిటీ వరకూ; నిజాం కాలంలో నల్లొండ, వరంగల్ దొరల దాష్టీకాల నుండి ధరణి పేరుతో దోపిడీ దాకా; కొమరం భీం పోరాట కాలం నుండి కోయపోష గూడ ఆదివాసీ మహిళల పోరాటం దాకా ఎన్నో ఉదంతాలు... ఇవన్నీ భూమి బిడ్డల నుండి, శ్రామికుల నుండి భూమిని బలవంతంగా దూరం చేసినవే. లగచర్ల ప్రాంత భూసేకరణలో కేవలం ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల భూములే ఉండటం, ఇతర కులాల వారివి ఒక్క ఎకరా కూడా లేకపోవడాన్ని ఈ కోణంలోనూ అర్థం చేసుకోవచ్చు.

ప్రజలకు, ముఖ్యంగా మెజారిటీ శ్రామిక ప్రజలకు, తమ జీవనోపాధికి అవసరమైన భూమి, నీరు, అటవీ సంపద, శ్రమకు తగిన ఫలితం, కనీస పెట్టుబడి, విద్య వైద్యం నైపుణ్యం, సులువుగా దొరికే రుణ సదుపాయం వంటివి అందుబాటులో ఉంటే, వారిలో స్వతంత్రమైన ఆలోచన, వ్యక్తిత్వం, వ్యవహారం ఉంటాయి. వారి కష్టంతో వారు బతుకుతారు. ప్రభుత్వాల నుండి పెద్దగా ఏమీ ఆశించరు. వారి హక్కులను, ప్రభుత్వ వ్యవస్థల నుండి జవాబుదారీతనాన్ని మాత్రమే ఆశిస్తారు. అదే జరిగితే అధికారంలో ఉండే నాయకులు, ప్రజల డబ్బులతో జీతాలనూ లంచాలనూ హక్కుగా పొందే ప్రభుత్వ ఉద్యోగులు తమకు అలవాటైన ఆధిపత్య స్థానాన్ని వదులుకోవాల్సి ఉంటుంది. అందుకే, ప్రజలు నిరంతరం తమ మీద ఆధారపడాలి, ఆ ఆధారాన్ని ఆలంబన చేసుకుని అధికారాన్ని, ఆధిపత్యాన్ని, అంతులేని సంపదను కూడా ఎప్పటికీ తాము, తమ కుటుంబాలు, కులాలు మాత్రమే అనుభవించాలి. ఈ ఆలోచనకూ, ఆచరణకూ వ్యవస్థీకృత రూపమే నేటి సామాజిక రాజకీయ ఆర్థిక వ్యవస్థ.

> **ఒక పక్క వ్యవసాయం చేసే చిన్న, సన్నకారు రైతులు భూములు కొనలేని పరిస్థితి ఉంటే; రాజకీయ నాయకులు, ఉద్యోగులు, వివిధ వ్యవసాయేతర వృత్తుల్లో ఉన్నవారు గత ఇరవై ఏళ్లుగా విపరీతంగా వ్యవసాయ భూములను ఎందుకు కొంటున్నారు, ఎలా కొనగలుగుతున్నారు? గత పదేళ్లలో వేల ఎకరాల వ్యవసాయ భూమి వ్యవసాయేతర భూమిగా అంత తేలికగా ఎలా మారింది? గత ముప్పై ఏళ్లలో సగటు భూమి కమతాల విస్తీర్ణం ఎందుకు తగ్గింది? తెలంగాణలో వ్యవసాయం చేయగలిగినవారిలోనూ, శ్రామికులలోనూ భూమి లేని వారి సంఖ్య, కౌలుదార్ల సంఖ్య ఎందుకు పెరుగుతుంది? పట్టణాలలోను, గ్రామాలలోను సామాన్యులు సొంతంగా ఇల్లు సమకూర్చుకోలేని పరిస్థితి ఎందుకు వచ్చింది?**




రాజకీయ పార్టీల మధ్య ఈ విషయంలో ఏ విధమైన భేదాలు లేవు. సైబరాబాద్, పరిశ్రమలు, పట్టణీకరణ పేరుతో చంద్రబాబు; జల యజ్ఞం, ప్రత్యేక ఆర్థిక మండళ్ల పేరుతో రాజశేఖర్‌రెడ్డి; కాళేశ్వరం, కొత్త రాష్ట్రం అభివృద్ధి అవసరాలు, కొత్త జిల్లాల ఏర్పాటు పేరుతో కేసీఆర్; ఇప్పుడు ఫోర్త్ సిటీ, మూసీ అభివృద్ధి, ఉపాధి కల్పన పేరుతో రేవంత్‌రెడ్డి– అందరూ చేసేది ఒకటే. అధికారం అండతో ప్రజల భూములపై, జీవితాలపై పెత్తనం. కేవలం రూపాలు, పేర్లు మాత్రమే వేరు. వాటిని కప్పిపుచ్చటానికే ప్రజలు అడగకపోయినా పోటీపడి సంక్షేమ పథకాలను ప్రకటిస్తారు. మళ్లీ వాటి కోసం నిధుల సమీకరణ పేరుతో ప్రజల భూములకే ఎసరు పెడతారు. ఈ ప్రక్రియలో ప్రజలందరూ పరాజితులు కారు. అయా పరిస్థితులను బట్టి అవకాశాలు అందుకున్న కొంతమంది మధ్యతరగతి, మధ్య కులాల వారు, కొంతమంది అదృష్టవంతులూ లాభపడతారు. కాని భూమి లేని వర్గాలు, వ్యవసాయమే జీవనోపాధిగా కలిగి భూమిని కోల్పోయినవారు మాత్రం తీవ్ర నష్టానికి, అసమానతలకు గురవుతారు.

ప్రస్తుత పాలక పార్టీల అభివృద్ధి నినాదం వెనుక అసలు నిజమేమిటో తెలియాలంటే మనం కొన్ని ప్రశ్నలు వేసుకోవాలి. ఒక ప్రాంతంలో పరిశ్రమలు, ఉద్యోగాలు కావాలంటే ఆ ప్రాంతంలో భూమి మీద ఆధారపడి బతుకుతున్న రైతులే ఎందుకు తమ భూములను త్యాగం చేయాలి? తమ పిల్లలకు ఉద్యోగాలు రావాలంటే రైతులు తమ భూములియ్యాల్సిందే అనేవారు మరి ఒకసారి ప్రభుత్వ ఉద్యోగాలు పొందినవారు తమ భూములను ఇచ్చేయాలన్న నిబంధన ఎందుకు పెట్టరు? భూములు కోల్పోయిన వారికి ప్రభుత్వమే భూమికి బదులు భూమి కొని ఇవ్వవచ్చు కదా? అందుకోసం భూమి మీద ఆధారపడని వారి దగ్గర భూసేకరణ చెయ్యొచ్చు కదా? భూ సేకరణలో ప్రభుత్వం ఇచ్చే రేటుకు, బయట వ్యక్తులు స్వచ్ఛందంగా కొనుక్కునే ధరకు, రిజిస్ట్రేషన్ శాఖ నిర్వహించే రిజిస్టరులో ఉండే రేటుకు ఎందుకంత వ్యత్యాసం ఉంటుంది? ప్రభుత్వ భూమి పేదల దగ్గర తీసుకున్నప్పుడు అతి తక్కువ నష్టపరిహారాన్ని ఇచ్చే ప్రభుత్వం, అదే ప్రభుత్వ భూమిని వేలం వేసి కోట్ల రూపాయలు సంపాదించడం ఏం న్యాయం? రైతుల దగ్గర ప్రజాప్రయోజనం కోసమని ఎకరా 5–10 లక్షలకు భూమి తీసుకుని, అదే భూమిని బ్యాంకులలో తాకట్టు పెట్టి రైతు భరోసాకు కోట్ల రూపాయల నిధులు సమకూర్చుకోవాలనుకోవడం విషాదమా, హాస్యాస్పదమా? ప్రతి భూమి లావాదేవీలో లక్షల, కోట్ల రూపాయల నల్లధనం చేతులు మారుతున్న వాస్తవం ప్రభుత్వానికి తెలియదా?

అసలు స్వయంగా వ్యవసాయం చేయనివారి చేతుల్లో, బతుకు తెరువు కోసం వ్యవసాయంపై ఆధారపడని వారి చేతుల్లో భూములెందుకు ఉండాలి? అటువంటివారు కొత్తగా వ్యవసాయ భూములు కొనకుండా ఎందుకు నిషేధం విధించరు? అటువంటి నిబంధనలు కలిగిన తెలంగాణ కౌలుదారీ మరియు వ్యవసాయ భూముల చట్టం 1950ను ఎందుకు ఏ ప్రభుత్వమూ అమలు చేయలేదు? వందల గ్రామాలను పట్టణాలుగా, మునిసిపాలిటీలుగా మారుస్తూ, వివిధ రింగు రోడ్ల పేరు మీద రాష్ట్రంలో సగానికి పైగా ప్రాంతాన్ని పట్టణ ప్రాంతంగా మార్చడం వెనుక, అధికారంలో ఉన్నవారు వ్యవసాయ భూముల సీలింగు చట్టం పరిధిలోకి రాకుండా వందల, వేల ఎకరాలు సమకూర్చుకోవడం కారణం కాదా? ఆ విధంగా సంపాదించిన భూములను తమ నిర్ణయాధికారం ద్వారా అభివృద్ధి పేరుతో స్థిరాస్తి వ్యాపారం చేసి, గజాల్లోకి మార్చుకుని వందల, వేల కోట్ల రూపాయలు సంపాదించే అవకాశం కల్పించుకోవడం నిజం కాదా, ఇందిరమ్మ రాజ్యం అంటున్నవారు, మారిన పరిస్థితుల్లో పట్టణ భూ గరిష్ఠ పరిమితి చట్టాన్ని తెచ్చే ధైర్యం చేయగలరా? 2013 భూ సేకరణ చట్టాన్ని ఎటువంటి సవరణలు లేకుండా ఎందుకు అమలు చేయట్లేదు? ఒక పక్క వ్యవసాయం చేసే చిన్న, సన్నకారు రైతులు భూములు కొనలేని పరిస్థితి ఉంటే; రాజకీయ నాయకులు, ఉద్యోగులు, వివిధ వ్యవసాయేతర వృత్తుల్లో ఉన్నవారు గత ఇరవై ఏళ్లుగా విపరీతంగా వ్యవసాయ భూములను ఎందుకు కొంటున్నారు, ఎలా కొనగలుగుతున్నారు? గత పదేళ్లలో వేల ఎకరాల వ్యవసాయ భూమి వ్యవసాయేతర భూమిగా అంత తేలికగా ఎలా మారింది? గత ముప్పై ఏళ్లలో సగటు భూమి కమతాల విస్తీర్ణం ఎందుకు తగ్గింది? తెలంగాణలో వ్యవసాయం చేయగలిగినవారిలోనూ, శ్రామికులలోనూ భూమి లేని వారి సంఖ్య, కౌలుదార్ల సంఖ్య ఎందుకు పెరుగుతుంది? పట్టణాలలోను, గ్రామాలలోను సామాన్యులు సొంతంగా ఇల్లు సమకూర్చుకోలేని పరిస్థితి ఎందుకు వచ్చింది?

రాష్ట్రంలోని శ్రామిక ప్రజలు పై ప్రశ్నలను లేవనెత్తి, పాలక పార్టీల నుండి సరైన సమాధానాలను రాబట్టుకోవడం కోసం, వాటిలో ఇమిడి ఉన్న తమ హక్కులను సాధించుకోవడం కోసం ఎంతమేర ఐక్యంగా ఉద్యమించగలుగుతారూ అన్న దాని మీదే భూమికి సంబంధించిన అంశాల్లోనూ, తద్వారా సామాజిక, రాజకీయ, ఆర్థిక వ్యవస్థలోనూ ప్రజానుకూలమైన మార్పు సాధ్యమవుతుంది.

● రవికుమార్
న్యాయవాది



క్రిస్మస్ జోష్

- నేత్రపర్వంగా క్రిస్మస్ వేడుకలు
- నగరంలో చర్చిలకు పెద్ద ఎత్తున తరలి వచ్చిన క్రైస్తవులు
- కేక్ కట్ చేసి పరస్పర శుభాకాంక్షలు



హనుమకొండలోని సెంటినరీ బాప్టిస్టు చర్చి నుంచి ప్రార్థన అనంతరం బయటకు వస్తున్న క్రైస్తవులు



హనుమకొండ కల్చరల్/ఖిలా వరంగల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మానవాళికి శాంతిని ప్రబోధించిన ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం క్రిస్మస్ పర్వదినాన్ని క్రైస్తవులు నేత్రపర్వంగా జరుపుకున్నారు. నగరంలోని అనేక చర్చీలలో క్రైస్తవ సోదరులు సంప్రదాయ వేడుకల్లో నూతన వస్త్రాలు ధరించి పాల్గొన్నారు. హనుమకొండలోని ప్రధాన క్రిస్టియన్ బాప్టిస్ట్ చర్చిలో నేత్రపర్వంగా జరిగిన వేడుకల్లో ఫాదర్ నిరంజన్‌బాబు క్రిస్మస్ సందేశాన్ని వివరించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రిస్మస్ చెట్టును ప్రత్యేకంగా అలంకరింప చేసి ఆరాధనలు నిర్వహించారు. మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, ఏసీపీ శోభ తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. నగరంలో ఎక్కడ చూసిన క్రిస్మస్ సందడి కనిపించింది.

సీబీ చర్చిలో..

క్రిస్టియన్‌కాలనీలోని సీబీ చర్చిలో బుధవారం యేసుక్రీస్తు జన్మదినాన్ని ఫాదర్ పుల్లా జగ్జీవన్‌బాబ్జి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మత ప్రబోధకుడు జాన్ ఎడ్విన్ మాట్లాడుతూ.. యేసుక్రీస్తు జీవితం ప్రతీ ఒక్కరికి ఆదర్శమని, ఆయన బోధనలు ప్రపంచాన్ని ప్రభావితం చేస్తాయని, ఆయన చూపిన శాంతిమార్గంలో ప్రజలు పయనించాలని అన్నారు. శాంతి, కరుణ, సేవాగుణం, సహనం, ప్రేమతో జీవించిన క్రీస్తు జీవన గమనం నేటి ప్రజలందరికీ ఆచరణీయమని అన్నారు. అనంతనం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, ఆసిస్టెంట్ పాస్టర్‌లు ఎం.మత్యాస్, కార్తీక్, అబ్రహం, పీఆర్ సాల్మన్, కొల్లూరి రాజ్‌కుమార్, కవిరాజ్ టోని, భరత్‌కుమార్, పి.శ్రీకర్, బన్నీవిశాల్, నవీన్‌సన్, గైడ్ ప్రభాకర్, శ్యామ్‌కుమార్, ఉద య్, విజయ్‌కుమార్, హోహన్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా 18వ డివిజన్ చర్చీలలో మాజీ ఎమ్మెల్యే న న్నపునేని నరేందర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్‌లు కొమ్ము రాజు, సీతయ్య, అరుణ్‌జేమ్స్, మాజీ కార్పొరేటర్ కుందారపు రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

- 'రోగ' ఘంటికలు!

బీపీ.. షుగర్.. భయపెడుతున్నయ్



శారీరక శ్రమ లేక వ్యాధుల బారిన జనం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

పెరుగుతున్న పని ఒత్తిళ్లు.. కరువవుతున్న మానసిక ప్రశాంతత.. మారుతున్న జీవన శైలి.. ఆహారపు అలవాట్ల నేపథ్యంలో ఓరుగల్లు ప్రజలు రక్తపోటు, మధుమేహం బారిన పడుతున్నారు. ప్రస్తుత ఉరుకుల, పరుగుల జీవితంలో ఆరోగ్యాన్ని కూడా లెక్క చేయకపోతుండటంతో అనారోగ్యం పాలవుతున్నారు. వృత్తిలో ఒత్తిడి, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో అతాలకుతలమవుతున్నారు. ఈ సమస్యల వలయం నుంచి బయట పడే క్రమంలో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తూ వాకింగ్, వ్యాయామం, యోగా లాంటి వాటికి ఓ గంట సమయం కేటాయించే తీరిక లేకుండా పోతోంది. పైగా ఇంట్లో తిండి తినే సమయం లేక బయటి ఆహారాలు, జంక్ ఫుడ్‌లకు అలవాటు పడి బీపీ, షుగర్లతో సహవాసం చేస్తున్నారు. వీటికి తోడు మద్యం, పొగాకు ఉత్పత్తులు, డ్రగ్స్ తదితర వాటికి అలవాటు పడి నరకం అనుభవిస్తున్నారు. వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సర్వే జరుగుతుండగా అందులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. 30ఏళ్లు దాటని వారిలో అధిక శాతం మంది రక్తపోటు, మధుమేహం బారిన పడుతున్నట్టు గణాంచాలు చెబుతున్నాయి.





యువతలో మరింత టెన్షన్

జీవన శైలి జబ్బులైన రక్తపోటు, మధుమేహం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా చాప కింద నీరులా వ్యాపిస్తున్నాయి. ఇంతకుముందు పట్టణాల్లోనే ఎక్కువగా కనిపించే ఈ జబ్బులు పల్లెల్లోనూ వ్యాపిస్తున్నాయి. ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న వరంగల్‌లాంటి నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఇవి రంకెలేస్తున్నాయి. గత జనవరి 1వ తేదీ నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 30ఏళ్లు పైబడిన వారిలో రక్తపోటు, మధుమేహ వ్యాధులపై ప్రత్యేకంగా సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సర్వేలో పలు విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పట్టణాల్లోనే కాకుండా పల్లెల్లో కూడా ఈ బీపీ, షుగర్లు ప్రజలను ఆగం చేస్తున్నాయి. వృద్ధులే కాకుండా యువత సైతం ఈ రెండు జీవనశైలి వ్యాధులతో కుస్తీ పడుతున్నారు. అయితే అవగాహన లేక కొందరు, నిర్లక్ష్యంతో ఇంకొందరు ఈ రెండు ప్రమాదకర జబ్బులను నియంత్రణలో ఉంచుకోలేక గుండె జబ్బులకు గురవుతున్నారని వైద్య నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. వరంగల్, హనుమకొండ నగరాల్లో అత్యధికంగా బీపీ, షుగర్లు ప్రజలను ఎటాక్ చేస్తున్నాయి. 30ఏళ్ల నుంచి 55ఏళ్ల వయస్సు వారిలో అధికంగా బీపీ, షుగరు వ్యాధులను గుర్తిస్తున్నారు. జీవన శైలిలో వచ్చిన మార్పులే కారణమని వైద్యులు పేర్కొంటున్నారు.

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న బాధితులు
- 30ఏళ్లు నిండిన వారిలో 65.5శాతం మందికి తలెత్తుతున్న సమస్యలు
- మహిళలకంటే పురుషుల్లోనే అధికంగా రక్తపోటు, మధుమేహం
- వ్యాయామం, యోగాతో చెక్ పెట్టవచ్చంటున్న వైద్య నిపుణులు
- పల్లె, పట్నం తేడా లేకుండా మారుతున్న జీవన, ఆహార శైలి
- ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సర్కార్ సర్వే

ఉమ్మడి జిల్లాలో ఈనెల 20వ తేదీ వరకు నమోదైన బాధితులు ఇలా..

జిల్లా	బీపీ కేసులు	షుగర్ కేసులు
వరంగల్	75,850	38,726
హనుమకొండ	60,042	29,941
మహబూబాబాద్	56580	27,499
జనగామ	44,652	18,578
భూపాలపల్లి	14,051	5,500
ములుగు	17,426	7,290

65.50శాతం మందిలో దీర్ఘకాలిక సమస్యలు

ఒత్తిడి కారణంగా వచ్చే ఈ వ్యాధులను నియంత్రించేందుకు చాలా మంది దృష్టి పెట్టడం లేదు. దీంతో 30ఏళ్లు నిండిన ప్రతీ ఐదుగురిలో ముగ్గురు రక్తపోటుతో బాధపడుతున్నారు. ఉదాహరణకు వరంగల్ జిల్లాలో 30ఏళ్లకు పైబడిన వారు 5,13,992 మంది ఉండగా.. వీరిలో 1,74,313మందికి రక్తపోటు, మధుమేహ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వీరిలో 75,850మందికి రక్తపోటు, 38,726మందికి మధుమేహం ఉన్నట్టు గుర్తించారు. పరీక్షలు నిర్వహించిన 1,74,313మందిలో 1,14,576మందికి బీపీ లేదా షుగర్ వ్యాధులున్నాయి. అంటే 65.5శాతం ప్రజలు వాటి పడినట్టు గుర్తించారు. 30ఏళ్లపైబడిన వారిలో కేవలం 34.5శాతం మంది మాత్రమే బీపీ, షుగర్ల బారిన పడకుండా జీవనాన్ని గడుపుతున్నారు. వీరిలో చాలా మంది శారీరక శ్రమ లేదా వ్యాయామకంతో ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నావారే ఉన్నట్లుగా గుర్తించారు. కాగా, మహిళలకంటే పురుషులే అధికంగా ఈ వ్యాధుల బారిన పడుతున్నారు. వరంగల్ జిల్లాలో రక్తపోటు కేసులు 75,850 గుర్తిస్తే, ఇందులో 39,898 మంది పురుషులు

మిగతా 7వ పేజీలో...




ఒత్తిడి వల్లే అసలు సమస్యలు..
డాక్టర్ పాశం నాగరాజు, ఫిజీషియన్, ఎంజీఎం ఆస్పత్రి వరంగల్

మధుమేహం, రక్తపోటు.. రెండూ స్నేహితుల లాంటివి. ఒకటి వచ్చాక మరొకటి కొన్ని సంవత్సరాల తర్వాత వచ్చే అవకాశాలున్నాయి. ప్రధానంగా ఒత్తిడిని తగ్గించేందుకు క్రమం తప్పకుండా వ్యాయామం, ఆహార నియమాలు పాటించటం వల్ల బీపీని కంట్రోల్‌లో ఉంచుకోవచ్చు. తక్కువ కార్బోహైడ్రేట్, ఎక్కువ ఫైబర్, మాధ్యమికంగా ప్రొటీన్ కలిగిన ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల షుగర్‌ను నియంత్రించవచ్చు. ఏ రకమైన ఒత్తిడి లేకుండా, క్రమం తప్పకుండా వ్యాయామంతో బీపీ, మధుమేహాన్ని నియంత్రించవచ్చు.

వ్యాయామం లేకనే జీవన శైలి జబ్బులు
డాక్టర్ మల్లికార్జున్, డీఎంహెచ్‌వో, జనగామ



ఒత్తిడి కారణంగానే బీపీ, మధుమేహం వస్తున్నాయి. వ్యాయామం చేయటం లేదు.. సరైనా ఆహారం తీసుకోవడం లేదు. కనీసం నిత్యం 6 నుంచి 8గంటల వరకు కండినిండా నిద్రపోవాలి. ఆకుకూరలు, కూరగాయలతో భోజనం తప్పనిసరి. ప్రతీ రెండు నెలలకు ఒకసారి షుగర్ టెస్టులు చేయించుకోవాలి. ప్రభుత్వం బీపీ, షుగర్ బాధితులకు ఉచితంగా మందులు, టెస్టులు నిర్వహిస్తుంది. దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలి.



వారణాసి జిల్లా రాజతలాబ్ కోర్టు ఆవరణలో తన వాహనంలోనే తీర్పు వెలువరుస్తున్న సాయి అశ్రిత్

వారణాసిలో ఓరుగల్లు కెరటం

- న్యాయవాదులకు సవాల్‌గా నిలిచిన ఐపీఎస్ సాయి అశ్రిత్
- తన వాహనాన్నే కోర్టు హాలుగా మలచి పేదలకు న్యాయం
- దేశవ్యాప్తంగా వెల్లువెత్తుతున్న ప్రశంసలు

7

ప్రజాస్వామ్య విలువలకు నిదర్శనం వాజ్‌పేయ్

- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్
- జయంతి సందర్భంగా నివాళులర్పించిన నాయకులు



వాజ్‌పేయ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న బీజేపీ శ్రేణులు

మిల్స్‌కాలనీ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్ భారత ప్రజాస్వామ్య విలువలకు నిలువెత్తు నిదర్శనమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ అన్నారు. వాజ్‌పేయ్ జయంతిని పురస్కరించుకొని ధర్మారంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం వాజ్‌పేయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మూడు సార్లు ప్రధానిగా పనిచేసిన ఆయన చివరి అంకంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వసతి గృహంలోనే తనువు చాలించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. అనంతరం వరంగల్ ఆర్టీఏ జంక్షన్, ఎంజీఎంలలో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు డాక్టర్ వన్నాల వెంకటరమణ, కుసుమ సతీష్, రత్నం సతీష్, ఎడ్ల అశోక్‌రెడ్డి, బాకం హరిశంకర్, మల్లాడి తిరుపతిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, జలగం రంజిత్‌రావు, మార్టిన్ లూథర్, బైరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు సర్కారు దృష్టికి తీసుకెళతా..

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



కాంట్రాక్టు ఉద్యోగుల దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న రేవూరి

హనుమకొండ టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకపోయి తప్పక పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తానని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి హామీ ఇచ్చారు. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిలాపార్కు ఎదుట 20 రోజులుగా పేస్కేల్ అమలుచేయాలని సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులకు బుధవారం ఎమ్మెల్యే రేవూరి సంఘీబావం తెలియజేశారు. సమ్మెలో భాగంగా బిక్షాటన చేస్తున్న ఉద్యోగులతో రేవూరి మాట్లాడారు. ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చేందుకు కృషి చేస్తానన్నారు. ఆల్ ఇండియా గ్రామీణ పోస్టల్ ఉద్యోగుల జాతీయ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రభుత్వం తక్షణమే స్పందించి పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని గురువారం చలో హైద్రాబాద్‌కు పిలుపునిచ్చినట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు ఎం.డి. షఫీ, శ్రీధర్, స్వాతి, జ్యోతి, రఘు, ఉపేందర్, సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఎంప్లాయిస్ రాష్ట్ర అసోసియేషన్ బాధ్యులు పాల్గొన్నారు.



నిర్మాణంలో ఉన్న ఎస్కలేటర్లు, లిఫ్ట్

అసంపూర్తి పనులు.. అవస్థల్లో ప్రయాణికులు

- వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఆలస్యంగా సాగుతున్న అభివృద్ధి పనులు
- అమృత్ భారత్ కింద రూ.25.41 కోట్లు కేటాయించిన కేంద్రం
- పది నెలలైనా పూర్తికాని ప్లాట్‌ఫామ్‌లు
- అసంపూర్తిగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జి

గిర్మాజిపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యం వల్ల వరంగల్ రైల్వే స్టేషన్‌లో పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రయాణికుల విశ్రాంతి మందిరం మినహా మిగిలిన ఏ పనులు కూడా పూర్తి కాలేదు. దీంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రైల్వేస్టేషన్‌లను ఆధునీకరించి ప్రయాణికులకు అధునాతన సదుపాయాలను కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ రైల్వేస్టేషన్ పథకం చేపట్టింది. ఇందులో భాగంగా సికింద్రాబాద్ తరువాత అంతే ప్రాధాన్యత గల వరంగల్ రైల్వేస్టేషన్ అభివృద్ధి కోసం రూ.25.41 కోట్లను కేటాయించింది. ఈ నిధులతో రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు విశ్రాంతి గదులు, ప్రయాణప్రాంగణాలు, ప్రాంగణ సుందరీకరణ, ప్లాట్‌ఫారాలు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, ర్యాంపులు, ఎస్కలేటర్లు, లిఫ్టులు, ప్లాట్‌ఫారాల విస్తరణ, అధునాతన పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్, సూచిక బోర్డులు, కోచ్ రెస్టారెంట్ ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. పనులకు ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.

ఎక్కడి పనులు అక్కడే..

రైల్వేస్టేషన్‌లో ఉన్న నాలుగు ప్లాట్‌ఫారాలపై పాతవి తొలగించి కొత్త కవర్ షెడ్‌లను నిర్మిస్తున్నారు. అయితే 4వది వినహా మిగిలిన 3 ప్లాట్‌ఫామ్‌లపై పనులు పూర్తికాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. ఇక 12 మీటర్ల వెడల్పుతో బాహుబలి ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పనులు మాత్రం కాస్త వేగంగా జరుగుతున్నాయి. మొదటి ప్లాట్‌ఫామ్ నుంచి నాలుగో ప్లాట్‌ఫామ్ వరకు అర్ధచంద్రాకారంలో నిర్మిస్తున్న ఈ భారీ ఫుట్‌ఓవర్ బ్రిడ్జికి అనుసంధానంగా కాజీపేట వైపు 1,2,4 ప్లాట్‌ఫారాలపై 3 ర్యాంపులు, విజయవాడ వైపు 1,2,3 ప్లాట్‌ఫారాలపై ఎస్కలేటర్లు, లిఫ్టులు ఏర్పాటు చేస్తున్నారు. అయితే అధికారులు ఫుట్‌ఓవర్ బ్రిడ్జికే ప్రాధాన్యం ఇచ్చి పనులు చేయిస్తున్నారు.

పూర్తికాని మహిళల వెయిటింగ్ హాల్

మొదటి ప్లాట్‌ఫామ్‌పై గతంలో సాధారణ, ఉన్నతశ్రేణి,

మిగతా 6వ పేజీలో...



కొనసాగుతున్న ఫుట్‌ఓవర్‌బ్రిడ్జి పనులు



ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

వైద్యుల నిర్లక్ష్యంతో మహిళ మృతిచెందిందని ఆందోళన

వరంగల్ మెడికల్, డిసెంబరు 25 (ఆంధ్ర జ్యోతి):వైద్యుల నిర్లక్ష్యంతోనే మహిళ మృతి చెందిందంటూ హను మ కొండలోని ఏకశిల ఆస్పత్రిలోని ఐసీయూ ఎదుట బుధవారం బం ధువులు ఆందోళన చేశారు. మృతురాలి బంధు వులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని తోపనపల్లి గ్రామానికి చెందిన రవళి (26) కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతూ ఈ నెల 20న ఏకశిల ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చారు. పరీక్షలు నిర్వహిం చిన వైద్యులు మూత్రపిండాల్లో రాళ్లు ఉన్నట్లు గుర్తించి రవళిని ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకొని చికిత్స ప్రారంభించారు. ఐదు రోజులుగా చికిత్స పొందు తున్న రవళి మృతి చెందినట్లు బుధవారం ఉదయం ఆస్పత్రి సిబ్బంది తెలిపారని బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లనే రవళి మృతి చెందిందని వైద్యులపై, ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆస్పత్రి ఆవరణలో ఆందోళనకు దిగారు. మృతురాలికి ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారని వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తూ బోరున విలపించారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్‌తో ఆందోళన చేస్తూ ఆస్పత్రిలోనే బైఠాయించారు.

చెరుకు వాంగ్మయికి నాట్య రవళి అవార్డు ప్రదానం



వాంగ్మయికి నాట్య రవళి అవార్డును ఇస్తున్న ప్రముఖ పాత్రికేయుడు ఆనందచారి

కేయూ క్యాంపస్ డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌కు చెందిన చెరుకు రఘుపతి రెడ్డి- లావణ్యల కుమార్తె చెరుకు వాంగ్మయికి ప్రతిష్టాత్మకమైన నాట్య రవళి అవార్డు లభించింది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో శ్రీ మయూరి నృత్యాలయ సాంస్కృతిక సేవా సమితి నేతృత్వంలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో అత్యు న్నత ప్రతిభ చూపారు. వాంగ్మయి చేసిన కూచిపూడి నృత్యం ఆహుతుల ను అబ్బుర పరిచింది. ఈ కార్యక్ర మంలో ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ పత్రిక సంపాదకులు ఆనం దచారి హాజరై వాంగ్మయికి నాట్య రవళి అవార్డును అందచేసి అభినం దించారు. కాగా, వాంగ్మయికి ప్రతిభకు శ్రీ మయూరి సంస్థ నిర్వాహకులు అభినందించారు. వాంగ్మయికి నాట్య గురువుగా వరంగల్‌కు చెందిన కొంతం వెంకటేశ్వర్లు వ్యవహరించారు.

వనదేవతలకు ముందస్తు మొక్కులు

మేడారం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలం మేడారం వన దేవతలను దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు బుధవారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజుల గద్దెల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్లకు పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, బెల్లం, చీరె సారెలు సమర్పించి మొక్కులు చెల్లించు కున్నారు. మినీ జాతర సమీపిస్తున్న నేపథ్యంలో భక్తులు ముందస్తుగా వనదేవ తలను దర్శించుకున్నారు.

మతిస్థిమితం లేని వృద్ధుడి అదృశ్యం



యాకయ్య

పర్వతగిరి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని వృద్ధుడు కొల్లూరి యాకయ్య అదృశ్యమ య్యాడు. వారం కిందట ఇంటి నుంచి బయటకు వచ్చిన యాకయ్య నడుచుకుంటూ ఎటో వెళ్లిపోవ డంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వృద్ధుడి ఆచూకీ తెలిసినవారు 990 8355851, 96526 25795 నెంబర్లలో తెలియజేయాలని కుటుంబ సభ్యులు కోరారు.

భావితరాలకు ఆదర్శం నవీన్ రచనలు

- ఆచార్య మిట్టపెల్లి రాజేశ్వర్‌రావు
- నూతన గ్రంథాల ఆవిష్కరణ
- నలుగురు యువ రచయితలకు నవలా పురస్కారాలు



యువ రచయితలకు నవలా పురస్కారాలు అందజేస్తున్న నిర్వాహకులు

హనుమకొండ కల్చరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): తెలుగు సాహితీ ప్రపంచంలో నిబద్ధత కలిగిన నవలా రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార విజేత అంపశయ్య నవీన్ అని, ఆయన రచనలు భావితరాలకు ఎంతో ఆదర్శంగా నిలుస్తాయని కేయూ విశ్రాంత ఆచార్యుడు రాజేశ్వర్‌రావు కొనియాడారు. మంగళవారం రాత్రి పొద్దుపోయేదాక, హనుమకొండలోని వాగ్దేవి సెమినార్‌హాల్‌లో జరిగిన సాహిత్య సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ ఆగపాటి రాజ్‌కుమార్ స్వాగతం పలుకగా సహృదయ అధ్యక్షుడు గిరిజ మనోహన్ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాజేశ్వర్‌రావు, నవీన్ కలం నుంచి జాలువారిన ప్రేమకు ఆవలి తీరం నవలను ఎబీ హ్యాండ్‌ది ఫోర్ ఆఫ్ లవ్ పేరుతో ఆంగ్ల అనువాద గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొప్ప నవలా రచయితగా తెలుగు రాష్ట్రాల్లోనే ప్రముఖంగా పేరున్న నవీన్.. తన జీవితంలోని ప్రతీ క్షణం సాహిత్య అధ్యయనానికి కేటాయించి తన సాహిత్యం ద్వారా సమాజ హితాన్ని కోరుతూ నూతన రచయితల్లో సాహితీ స్ఫూర్తి కలిగింపచేస్తున్నారని కొనియాడారు. సమాజంలోని వాస్తవిక సంఘటనలు అక్షరబద్ధం చేస్తూ అవార్డులకే వన్నె తెచ్చే విధంగా రచనలు చేస్తున్నారని, సిగ్మండ్ ఫ్రాయిడ్ థియరీ అందిపుచ్చుకొని సమాజానికి ఉపయోగపడే రచనలు చేస్తున్న నవీన్ తెలుగు రచయితలకు ఆదర్శమన్నారు.

నవీన్ లిటరరీ ట్రస్టు కార్యదర్శి డి. స్వప్న నివేదక సమర్పించారు. డాక్టర్ కర్రె సదాశివ్ రచించిన అంపశయ్య నవీన్ కథలు పరిశీలన అనే గ్రంథాన్ని కూడా ఆవిష్కరించారు.

యువ రచయితలకు నవలా పురస్కారాలు

నవీన్ లిటరరీ ట్రస్టు ద్వారా సంధ్య, మనోహరచారి, బండారి శంకర్, ఆర్‌సీ. కృష్ణస్వామిరాజులకు తొలి నవల పురస్కారాల కింద నగదు ప్రోత్సాహం, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. నెల్లుట్ల రమాదేవి, గిరిజ మనోహర్‌బాబు, శశాంకలు ఈ నలుగురి రచనలను సభకు పరిచయం చేశారు.

అంపశయ్య నవీన్ 84వ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రతీ ఏటా నూతన యువ నవలా రచయితలను ప్రోత్సహిం చడం ఎంతో అభినందనీయమని ఈ సందర్భంగా డాక్టర్ రామా చంద్రమౌళి, వీఆర్. విద్యార్థి తదితరులు అభినందించారు. పొట్లపల్లి శ్రీనివాసరావు, రామ రత్నమాల, తాడిచెర్ల రవితో పాటు నగరంలోని అనేక మంది సాహితీ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వికటించిన హెర్బల్ మందు

ప్రాణాపాయ స్థితిలో బాధితురాలు
మోసాన్ని వెల్లడించిన వైద్య మండలి

వరంగల్ మెడికల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నాటు వైద్యం, పసరు వైద్యం చేస్తున్న వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలంగాణ వైద్య మండలి పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ వి.నరేశ్ కుమార్ తెలిపారు. హెర్బల్ మందు వాటడంతో వికటించి ప్రాణాపాయ స్థితిలో బాధితురాలు ఎంజీఎంలో చికిత్స పొందుతుండగా నరేష్‌కుమార్ వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం జోజెరువు గ్రామానికి చెందిన 40 ఏళ్ల మహిళ ఎం.యాదలక్ష్మీ తన భర్తతో విడిపోయి కుమారుడితో కలిసి పుట్టింట్లో ఉంటోంది. కొన్నేళ్లుగా మూర్ఛవ్యాధితో బాధపడుతున్న యాదలక్ష్మీ.. అలోపతి వైద్యం డాక్టర్ సలహాతో తీసుకుంటూ జీవిస్తోంది. ఈ నెల 16న కవిత అనే మహిళ హెర్బల్ మందు 15 రోజులు వాడితే మూర్ఛవ్యాధి నయమవుతుందని నవిస్మంచింది. యాదలక్ష్మీతో రూ. 3వేల మందును కొనుగోలు చేయించి వాడాలని చెప్పింది. రెండు మూడు రోజులు వాడటంతో అపస్మారక స్థితికి చేరడంతో ఈనెల 19న ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతోంది. ఎంజీఎం ఆస్పత్రిలో వైద్య బృందం పరీక్షించి మూర్ఛవ్యాధి తిరగబెట్టిందని పేర్కొన్నారు. పేరులేని హెర్బల్ మందు వల్ల కిడ్నీ, లివర్ దెబ్బతిని ప్రాణం మీదికి వచ్చినట్లు తెలిపారు.

ఐదు రోజులుగా చికిత్స అందుతున్నా ఆమె పరిస్థితి విషమంగానే ఉన్నట్లు తెలిపారు. బుధవారం టీజీఎంసీ బృందం డాక్టర్ నరేశ్ కుమార్, డాక్టర్ శివ్వా సృజన్‌లతో కూడిన బృందం బాధిత మహిళకు అందుతున్న చికిత్సను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. బాధిత మహిళకు న్యాయం జరిగేలా ఐఎంఏ ద్వారా కృషి చేస్తామని ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగార్జునరెడ్డి తెలిపారు.

జూపార్కును శుభ్రం చేసిన అసెజ్ సంస్థ ప్రతినిధులు



జూపార్కు అధికారులతో అసెజ్ సంస్థ ప్రతినిధులు, సిబ్బంది

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ హంటర్‌రోడ్‌లో ఉన్న జూపార్కులో పర్యాటకులు వేసే చెత్తను అసెజ్ సంస్థ ప్రతినిధులు బుధవారం శుభ్రం చేశారు. ఈ సందర్భంగా జూపార్కులో ఉన్న ఫుడ్ ప్యాకేజింగ్ కవర్స్, డిస్పోజబుల్, ప్లాస్టిక్ కప్పులు, పానియాల సీసాలు సహా 200 కిలోల బరువు ఉన్న అన్ని రకాల చెత్తను సేకరించారు. ఈ కార్యక్రమంలో అసెజ్ సంస్థ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరి వేసుకొని ఇంటర్ విద్యార్థిని మృతి

- కళాశాల యజమాన్యం వేధింపులే కారణమని తల్లితండ్రుల ఆరోపణ
- విద్యార్థి సంఘాలు, మృతురాలి బంధువుల అందోళన

వరంగల్ క్రైం, డిసెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని గుగులోతు శ్రీదేవి మంగళవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. విద్యార్థిని బంధువుల కథనం ప్రకారం.. మాహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రత్తిరాంతండాకు చెందిన గుగులోతు శ్రీదేవి హనుమకొండలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. మంగళవారం సాయంత్రం స్టడీ అవర్స్ అయిపోయాక గదిలోకి వెళ్లి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. దీంతో కళాశాల యజమాన్యం హుటాహుటిన ఎంజీఎం తరలించింది. అయితే కళాశాల యజమాన్యం తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే ఆస్పత్రికి తరలించడంపై తల్లితండ్రులు అనుమానం వ్యక్తం చేశారు. తన కుమార్తె కళాశాల యజమాన్యం వైఖరితోనే ఉరి వేసుకొని మరణించిదని బంధువులు, విద్యార్థి సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కళాశాల చైర్మన్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, విద్యార్థి శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడుతోందని, దాని వలనే ఆత్మహత్య చేసుకుందని కళాశాల మేనేజ్‌మెంట్ తెలిపింది. కాజీపేట ఏసీపీ తిరుమల్ ఆధ్వర్యంలో ఎలాంటి ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. అయినప్పటికీ విద్యార్థి బంధువులు రాళ్లు రువ్వడంతో కళాశాల అద్దాలు స్వల్పంగా ధ్వంసమయ్యాయి. విద్యార్థి బంధువులతో చర్చలు జరిపిన కళాశాల మేనేజ్‌మెంట్, జూనియర్ కళాశాలల అసోసియేషన్ రూ.12 లక్షలు ఇచ్చేటట్లుగా ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. కాగా, ఈ విషయంపై కేయూ ఎస్సై బొజ్జ రవీందర్‌ను వివరణ కోరగా తల్లితండ్రుల ఫిర్యాదు మేరకు సూసైడ్ కేసు నమోదు చేశామన్నారు.

కళాశాలకు షోకాజ్ నోటీసు జారీ

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 25: విద్యార్థిని మృతికి కారణమైన హనుమకొండలోని ప్రైవేటు జూనియర్ కళాశాల యాజమాన్యానికి హనుమకొండ డీఐఈవో ఎ.గోపాల్ బుధవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మంగళవారం హాస్టల్ గదిలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి గుగులోతు శ్రీదేవి ఉరి వేసుకొని అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటనలో కళాశాల యాజమాన్యం వ్యవహరించిన తీరు సరిగా లేదని, సంఘటనపై పూర్తి వివరాలను అందజేయాల్సిందిగా గోపాల్ ఉత్తర్వుల్లో కళాశాల యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేశారు. సంఘటనపై బుధవారం ప్రాథమిక విచారణ చేసిన డీఐఈవో గోపాల్ విచారణ నివేదికను బోర్డు అధికారులకు వెల్లడించారు.

బల్దియాకు గ్రూప్-4 అధికారులు

- 42 మందిని కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం
- జూనియర్ అసిస్టెంట్లుగా నియామకం
- ఇందిరమ్మ ఇండ్ల సర్వే విధులు



వార్డు అధికారులుగా నియామక ఉత్తర్వులు అందుకుంటున్న అధికారులు



విధులకు వెళ్లేందుకు సిద్ధమైన కొత్త అధికారులు

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గ్రూప్-4 పరీక్షల్లో కొలువులు సాధించిన కొత్త అధికారులు బల్దియాకు చేరుకున్నారు. గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో పని చేసేందుకు 42మందిని ప్రభుత్వం కేటాయిం చింది. వీరిలో 32 మంది వార్డు అధికారులు, 6 జూనియర్ అకౌంట్ ఆఫీసర్లు, 3 జూనియర్ అసిస్టెంట్లు సోమవారం విధుల్లో చేరారు. బల్దియా కమిషనర్, అదనపు కమిషనర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు 42 మంది సీ-1 సెక్షన్ సూపరింటెండెంట్‌ను కలిసి రిపోర్టు చేశారు. వీరిలో 32 మందిని వార్డు ఆఫీసర్లుగా నియమించి, మిగతా వారిని కార్యాలయంలో విధులకు కేటాయించారు. గ్రేటర్ పరిధిలోని 66 డివిజన్‌లలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే విధులు చేపట్టాలని, ముందుగా ఈనెల 30 వరకు ప్రత్యేక శిక్షణ పొందాలని మార్గనిర్దేశం చేశారు. కాజీపేట, కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయాల డిప్యూటీ కమిషనర్‌లను కలిసి విధుల్లో చేరాలని సూచించారు. ప్రస్తుతం వీరు వార్డు ఆఫీసర్లుగా పని చేస్తున్న వీఆర్‌వోలకు అనుసంధానంగా ఉండి విధులు నిర్వర్తిస్తారని తెలిపారు.

అమ్మా నాన్న ప్రోత్సహంతో చదివా..



చిన్నప్పటి నుంచి చాలా కష్టపడి చదివాను. బీటెక్ పూర్తి చేసిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగం కోసం చాలా ప్రయత్నాలు చేశాను. రెండేళ్లుగా ఓ ప్రైవేటు సంస్థలో తక్కువ జీతానికి పని చేశాను. నాన్నకు వచ్చే నెల జీతానికి నా జీతం డబ్బులు తోడయ్యేవి. ప్రస్తుతం గ్రూప్-4 ఉద్యోగం సాధించడం పట్ల కుటుంబ సభ్యులు సంతోషం పడుతున్నారు. ఇంకా గ్రూప్ - 1, 2, 3 రాయాల్సి ఉంది.

- ప్రత్యూష, వార్డు ఆఫీసర్, హనుమకొండ

నాన్న దినసరి కూలీ పని చేస్తాడు..



మాది చాలా పేద కుటుంబం. రెక్కాడితే గానీ డొక్కాడని స్థితిలో నాన్న చాలా కష్టపడి చదివించాడు. నేను నాలుగేళ్ల నుంచి ప్రభుత్వ ఉద్యోగం కోసం సన్నద్ధమవుతున్నాను. గతంలో చాలా సార్లు ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నం చేశాను. ప్రస్తుతం గ్రూప్-4లో ఉద్యోగం లభించింది. చాలా సంతోషంగా ఉంది.

- సూర నాగరాజు, వార్డు ఆఫీసర్, హనుమకొండ

గ్రూప్ -1 ఉద్యోగం లక్ష్యంగా..



గ్రూప్-1 ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా చదువుతున్నాను. రెండేళ్లుగా హైదరాబాద్‌లో ప్రత్యేక శిక్షణ పొంది పోటీ పరీక్షల కోసం కసరత్తు చేస్తున్నాను. ప్రస్తుతం గ్రూప్-4 ఉద్యోగం సాధించినా ఉన్నత ఉద్యోగం సాధిస్తాననే నమ్మకం ఉంది.

- బొల్లి మధు, వార్డ్ ఆఫీసర్, వరంగల్

అసంపూర్తి పనులు.. అవస్థల్లో ప్రయాణికులు

5వ పేజీ తరువాయి



అసంపూర్తిగా సుందరీకరణ పనులు

మహిళా ప్రయాణికులకు వేరువేరుగా 3 వెయిటింగ్ హాల్స్ ఉండేవి. వీటికి తోడు చెల్లింపు పద్ధతిపై ఏసీ వెయిటింగ్ హాల్ ఉంది. అయితే మూడు వెయి టింగ్ హాళ్లస్థానంలో నూతన వెయిటింగ్ హాల్స్ నిర్మాణం చేస్తున్నారు. అయితే సాధారణ ప్రయాణికుల వెయిటింగ్ హాల్‌ను పూర్తిచేసిన అధికారులు.. మహి ళలు, ఉన్నతశ్రేణి వెయిటింగ్ హాల్స్ నిర్మాణంలో జాప్యం చేస్తున్నారు. అయితే సాధారణ వెయిటింగ్ హాల్‌ను విశాలంగా కార్పొరేట్ స్థాయిలో నిర్మించడంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నత్తనడకన సుందరీకరణ పనులు

వరంగల్ రైల్వేస్టేషన్‌లో సుందరీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. సిమెంట్ స్తంభాలు నిర్మించి వాటిపై ఏనుగుల ప్రతిమలను ఏర్పాటు చేయడం మినహా మిగిలిన పనులు ఆగిపోయాయి. నాటిన మొక్క లకు నీరు పోయకపోవడంతో ఎండిపోతున్నాయి. ప్రయాణికులు వీక్షించేందుకు ఏర్పాటు చేసిన పాత రైలు ఇంజన్‌కు రంగులు వేయలేదు. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయలేదు. ఇటీవల రైల్వేస్టేషన్‌ను తనిఖీచేసిన డీఆర్ఎం భరతేష్ కుమార్ జైన్ సుందరీకరణ పనులను చూసి అసహనం వ్యక్తం చేశారు. కోచ్ రెస్టారెంట్ పనులు సైతం మందకొడిగా సాగుతున్నాయి. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు శ్రద్ధ పెట్టి పనులు వెంటనే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

శిథిలావస్థలో ఇరిగేషన్ శాఖ నివాస భవనాలు

పట్టించుకోకపోవడంతో కూలిపోతున్న వైనం
అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిన భవనాలు



శిథిలావస్థలో ఇరిగేషన్ శాఖ నివాస భవనం

హనుమకొండ టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని చింతగట్టు నీటిపారుదల శాఖ క్యాంపు కార్యాలయంలో నివాస భవనాలు శిథిలావస్థలోకి చేరాయి. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో భవనాల గోడలు నెర్రలు వాసి పై కప్పు పెచ్చులూడి ప్రమాదకరంగా మారాయి. 40ఏళ్ల కిందట ప్రభుత్వం నీటిపారుదల శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల నివాసాల కోసం భవనాలను నిర్మించారు. ఈ భవనాలను పర్య వేక్షణ లేక వర్షాలకు నీళ్లు నిలిచి కూలిపోయే స్థితికి చేరుకున్నాయి. సుమారు 220 నివాస భవనాలు ఉండగా, ప్రస్తుతం 40 నుంచి 50 వరకు వాడకం లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. కొన్ని భవనాల్లో ఖాళీగా ఉండడంతో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి భవనాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. నీటి పారుదల ఉన్నతాధికారులు పట్టించు కోకపోవడంతో భవనాలు ఎప్పుడు కూలుతాయో తెలియక స్థానికులు భయాందోళనకు గురవుతు న్నారు. కొంత మంది బయటకు వెళ్లి కిరాయికి ఉంటే ఎక్కువ డబ్బులు కావల్సి ఉండడంతో క్యాంపులోని కూలిపోయే భవనాల్లో ఉంటూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ఉంటున్నట్లు చెబుతున్నారు. కొంత మంది ఉద్యోగులు వారి పేరు మీద భవనాలను అద్దెకు తీసుకొని ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఇవ్వడంతో అసాంఘిక కార్యక్రమాలు సైతం జరుగుతున్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వం లక్షలు ఖర్చు చేసి నిర్మించిన భవనాలు నేలమట్టం కాకముందే మరమ్మతు పనులుచేపట్టి కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందికి నివాస భవనాలుగా వినియోగంలోకి తీసుకురావాలని కార్యాలయ ఉద్యోగులు కోరుతున్నారు.

క్రిస్మస్ సందడి

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా వేడుకలు



చర్చిల్లో క్రైస్తవుల ప్రార్థనలు

వరంగల్ నగరంలో క్రిస్మస్ పర్వదినం ఉత్సాహంగా సాగింది. క్రైస్తవులు ఉదయాన్నే సమీపంలోని చర్చిలకు వెళ్లి ప్రార్థనలు చేశారు. పాస్టర్లు ఏసు జననాన్ని, ఆయన బోధనలను వివరించారు. అనంతరం కేక్‌లు కట్ చేశారు. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని అభినందనలు తెలుపుకున్నారు.


ములుగులో క్రిస్మస్ సందర్భంగా మంత్రి సీతక్కకు ఏసుప్రభువు చిత్రపటాన్ని బహూకరిస్తున్న క్రైస్తవులు



ప్రార్థన చేస్తున్న పాస్టర్ నిరంజన్


పాలకుర్తిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని కేట్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి


స్టేషన్ ఘన్‌పూర్ నిర్మల మాత చర్చిలో కుటుంబ సభ్యులతో కలిసి క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య


ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటున్న దృశ్యం


సీబీసీ వద్ద సెల్ఫీ దిగుతున్న యువతులు






హనుమకొండలోని సెంటినరీ బాప్టిస్టు చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


భూపాలపల్లిలోని సీఎస్ఐ చర్చిలో క్రిస్మస్ వేడుకలు


తొర్రూరు సీఎస్ఐ చర్చి క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మాజీమంత్రి దయాకర్‌రావు


డోర్నకల్ సీఎస్ఐ చర్చిలో దైవ సందేశం విని పిస్తున్న పాస్టర్ రబ్బాని


కాశిబుగ్గ బీఎస్‌నగర్ చర్చి ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు

వారణాసిలో ఓరుగల్లు కెరటం


- న్యాయవాదులకు సవాల్‌గా నిలిచిన ఐఏఎస్ సాయి అశ్రిత్
- తన వాహనాన్నే కోర్టు హాలుగా మలచి పేదలకు న్యాయం
- దేశవ్యాప్తంగా వెల్లువెత్తుతున్న ప్రశంసలు


వారణాసి జిల్లా రాజతలాబ్ కోర్టు ఆవరణలో తన వాహనంలోనే తీర్పులు వెలువరుస్తున్న సాయి అశ్రిత్

మిల్స్‌కాలనీ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఓరుగల్లుకు చెందిన యువ ఐఏఎస్ అధికారి శాఖమూరి సాయి అశ్రిత్ ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం వారణాసిలో అనితర సాధ్యమైన పనిచేశారు. న్యాయవాదులు కోర్టు తలుపులు మూసినా.. తన అధికారిక వాహనాన్నే కోర్టుగా మలిచి పేద ప్రజలకు న్యాయ సహాయం అందించారు. ఉత్తరప్రదేశ్‌లో సాక్షాత్తు ప్రధాని నరేంద్ర మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసి జిల్లా రాజతలాబ్ డివిజన్‌లో జాయింట్ కలెక్టర్/మెజిస్ట్రేట్‌గా పనిచేస్తున్న సాయి అశ్రిత్ విధుల్లో తనదైన ముద్ర వేస్తున్నారు. ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా అందరికీ ఆదర్శనీయంగా నిలుస్తున్నారు. వివరాల్లోకి వెళితే...

రాజతలాబ్ రెవెన్యూ కోర్టులో మంగళవారం సాయి అశ్రిత్ ఓ భూవివాదానికి సంబంధించి తాజా ధ్రువీకరణ పత్రం సమర్పించాలని న్యా యవాదికి సూచించి తదుపరి విచారణను వాయిదా వేశారు. దీంతో సదరు న్యాయవాది అశ్రిత్‌తో వాగ్వాదానికి దిగారు. కేసు వాయిదా వేయద్దని, తక్షణమే తీర్పు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అతడికి మద్దతుగా ఇతర న్యాయవాదులు సైతం వచ్చి కోర్టు తలుపులు మూసివేశారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన అశ్రిత్ కోర్టు ఆవరణలోనే ఉన్న తన అధికారిక వాహనాన్ని కోర్టు హాల్‌గా మార్చారు. తన వాహనానికి ఉన్న లౌడ్ స్పీకర్ల ద్వారా కోర్టు కార్యకలాపాలను కొనసాగించారు. పిటిషనర్లను పిలుస్తూ వారి వాదనలు రికార్డు చేస్తూ అక్కడికక్కడే ఆదేశాలు ఇచ్చారు. దీంతో బిత్తరపోయిన న్యాయవాదులు బేరానికి వచ్చారు. తిరిగి కోర్టులోకి రావాలని అశ్రిత్‌ను అభ్యర్థించారు. వారి అభ్యర్థనను మన్నించిన అశ్రిత్.. కోర్టులో విధులను కొనసాగించారు. న్యాయపరంగా బాధితుల పక్షం వహిస్తూ అశ్రిత్ వ్యవహరించిన తీరును అందరూ ప్రశంసిస్తున్నారు.

అశ్రిత్‌కు దేశవ్యాప్తంగా జేజేలు


శాఖమూరి సాయి అశ్రిత్

ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసి జిల్లా రాజ్‌తలాబ్ కోర్టు ఆవరణలో జరిగిన సంఘటన తొలుత అక్కడి మీడియాతో పాటు జాతీయ మీ డియాను ఆకర్శించింది. దీంతో ఈ సమాచారం దేశవ్యాప్తంగా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఐఏఎస్ శిక్షణ పూర్తి చేసు కొని ఆరు నెలల కిందటే ఆయన రాజ్‌తలాబ్ జాయింట్ కలెక్టర్‌గా జాయిన్ అయ్యారు. అశ్రిత్ వృత్తి నిబద్ధతకు మంత్రముగ్ధులైన వారణాసి ప్రజలతో పాటు దేశ వ్యాప్తంగా ప్రజలు అశ్రిత్‌కు జేజేలు పలుకుతున్నారు. హనుమకొండ వాస్తవ్యుడు శాఖమూరిఅమర్ కుమారుడైనసాయి అశ్రిత్ సివిల్స్ 2022లో జాతీయ స్థాయిలో 40వర్యాంకు సాధించి ఐఏఎస్‌కు ఎంపికైన విషయం తెలిసిందే.

కవ్వాల్ ఫారెస్టుపై పరిశోధనా పత్రం

హనుమకొండ, డిసెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోరికొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన పాడిశెట్టి వరుణ్ కవ్వాల్ టైగర్ రిజర్వు అడవులపై పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. సిద్దిపేట జిల్లా ములుగు అటవీ కళాశాల, పరిశోధనా సంస్థలో ఎమ్మెస్సీ 2022-24 బ్యాచ్‌కు చెందిన వరుణ్.. తన ఎమ్మెస్సీ పరిశోధనలో భాగంగా గిట్టల క్షీరజాల మేత, ఉడుంపూర్ రేంజ్, కవ్వాల్ టైగర్ రిజర్వు అడవులపై ప్రభావం అన్న అంశంపై పరిశోధించి దాని ఫలితాలను ప్రచురించారు. ఈ పరిశోధన చైర్మన్ డాక్టర్ మిల్కూరి చిరంజీవి రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించడం గర్వంగా ఉందని వరుణ్ పేర్కొన్నారు. ఈ పరిశోధన అటవీ సంరక్షణ, నిర్వహణకు తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఈ పరిశోధన ద్వారా ఎక్కువగా మేయడం వల్ల జీవవైవిధ్యం, నేల లక్షణాలు దాని సారం, అలాగే వృక్షజాతి పునరుత్పత్తిపై ఉదంపుపూర్‌లోని అడవులలో ఎలాంటి ప్రభావం ఉందనేది కనుగొన్నట్టు తెలిపారు.


పరిశోధనా పత్రంతో పాడిశెట్టి వరుణ్

కళల్లో ప్రవేశం ఉన్నా.. కరువైన ఆదరణ

- కమనీయ కళాఖండాలతో రమేశ్ ప్రతిభ
- గ్రామీణ ప్రాంత ప్రజల హృదయాల్లో నిలిచిన జానపద కళాకారుడు

నెక్కొండ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సృజనాత్మకత, పట్టుదల ఉండాలే కానీ.. ప్రకృతిలో దొరికే ఏ వస్తువునైనా సరే కమనీయ కళాఖండాలుగా ఆవిష్కరించవచ్చని నిరూపిస్తున్నాడు వరంగల్ జిల్లా నెక్కొండ మండలం తోపనపల్లి గ్రామానికి చెందిన జానపద కళాకారుడు తంగళ్లపెల్లి రమేశ్. ఆర్థికపరమైన అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్న ఓ సగటు గ్రామీణ యువకుడు సమాజంలో గుర్తింపు పొందడంతో పాటు సామాజిక సేవ చేయాలన్న దృఢ సంకల్పం అన్ని కళల్లో తాను సైతం అంటున్నాడు. తెలంగాణ ఉద్యమ కాలంలో తన ఆట పాటలతో ప్రజలను చైతన్యవంతులు చేయడంలో సఫ్రూలీకృతుడైన రమేశ్.. వివిధ కళా, సాంస్కృతిక విభాగాల్లో తన ప్రతిభను ప్రదర్శించి దేశవ్యాప్తంగా జరిగిన పలు పోటీల్లో అవార్డులను అందుకుంటున్నా ప్రభుత్వ ఆదరణకు మాత్రం నోచుకోవడంలేదు. అతని చేతి వేళ్లతో అనేక అందమైన చిత్రాలు రూపుదిద్దుకుంటున్నాయి. రంగులతో రమేశ్ వేసే స్పాట్ పెయింటింగ్స్ బహుమతులను గెలుచుకున్నాయి. చీపురు పుల్ల, అగ్గిపుల్ల, సుద్దముక్క, థర్మకోల్ లతో రమేశ్ రూపొందించిన కళాకృతులు అందరినీ అబ్బురపరుస్తున్నాయి. వక్తృత్వ, వ్యాసరచన రాష్ట్రవ్యాప్తంగా పోటీల్లో పాల్గొని బహుమతులను అందుకున్నారు. తంగళ్లపల్లి రమేశ్ కళలో చూపుతున్న ఆదరణతో మండలంలో జానపద కళా రమేశ్‌గా గుర్తింపును పొందాడు.


నెక్కొండ మండలంలోని గిరిజన తండాలో తోటి కళాకారులతో కలిసి పాటలు పాడుతున్న రమేశ్

రమేశ్ రచించిన జాపపద కవితా కుసుమాలు

మాతృభాషపై మక్కువతో.. అమ్మపాల స్వచ్ఛత తెలుగు అంటూ, పూల జాతర బతుకమ్మ పై.. తీరొక్క పూలవనం.. ఒక్కటై కూర్చి పేర్చినా బతుకమ్మల సమ్మేళనం అంటూ, తెలంగాణ ఉద్యమ స్ఫూరిగా.. అగ్ని కణికమై భగ్గుమనాలిరా యుద్ధమే జరగాలిరా అంటూ, రైలు రోకోపై.. రైలు కూతే ఆపమంది రణం చేయరమ్మంది అంటూ, సత్యాగ్రహం స్ఫూర్తిగా.. ఉసిళ్ల పుట్టోలే ఉరికిరండి చీమల దండోలే సాగిరండి అంటూ, అన్నదాతల స్థితిపై.. అన్నన్న మాయన్న అన్నా రైతన్న అంటూ, మిలియన్ మార్చ్ స్ఫూర్తిగా సబ్బండ వర్ణాలు ఏకమవ్వగా కవాతు చేయగా కదిలిరండంటూ అనేక రచనలతో సమాజంలో స్ఫూర్తిని కల్గిస్తున్నారు.


చీపురు పుల్లలతో తయారు చేసిన చిత్రాలు

సుద్దముక్కలతో తయారు చేసిన అమరుల స్థూపం


సమాజాన్ని చైతన్యపరిచేందుకు నాటకాలను సైతం..

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు, నిరక్షరాస్యుల్లో స్ఫూర్తిని కలిగించేందకు ఎసమాజంలో చదువుకు ఉన్న విలువ, ఎయిడ్స్ , క్యాన్సర్ వంటి భయంకర వ్యాధిపై ఎకళ్ళు తెరిచి చూడరా ఓరన్నో అనే నాటకాలను రచిర్యాచగా ఈ ప్రదర్శనలు ప్రజాధరణ పొందాయి. అలాగే ఎచింతచెట్టు కొమ్మన్ వంటి రమేశ్ రచించిన అనేక జానపద గేయాలు వివిధ ప్రైవేట్ చానళ్లలో ప్రసారం చేయగా ప్రేక్షకుల అదరణ అభించింది.

రమేశ్ సృష్టించిన కళాకండాలు

ఐస్‌క్రీం పుల్లలతో సృష్టించిన తెలంగాణ అమరవీరుల స్థూపం, సుద్దముక్కలతో చార్మినార్, కాకతీయ కళాతోరణం, చీపురు పుల్లలతో పల్లె గణపతి, తాజ్‌మహల్, అమరుల స్థూపం, తెలంగాణ తల్లి స్పాట్ పెయింటింగ్, రైతన్నల ఎడ్లబళ్లు వంటి వాటిని అనేక కళాకండాలను తయారు చేస్తున్నారు.

మానవుడి మనోవికాసానికి జానపద కళారూపాలు



మానవుడి మనోవికాసానికి, వినోదానికి మంచి నడవడికి జానపద కళారూపాలు ఆలంబనగా నిలిచాయి. సినిమాలు, టీవీలు లేని ఆ రోజుల్లో ఈ వృత్తి కళాకారుల ప్రదర్శనలకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అలసిపోయిన పల్లె ప్రజలకు జానపద కళకారుల ప్రదర్శనలు సేదతీర్చేవి. జానపద కళలను నమ్ముకుని జీవనం సాగించిన కళాకారులకు నేడు ఆదరణ కరువవ్వడంతో, కళలను నమ్మూకోలేక.. నమ్ముకున్న కళలకు కూడు పుట్టక దుర్భర జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం జానపద కళాకారులను ఆదుకోవాలి.

- తంగళ్లపెల్లి రమేశ్, తోపనపల్లి, నెక్కొండ

బీపీ.. షుగర్.. భయపెడుతున్నయ్..

(5వ పేజీ తరువాయి)

ఉండగా, 35,952మంది మహిళలు ఉన్నారు. మధుమేహం కేసులు 38,726 నమోదవగా.. 39,898 మంది పురుషులు, 35,952మంది మహిళలున్నారు. ఇక పూర్తిగా ఏజెన్సీ జిల్లా అయిన ములుగులో బీపీ, షుగర్లకు కట్టడి పడుతోంది. నగర ప్రాంతాలతో పోలిస్తే ములుగు జిల్లాలో బీపీ, షుగర్ కేసుల సంఖ్య తక్కువగా నమోదవుతున్నాయి. ములుగు జిల్లాలో 1,56,450మందికి బీపీ పరీక్షలు చేస్తే 17,426 మందికి బీపీ ఉన్నట్టుగా గుర్తించారు. అంటే 11.13శాతం మందికి మాత్రమే రక్తపోటు ఉంది. అలాగే 1,50,498మందికి షుగర్ టెస్టులు నిర్వహిస్తే కేవలం 7,290మందికి మాత్రమే మధుమేహం ఉన్నట్టుగా గుర్తించారు. అంటే కేవలం 4.85శాతం ప్రజలు మాత్రమే మధుమేహం బారిన పడ్డట్టుగా నిర్ధారించారు. అయితే గతంతో పోల్చితే ములుగు ఏజెన్సీలో ఈ వ్యాధులు గణనీయంగా పెరిగినట్టు భావిస్తున్నారు. వరంగల్‌తో పోల్చితే తక్కువే అయినా, ఆక్సిజన్ ఎక్కువగా లభించే అటవీ ప్రాంతాల్లో శారీరక శ్రమతో పాటు ఒత్తిడి లేకుండా జీవించే ప్రజల్లో ఈ మార్పు కూడా ప్రమాదకరమేనని వైద్యనిపుణులు హెచ్చరి స్తున్నారు. వీటితో పాటు హనుమకొండ జిల్లాలో గణనీయంగా 68శాతం ప్రజలను బీపీ లేదా షుగర్ వెంటాడుతున్నాయి. భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో కూడా ఈ జీవన శైలి జబ్బులు విస్తరిస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో 25ఏళ్ల నుంచి 40ఏళ్ల యువతే బీపీ, షుగర్ బారిన పడుతుండగా, గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం 45 ఏళ్ల నుంచి 50ఏళ్లు పైబడిన వారే బీపీ లేదా షుగర్ బారిన పడుతున్నట్టు ఇటీవల నిర్వహించిన ఓ సర్వేలో తేలింది. ఈ స్థాయిలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా బీపీ, షుగర్ బాధితులు పెరగడం అత్యంత ఆందోళన కలిగించే అంశమని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

నియంత్రణ లేక.. గుండె జబ్బుల గురై..

ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్యంపై శ్రద్ధ లేకుండా పోతోంది. చిన్న వయసులోనే సంపాదన, ఉద్యోగం, వృత్తిపై యువత దృష్టి పెట్టి ఆరోగ్యాన్ని పట్టించుకోవడం మరిచిపోతున్నారు. కంప్యూటర్‌పై ఉద్యోగాలు చేసేవారు, ప్రైవేట్ ఉద్యోగులు, నిరుద్యోగులు ఉద్యోగాల వేటలో ఒత్తిడికి గురవుతున్నవారు. ఆహార శారీరక శ్రమ లేకపోవడం తదితర కారణాలతో బీపీ, షుగర్‌లకు గురవుతున్నారని వైద్యులు అభిప్రాయ పడుతున్నారు. ఖాళీగా ఉన్న యువత సెల్‌ఫోన్లు, కంప్యూటర్లకు అతుక్కుపోయి ఒత్తిడికి గురవుతున్నారు. సోషల్ మీడియాకు బానిసగా మారి ఒత్తిడిని పెంచుకుంటూ.. బీపీని తెచ్చుకుంటున్నారని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. డయాబెటీస్ జీవనశైలిపై ఆధారపడి ఉంటుందని, వంశ పారం పర్యంగా లేదా మానసిక ఒత్తిడి, జంక్‌ఫుడ్ తినడం, సరైన వ్యాయామం చేయకపోవటం, పొగాకు, మద్యం, డ్రగ్స్ లాంటి వ్యసనాలు ఉన్నవారికి షుగర్ ఎటాక్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. జీవన శైలిపై నియంత్రణ లేకపోవడంతో రక్తపోటు, మధుమేహం పెరిగి గుండె జబ్బులకు దారితీస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

రక్తపోటు, మధుమేహం నియంత్రణ ఇలా..

- ఒత్తిడిని తగ్గించుకునేందుకు యోగ, నడక, శారీరక శ్రమకు వ్యాయం
- ప్రతి రోజు కనీసం గంట సమయం వ్యాయమానికి కేటాయించాలి
- జంక్ ఫుడ్‌లకు, ఇంటి బయటి ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి
- ప్రతి రోజు వయస్సును బట్టి 6నుంచి 8గంటల కంటినిండా నిద్రపోవాలి
- అవసరం లేని సమయంలో కంప్యూటర్, సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలి
- ప్రతీ రెండు నెలలకు ఒకసారి షుగర్ టెస్టులు చేయించాలి. ప్రాథమిక స్థాయిలో ఉంటే మందులు లేకుండానే నియంత్రించే అవకాశం ఉంది.
- 30ఏళ్లు దాటిన ప్రతీ ఒక్కరు ఎన్‌సీడీ (జీవన శైలి జబ్బులు) స్క్రీనింగ్ చేయించుకోవాలి.
- మద్యం, డ్రగ్స్, పొగాకు లాంటి వాటికి దూరంగా ఉండాలి

సీపీఐ కార్యాలయానికి కుర్చీల వితరణ



సీపీఐ పార్టీ కార్యాలయానికి కుర్చీలను అందజేస్తున్న దాతలు

హసన్‌పర్తి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 65వ డివిజన్ ఎల్లాపూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న సీపీఐ పార్టీ కార్యాలయానికి పలువురు దాతలు 80 కుర్చీలను బుధవారం అందజేశారు. పార్టీ కార్యాలయానికి దాతలు మోతె ఆసిరెడ్డి, పాడి మోహన్‌రెడ్డి, రేణిగుంట్ల పోశెల్లయ్య, పాల ఎల్లయ్య, వట్టె మల్లారెడ్డి, గాజుల రాజేశం, ఎల్లాపూర్ గ్రామ సహాయకుడు ఎర్ర ఎల్లయ్య, ఎండీ.అజిముద్దీన్ స్మారకార్థం వారి కుటుంబ సభ్యులు అందజేసినట్లు సీపీఐ మండల కార్యదర్శి మెట్టు శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా దాతలను రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, బీసీ హక్కుల నాయకులు నేదునూరి రాజమౌళి అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

రహదారులపైనే బర్త్‌డే వేడుకలు

» జూనియర్‌పై సీనియర్ల వేధింపులు

హసన్‌పర్తి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయానికి కూత వేటు దూరంలోనే ఇంజనీరింగ్ విద్యార్థుల ఆకతాయి చేష్టలతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల పరిధిలోని పలు ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థుల తమ తోటి జూనియర్లను కళాశాల బయటకు తీసుకొచ్చి వేధింపులకు గురిచేస్తున్న ఘటనలు చోటు చేసుకుంటున్నప్పటికీ వెలుగులోకి రావడం లేదన్న విమర్శలు తల్లిదండ్రుల నుంచి వినిపిస్తున్నాయి. హసన్‌పర్తి పద్మశాలీ క్వార్టర్స్ రహదారి పక్కనే ఉన్న బాలికల గురుకుల విద్యాలయం గేటు సమీపంలో నిత్యం ఆకతాయిల చేష్టలతో పాదాచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బర్త్‌డే వేడుకల పేరుతో జూనియర్లను సీనియర్లు ర్యాగింగ్ చేయడమే కాకుండా వారిపై దాడులకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయ బీట్ కానిస్టేబుల్స్ దృష్టికి వచ్చినప్పటికీ ఆవేమి పట్టనట్లుగా వ్యవహరించడంతోనే ఇంజనీరింగ్ విద్యార్థుల వికృత చేష్టలు నిత్యం కొనసాగుతున్నాయనే ఆరోపణలున్నాయి.

అంతేకాకుండా అంబాల ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఓ దాబాలో ఇలాంటి ఘటనలే నిత్యకృత్యమైనప్పటికీ ఇటు కళాశాలల యాజమాన్యం, అటు పోలీసులు పట్టింపులేనితనంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు నిర్మానుష్య ప్రదేశాలలో విచ్చలవిడిగా సంచరిస్తున్న యువతపై దృష్టి సారించి కళాశాలల యాజమాన్యంతో పాటు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్‌లు ఏర్పాటు చేసి శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంలో పోలీసు బాస్ ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాల్సిందే...

స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

శంభునిపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని డాక్టర్ ఆకారపు రాజగోపాల్ సూచించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ వరంగల్ వారియర్స్ ఆధ్వర్యంలో పెగడపల్లి గ్రామానికి చెందిన నిరుపేద మహిళ అయిన ఎల్ఎస్ స్రవంతికి మాధవ హాస్పిటల్ తరపున బుధవారం డాక్టర్ రాజగోపాల్ కుట్టు మిషన్‌ను అందించారు. కుటుంబాలకు మహిళలు ఆర్థికంగా అండగా ఉండాలన్నారు. లయన్స్ క్లబ్ సభ్యులు బరుపట్ల రవి, ఎమ్డీ యాకూబ్ పాషా, జగన్నాథం పాల్గొన్నారు.



పనిభారంతో ఇబ్బందులు

» సుబేదారి పోలీసు స్టేషన్‌లో సిబ్బంది కొరత

» ఉన్న సిబ్బందిపైనే అధిక భారం

హనుమకొండ టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ నగరంలోని సుబేదారి పోలీసుస్టేషన్‌లో అదనపు పనిభారంతో పోలీసు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. స్టేషన్‌లో 80 మందికి పైగా పోలీసు సిబ్బంది ఉండవలసిందిగా 60 మంది మాత్రమే ఉన్నారు. దీంతో నగరం నడిబొడ్డున ఉన్న సుబేదారి పోలీసు స్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ నుంచి ఎస్‌హెచ్‌ఓ వరకు పనిభారంతో ఫిర్యాదుదారులకు అందుబాటులో ఉండడం లేదని బాధితులు పేర్కొంటున్నారు. హనుమకొండ బస్టాండ్ నుంచి న్యూ శాయంపేట, వడ్డెపల్లి, అదాలత్, రాంనగర్, కాళోజీ జంక్షన్ ప్రధాన కూడళ్ల పరిధి సుబేదారి పోలీసు స్టేషన్‌కు వస్తుంది. జిల్లా కలెక్టర్ కార్యాలయం, జిల్లా కోర్టు, ప్రధాన హాస్పటళ్లు సైతం స్టేషన్‌పరిధిలోనే ఉన్నారు. దీనికి తోడు జిల్లా మంత్రి కొండా సురేఖ నివాసం సుబేదారి పోలీసు స్టేషన్ పరిధి రాంనగర్‌లో ఉంది. వర్ధన్నపేట, వరంగల్ పశ్చిమ, నర్సంపేట శాసన సభ్యుల నివాసాలు స్టేషన్ పరిధిలో ఉండడంతో సర్క్యూట్ గెస్ట్ హౌస్‌లు సైతం ఉన్నాయి.

ఒకవైపు పోలీసుస్టేషన్‌లో సిబ్బంది కొరత ఉన్నప్పటికీ ప్రొటోకాల్ కల్పించాలన్నా ఉన్న సిబ్బందితో విధులు నిర్వర్తిస్తున్నారు. వివిధ సమస్యలపై ప్రజా సంఘాల నాయకులు కలెక్టర్ కార్యాలయం, ఏకశిల పార్కు, హరిత హోటల్, కాళోజీ జంక్షన్, అంబేద్కర్ జంక్షన్‌లలో ధర్నాలు జరుగుతుండటంతో పోలీసులకు కంటిమీద కునుకే లేకుండాపోతోంది. దీనికి తోడు ఇటీవల జరిగిన సీఎం రేవంత్‌రెడ్డి సభ నిర్వహించారు. సుమారు 150 నుంచి 200 మందికి పైగా పోలీసు సిబ్బందికి భోజనాలు ఏర్పాటు చేయడం స్టేషన్‌లోని పోలీసు అధికారులకు జేబులు గుల్ల అవుతున్నట్లు తెలుస్తోంది. సుబేదారి పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వర్తించాలంటేనే పోలీసులు విధులకు భయపడుతున్నట్లు తెలుస్తోంది. కొంత మంది సిబ్బంది ఇతర పోలీసు స్టేషన్లకు ట్రాన్స్‌ఫర్ పెట్టుకుంటున్నట్లు చెబుతున్నారు. సిబ్బంది కొరత ఉండడంతో ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాలతో రాత్రి, పగలు అనక సిబ్బంది అదనపు పనులు చెబుతున్నారు. అనారోగ్యంతో ఉన్నా సెలవులు కావాలని కోరినా సిబ్బందికి ఉన్నతాధికారులు సెలవులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు చెబుతున్నారు. ఇప్పటికైనా పోలీసు కమిషనర్ సుబేదారి పోలీసు స్టేషన్‌కు అవసరమైన పోలీసు సిబ్బందిని నియమించాలని ఫిర్యాదుదారులకు పోలీసులు మెరుగైనసేవలందించాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

కాజీపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏసు క్రీస్తు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండలోని వివిధ డివిజన్లలో క్రిస్మస్ వేడుకలను చర్చీలలో క్రైస్తవులు నేత్రపర్వంగా బుధవారం నిర్వహించుకున్నారు. కాజీపేటలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం రాత్రి నుంచే ప్రారంభమైన వేడుకలు బుధవారం ఉదయం సైతం కొనసాగాయి. చర్చీలు క్రైస్తవులతో కిటకిటలాడాయి. విద్యుత్ కాంతిల్లో చర్చీలు వెలిగిపోయాయి. ఫాతిమానగర్ కేథడ్రల్ చర్చీలో విచారణ గురువు కాసుమర్రెడ్డి క్రీస్తు జననం, ఆయన మానవాళికి చేసిన సేవలపై ప్రత్యేక సందేశం ఇచ్చారు. కాజీపేట బాపూజీనగర్ పెనుయేలు బాప్టిస్టు చర్చీలో పాస్టర్ పి.విక్టర్ బాబురాజ్, 47వ డివిజన్ డీజిల్‌కాలనీ, భవానీనగర్‌లోని ఇమ్మాన్యుయేల్ గాస్పల్ చర్చీలో పాస్టర్ శ్రవణ్ కుమార్ వరకుమారీలు కీస్తు సందేశాన్ని ఇచ్చారు. అనంతరం జరిగిన కేక్ కటింగ్‌లో రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగారాఘవ రెడ్డి, నాయకులు సందెల విజయ్, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజు యాదవ్‌లు పాల్గొన్నారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని బుధవారం కాజీపేట మండలంలోని పలు చర్చీలలో జిల్లా యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు కేఆర్ దిలీప్‌రాజ్ బృందం 300 మందికి బ్లాంకెట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు కర్ర హరీష్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ బస్కె శ్రీలేఖ, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కట్కూరి రేవంత్ పాల్గొన్నారు.

- హసన్‌పర్తి: గ్రేటర్ 55వ డివిజన్ భీమారం పెంతకోస్తు చర్చిలో బుధవారం పాస్టర్ తాళ్లపల్లి బెనహర్ ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ వేడుకలకు కార్పొరేటర్ జక్కుల రజితవెంకటేశ్వర్లు యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. భగీరథ కార్యాలయ ఆవరణలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వాకర్స్ ప్రతినిధులు, క్రైస్తవ ప్రతినిధులు కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకొని ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో విఎషన్ భగీరథ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధు లు కందుకూరి చంద్రమోహన్, మండల భిక్షపతి, గౌరిశెట్టి శ్రీనివాస్, గడ్డం రవీందర్, రవిప్రసాద్ పాల్గొన్నారు.
- వడ్డెపల్లి: 56వ డివిజన్ గోపాల్‌పూర్ షాలేం బాప్టిస్టు సంఘం అధ్యక్షుడు ఎస్.పరంజ్యోతి, కార్యదర్శి ఇమ్మడి రాజేంద్రప్రసాద్, కోశాధికారి ఇర్మియా ఆధ్వర్యంలో చర్చిలో వేడుకలను జరుపుకున్నారు. తొలుత కేక్ కట్ చేసి, మహిళలకు చీరలను పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో షాలేం బాప్టిస్టు సంఘం ప్రతినిధులు కందుకూరి మహేందర్, పుట్ట రాజు, ప్రవీణ్‌తో పాటు క్రైస్తవులు అధిక సంఖ్యలోపాల్గొని ఏసు క్రీస్తును స్మరిస్తూ ఆలాపించిన గేయాలు ఆద్యంతం అలరించాయి. డివిజన్‌లోని జవహర్ కాలనీలో యూత్ ప్రతినిధి చిట్యాల విజయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని కేక్‌ను 56వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, బీజేపీ డివిజన్ ఇన్‌చార్జి బండి హరీష్ ముదిరాజ్ కట్ చేసి పంపిణీ చేశారు. వడ్డెపల్లి చర్చి జంక్షన్‌లోని తెలుగు బాప్టిస్టు చర్చితో పాటు వివిధ చర్చీలలో క్రిస్మస్‌ను పరస్కరించుకొని క్రైస్తవులు ప్రత్యేక ఆరాధన లు నిర్వహించారు. పాస్టర్లు బైబిల్‌లోని ప్రవచనాలు చదివి వినిపించారు.
- వరంగల్ కార్పొరేషన్: గ్రేటర్ వరంగల్ 5వ డివిజన్ హనుమాన్‌నగర్‌లోని ఫేయిత్ బాప్టిస్టు చర్చిలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. చర్చి పాస్టర్ వేదకుమార్ మాదాసు యేసు బోధించిన వ్యాఖ్యాన్ని భక్తులకు వెల్లడించారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కళాకారులు క్రైస్తవ గీతాలు ఆలపించి అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు ప్రసాద్, ఇందిర, గడిపె జీవన్‌కుమార్, సదానంద్, ఎం.రాజు యాదవ్, కవిత, కుమారస్వామి, సరిత తదితరులు పాల్గొన్నారు.



కాజీపేట డీజిల్‌కాలనీ చర్చిలో పాల్గొన్న జంగా రాఘవరెడ్డి



కాజీపేట ఫాతిమా కేథడ్రల్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న కాసుమర్రెడ్డి



ఫెయిత్ బాప్టిస్ట్ చర్చిలో గీతాలు ఆలపిస్తున్న కళాకారులు







మిషన్ భగీరథ కార్యాలయంలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, గోపాల్‌పూర్ చర్చిలో ఆరాధన చేస్తున్న పాస్టర్, భీమారం చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ జక్కుల రజితవెంకటేశ్వర్లు

ఎన్‌సీసీ క్యాడెట్లను అభినందించిన ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్



క్యాడెట్లను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతి

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 25: ఇటీవల కర్ణాటక రాష్ట్రం బెల్గాంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఎన్‌సీసీ క్యాడెట్ల ట్రెక్కింగ్‌లో పాల్గొన్న ఆర్ట్స్ కళాశాల విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.జ్యోతి అభినందిం చారు. బుధవారం కళాశాలలో ట్రెక్కింగ్‌లో పాల్గొని బహుమతులు సాధిం చిన అనిల్‌కుమార్, నవీన్, మహేష్‌లను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రమేష్, ఎన్‌సీసీ అధికారి బి.ప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని మృతిపై విచారణ చేపట్టాలి

కేయూ క్యాంపస్ డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జూనియర్ కళాశాల విద్యార్థిని గుగులోత్ శ్రీదేవి మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కాజీపేట ఏసీపీ బి.తిరుమల్‌ను పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్, ఎస్ ఎఫ్ఐ నేతలు కలిసి వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా నరసిం హరావు మాట్లాడుతూ.. శ్రీదేవి మృతిపై విద్యాశాఖాధికారులు, పోలీసులు దర్యాప్తు చేపట్టి సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. యాజమా న్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. లేకపోతే విద్యార్థి సంఘాల నేతృత్వంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా జనరల్ సెక్రటరీ మంద శ్రీకాంత్, భాషబోయిన సంతోష్, జస్వంత్, సాయికుమార్, సందీప్, విజయ్, గణేశ్, రవితేజ, కుమార్, చరణ్,పృథ్వీరాజ్, వంశీ, రమేశ్ రాథోడ్, పవన్‌కల్యాణ్ పాల్గొన్నారు.



ఏసీపీ తిరుమల్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

30 నుంచి రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు

కాశిబుగ్గ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అన్ని జిల్లాల్లో సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలు ఇటీవల ముగిశాయి. రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు ఈనెల 30వ తేదీ నుంచి జనవరి 2వ తేదీ వరకు కొనసాగుతాయి. ఈనెల 27నుంచి ప్రారంభం కావాల్సి ఉండగా వర్షం కారణంగా 30వ తేదీకి వాయిదా వేసినట్లు జిల్లా యువజన క్రీడా అధికారిణి సత్యవాణి తెలిపారు. ఈనెల 29వ తేదీ సాయంత్రం వరకు ఖోఖో టీంలు ఓ సిటీ స్టేడియంకు చేరుకోవాలని ఆమె సూచించారు.

ఘనంగా వాజ్‌పేయి జయంతి

వడ్డెపల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లోని సర్దార్ సర్వాయి పాపన్న జంక్షన్‌లో డివిజన్ బీజేపీ ఇన్‌చార్జ్ బండి హరీష్ ముదిరాజ్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యాలయ కార్యదర్శి అలుగునూరు కృష్ణరాజు, జిల్లా నేతలు చింతలఫణి అమరేందర్‌రెడ్డి, కోలా రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతిని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో బీజేపీ రాష్ట్ర నేత మార్తినేని ధర్మారావు, ఓబీసీ మోర్చ రాష్ట్ర నేత బింగి శ్రీనివాస్, చింతల రఘుపతి, శనిగరపు విజయ్‌కుమార్‌లు రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు.

- జులైవాడలో మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి జయంతిని బుధవారం 59వ డివిజన్‌లో మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్‌రెడ్డి ప్రారం భించి మాట్లాడారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో 8, 60 డివిజన్ల కార్పొరేటర్లు బైరి లక్ష్మి, దాస్యం అభినవ్ భాస్కర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సదానందం, భరత్‌గౌడ్, సరోత్తంరెడ్డి, మిద్దెల బాబు, మహేందర్ పటేల్, వాసుదేవరెడ్డి, విష్ణువర్దన్‌రెడ్డి, వెంక ట్రా వు, నిఖిల్‌రావు, రాంమోహన్, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.
- హసన్‌పర్తి : గ్రేటర్ 66వ డివిజన్ హసన్‌పర్తిలో మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి జయంతి ఉత్సవాలను బీజేపీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ ఆధ్వర్యంలో స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.
- కాజీపేట : మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జన్మదిన వేడుకలు బుధవారం కాజీపేట వెంకటలక్ష్మి కూరగాయల మార్కెట్‌లో ఘనంగా జరిగాయి. మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు హాజరై కేక్ కట్‌చేశారు.
- మడికొండ : మడికొండ చౌరస్తాలో బుధవారం భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్ జయంతి ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 46వ డివిజన్ కార్పొరేటర్ మునిగాల సరోజన కరుణాకర్ హాజరై కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు తోటిరెడ్డి రవీందర్ రెడ్డి, పొనగోటి వెంకట్ రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం మహేందర్ పాల్గొన్నారు.
- రాంనగర్: మాజీ ప్రధాని, భారతరత్న అవార్డు గ్రహీత అటల్ బిహారీ వాజ్‌పేయ్ శత జయంతి వేడులకను బుధవారం హంటర్‌రోడ్డులోని బీజేపీ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొలను సంతోష్‌రెడ్డి వాజ్‌పేయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పులి సరోత్తంరెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు, జిల్లా నాయకులు పాశికంటి రాజేంద్రప్రసాద్, చిర్ర నర్సింహా, నర్మట్ట శ్రీనువాస్, నాను నాయక్, చాంద్ పాషా, వలబోజు శ్రీనువాస్, సంపత్‌రెడ్డి, ప్రసాద్, మధుచంద్ర, రాజు, తిరుపతిరెడ్డి, అభిషేక్, తిలక్, మంజుల రెడ్డి, శ్రీదేవి, తులసీ తదితరులు పాల్గొన్నారు.
- హనుమకొండ కలెక్టరేట్: మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయ్ శత జయంతి ఉత్సవాలు హనుమకొండ సుబేదారిలోని రెడ్‌క్రాస్‌లో బుధవారం మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అటల్ బిహారీ వాజ్‌పేయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం 100 మంది రక్తదానం చేశారు. మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు 80వ సారి రక్తదానం చేసి రికార్డు సృష్టించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ధర్మారావు మాట్లాడుతూ.. వాజ్‌పేయ్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా 100 మంది రక్తదానం చేయడం జరిగిందని, 80సార్లు రక్తదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, మాజీ మేయర్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణగౌడ్, మాజీ జిల్లా అధ్యక్షులు దొంతి దేవేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు దాస్యం అభినవ్ భాస్కర్, గుజ్జుల వసంత మహేందర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు కొలను సంతోష్‌రెడ్డి, సదానందగౌడ్, మాజీ కార్పొరేటర్లు మిద్దెల బాబు, రావుల సుదర్శన్, జిల్లా నాయకులు మారెపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, పులి సరోత్తంరెడ్డి, శ్రీరాంరెడ్డి, రఘోత్తంరెడ్డి, పొనగోటి వెంకట్‌రావు, మాదాసు ప్రణయ్ పాల్గొన్నారు.



80వ సారి రక్తదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారావు



హసన్‌పర్తిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు



హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నేతలు



కాజీపేటలో వేడుకల్లో పాల్గొన్న నాయకులు

ట్రాఫిక్ సమస్యకు పరిష్కారమేది..?

» ఇబ్బందికరంగా హసన్‌పర్తి మార్కెట్ ఏరియా » ప్రత్యామ్నాయం లేకుంటే అవస్థలు » చోద్యం చూస్తున్న బల్దియా అధికారులు



హసన్‌పర్తిలో నిరుపయోగంగా ఉన్న కూరగాయల మార్కెట్

హసన్‌పర్తి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తిలో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమవుతోంది. జనాభా కనుగుణంగా రోడ్ల విస్తరణ లేకపోవడంతో తరచూ ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. హసన్‌పర్తి బస్టాండ్‌లో మార్కెట్ ప్రధాన సమస్యగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి రైతులు డివిజన్ కేంద్రంలో కూరగాయలను విక్రయిస్తుంటారు. అదే సమయంలో కూరగాయలు కొనుగోలు చేసే విక్రయదారులు, వ్యాపారులు ఒకే సమయంలో మార్కెట్‌కు రావడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. హసన్‌పర్తి నుంచి ప్రధాన రహదారి గుండా వివిధ ప్రాంతాలకు, కాలనీలకు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉదయం, సాయంకాలం వేళల్లో అయితే మార్కెట్ ప్రాంతం మరీ ఇబ్బందికరంగా ఉంటుంది. కూరగాయల విక్రయదారులు ప్రధాన రహదారి సెంటర్‌లో క్రయవిక్రయాలు కొనసాగిండం వల్ల మార్కెట్ ప్రాంతంలో ఇటు కూరగాయల విక్రయదారులు, అటు ప్రయాణికులు, వాహనచోదకులతో ఆ ప్రాంతం కిక్కిరిసిపోతోంది. దీంతో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమవుతోంది.

శాశ్వత మార్కెట్ కోసం ప్రతిపాదనలు

హసన్‌పర్తిలో శాశ్వత మార్కెట్ కోసం అప్పటి కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఆర్‌డీఓ వెంకటమాధవరావు, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ ప్రతిపాదనలు చేశారు. డివిజన్ కేంద్రంలోని పెద్ద చెరువు శివారులో శాశ్వత మార్కెట్ కోసం స్థలాన్ని ప్రతిపాదించాలని రెవెన్యూ శాఖ అధికారులను ఆదేశించారు. గతంలో చెరువు శివారును ఆనుకొని ఉన్న ప్రభుత్వ, ఇనాం భూమిలో శాశ్వత మార్కెట్ కోసం స్థలాన్ని పరిశీలించారు. ఎండోమెంట్, రెవెన్యూ అధికారులతో మాట్లాడి ప్రభుత్వ ఇనాం భూమిని గుర్తించి కార్పొరేషన్ అధికారులకు ప్రతిపాదనలు పంపించాలని అప్పటి కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఆర్‌డీఓ వెంకటమాధవరావు రెవెన్యూ అధికారులకు సూచించారు. అయినప్పటికీ వీటి అమలుకు రెవెన్యూ అధికారులు ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారు.

వాడకంలో లేని తాత్కాలిక మార్కెట్

డివిజన్ కేంద్రంలో సమస్యాత్మకంగా మారిన కూరగాయల మార్కెట్ కోసం అప్పటి ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్ తన అనుచరుడితో హసన్‌పర్తి ఆర్‌టీసీ బస్టాండు వెనకాలే తాత్కాలిక మార్కెట్‌ను సుమారు కోటి రూపాయలతో నిర్మించారు. తూతూ మంత్రంగా నిర్మించిన మార్కెట్‌లో కూరగాయల విక్రయదారులకు స్థలం కేటాయించడంలో పారదర్శకత లేదని ఆరోపణలున్నాయి. లక్షలు వెచ్చించి నిర్మించిన కూరగాయల మార్కెట్ మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. కూరగాయల విక్రయదారులకు కేటాయించిన స్థలం అనర్హులకే అనుకూలంగా ఇచ్చారన్న ఆరోపణలున్నాయి. దీంతో కూరగాయల విక్రయదారులు ఇష్టారాజ్యంగా కూరగాయాల విక్రయాలకు పాల్పడుతుండడంతో మార్కెట్ సమస్య తిరిగి మొదటికే వచ్చింది.

ప్రత్యామ్నాయం లేకుంటే అవస్థలు

జనాభా పెరుగుదల కనుగుణంగా డివిజన్ కేంద్రంలో మార్కెట్‌ను విస్తరించాలి. మార్కెట్ కోసం ప్రత్యేక స్థలాన్ని ఏర్పాటు చేయాలి. ప్రస్తుత మార్కెట్‌ను తక్షణమే మరో చోటికి మార్చివేయాలి. బస్టాండు ప్రాంతంలో ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన రేకులను తొలగించాలి. వ్యాపారులు పార్కింగ్ కోసం ప్రత్యేక సెల్లార్లను ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలి. కొత్తగా నిర్మించే భవనాలకు సెల్లార్లు ఉంటేనే అనుమతి ఇచ్చేందుకు బల్దియా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలి. కార్పొరేషన్ నిబంనదలకు అనుగుణంగా ప్రధాన రహదారిపై నిర్మించే నూతన భవనాలకు అనుమతులు ఇచ్చే విధంగా బల్దియా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలి. కమర్షియల్ భవనాలకు పార్కింగ్ కోసం ప్రత్యేక సెల్లార్లు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపైనే కూరగాయల విక్రయాలతో ట్రాఫిక్ సమస్య

నవ్య

కుటుంబ కదంబం

గురువారం
26 డిసెంబరు 2024

ముత్యాల ముగ్గు

మాకు పంపండి

మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! ఎన్ని చుక్కలు, ఎన్ని వరసలు లాంటి వివరాలను కూడా రాయండి. మీ పేరు, మీ పూర్తి అడ్రస్సు, పాస్‌పోర్టు సైజు ఫొటో పంపడం తప్పనిసరి.

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు,
ఆంధ్రజ్యోతి కార్యాలయం,
రోడ్ నెంబర్ 70, హుడా హైట్స్,
జూబ్లీ హిల్స్,
హైదరాబాద్-500033.

ఈ-మెయిల్:
features@andhrajyothy.com



ఇంద్రాణి ముక్కాల, హైదరాబాద్



ఆంగ్ల సాహిత్యంలో డిగ్రీ... బ్యాంకులో ఉద్యోగం... వీటికన్నా 'ఫిషర్‌ఉమన్' అనే గుర్తింపే తనకు ఎక్కువ సంతృప్తినిస్తోందంటోంది **సుభిక్షా కుమార్**. తమిళనాడులోని పెరియతలైకి చెందిన ఈ 23 ఏళ్ల అమ్మాయి చేపల వేటలోనే కాదు... ఔత్సాహిక పారిశ్రామికవేత్తగా, సీ-వ్లోగర్‌గా కూడా తనదైన ముద్ర వేస్తోంది.

సాగరంలో సాహసి

"సముద్రంలో వేట ఎప్పుడూ కత్తిమీద సామే. ఎంత అనుభవం ఉన్నవారికైనా ప్రతి రోజూ ఒక అగ్నిపరీక్షే. పడవ ఎక్కి వెళ్ళినవారు సరుకు తీసుకొస్తారా? క్షేమంగా తిరిగొస్తారా?... మత్స్యకార కుటుంబాలను నిత్యం వేధించే ప్రశ్నలివి. ఆ కష్టాలను, వేదనలను చూస్తూ పెరిగాను. సముద్రం నా జీవితంతో విడదీయలేని భాగం అయిపోయింది. నేను పుట్టింది, పెరిగింది తమిళనాడులోని పెరియతలై మత్స్యకారవాడలో. నా తల్లితండ్రులు పెద్దగా చదువుకోలేదు. కానీ నన్ను బాగా చదివించాలని మా నాన్న కుమార్ ఆశపడ్డారు. ఆయన కోరిక తీర్చడానికి కష్టపడి చదివాను. ఆంగ్ల సాహిత్యంలో పట్టభద్రురాలినయ్యాను. మా ఇంట్లో నేనే తొలి గ్రాడ్యుయేట్‌ను. ఒక ఫైనాన్స్ సంస్థలో, తరువాత ఒక ప్రైవేట్ బ్యాంకులో ఉద్యోగాలు చేశాను. ఆ సమయంలో ఎంతో ఒత్తిడిగా ఉండేది. ఇంటికి దూరంగా ఉండడం దానికి కారణం అనుకున్నాను. కానీ ఏదో వెలితి వెంటాడుతూ ఉండేది. ఇంతలో కొవిడ్ మహమ్మారి విజృంభించడంతో లాక్‌డౌన్ విధించారు. దాంతో నా కుటుంబం నివసిస్తున్న తూత్తుకుడికి తిరిగి వచ్చాను. నేను కోల్పోతున్నదేమిటో అప్పుడు నాకు అర్థమయింది.

పట్టు వదల్లేదు...

"మీతో నేనూ సముద్రంలో వేటకి వస్తా"నని మా నాన్నతో అన్నప్పుడు... అది పరిహాసానికని అనుకున్నారు. ఎందుకంటే అది పురుషులకే పరిమితమైన వృత్తి. మగవాళ్ళు సముద్రంలోకి వెళ్ళి మత్స్య సంపదతో తిరిగి వస్తే... మహిళలు వాటిని వేరు చేసి, విక్రయిస్తూ ఉంటారు. సాధారణంగా ఎక్కడైనా ఇదే జరుగుతుంది. వేటకి వెళ్ళే మహిళలు కొందరు ఉన్నారని విన్నాను, కానీ అది చాలా అరుదు. నేను పదేపదే అడగడంతో "పెరియతలై దగ్గర సముద్రం చాలా కల్లోలంగా ఉంటుంది. కెరటాలు చాలా బలంగా ఉంటాయి. పరిస్థితులు నిరంతరం సవాల్ విసురుతూ ఉంటాయి. నువ్వు మాతో వచ్చి ప్రమాదాల్లో పడడం నాకు ఇష్టం లేదు" చెప్పారు నాన్న. అయినా నేను మొండిపట్టు వదల్లేదు. చివరికి "సరే! ఒకసారి తీసుకువెళ్తాను. అంతా నీకే అర్థమవుతుంది" అన్నారు. ఇక... సముద్రంలో నా మొదటి అనుభవాన్ని 'అద్భుతం' అనే చెప్పాలి. అందరు మత్స్యకారుల్లాగానే మేము కూడా అర్థరాత్రి ఒంటి గంటకు ఫైబర్ పడవల్లో బయలుదేరాం. అవి అమావాస్య రోజులు. చాలా చీకటిగా ఉంది. ఆకాశంలో నక్షత్రాలు చెదిరిపోయిన వజ్రాల్లా మెరుస్తున్నాయి. ముందుకు వెళుతున్న కొద్దీ సముద్రం అందాన్ని చూసి నేను మైమరచిపోయాను. అదే సమయంలో చాలా ఎత్తుగా లేస్తున్న అలలు పడవను పైకి లేపి, మళ్ళీ కింద పడేస్తున్నప్పుడు... చాలా భయం వేసింది. మెల్లగా అలవాటు పడ్డాను. వలలు విసరడం, లాగడం, చేపల్ని పడవలో కుప్పలు పోయడం... ఇలా అన్ని పనులు ఉత్సాహంగా చేశాను. ఉదయం పది గంటలకు తిరిగి తీరాన్ని చేరుకున్నాం. ఆ తరువాత నాన్నకు నామీద నమ్మకం వచ్చింది. అప్పటినుంచి నేను కూడా వాళ్ళ బృందంలో భాగమైపోయాను.



అదే పెద్ద సమస్య...

సముద్రంలో వేటకు కేవలం శరీర దారుఢ్యం మాత్రమే కాదు, ధైర్యం కూడా కావాలి. రకరకాల చేపలను, రొయ్యలను పట్టుకోడానికి వివిధ రకాల వలలు ఉపయోగించాలి. సముద్రంలోకి వలలు విసిరేటప్పుడు, వాటిని సముద్రంలోకి లాగేటప్పుడు చాలా కచ్చితత్వంతో పని చెయ్యాలి. కల్లోలంగా ఉండే కెరటాల్లో, తుపాను వాతావరణంలో ప్రయాణించేటప్పుడు జాగ్రత్త, సమయస్ఫూర్తి అవసరం. సాధారణంగా మా బృందంలో నాన్న, నేను, నా తమ్ముడు లియాండర్, మరికొందరు సహాయకులు ఉంటాం.. సుమారు పన్నెండు నాటికల్ మైళ్ళ వరకూ మా ప్రయాణాలు సాగుతాయి. ఇంత చేసినా కొన్ని రోజులు ఖాళీ చేతుల్తో వెనక్కి రావలసి ఉంటుంది. ఇదివరకు మా నాన్న ఏదీ దొరక్క విచారంగా వెనక్కి రావడం చూసేదాన్ని. ఇప్పుడు అది నా అనుభవంలోకి వచ్చింది. మహిళగా నాకు ఎదురైన సమస్య.. పడవల్లో కనీస సదుపాయాలు ఉండకపోవడం. సముద్రం మధ్యలో టాయిలెట్‌కు వెళ్ళాల్సి వస్తే చాలా కష్టం. దాన్ని అధిగమించడం నేర్చుకున్నాను.

గర్వంగా ఉంది...

ఈ వృత్తి నాకు కొత్త ఆదాయ మార్గాలను కూడా చూపించింది. ఇప్పుడు నేను విజయవంతమైన సీఫుడ్ ఎంటర్‌ప్రెన్యూర్‌ని. చేపలతో, రొయ్యలతో ఏడు రకాల పచ్చళ్ళను తయారు చేస్తున్నాను. వాటిని స్థానికంగానే కాదు, ఇన్‌స్టాగ్రామ్ సాయంతో విక్రయిస్తున్నాను. విదేశాలకు వెళ్ళేవారు కూడా వాటిని కొంటున్నారు. దీనిద్వారా మరికొందరు మహిళలకు ఉపాధి కూడా కల్పిస్తున్నాను. అలాగే మత్స్యకారుల జీవితాన్ని, సముద్రం అందాలను ప్రజలకు చూపించడానికి 'సీ వోగ్లర్'గానూ మారాను. మా ప్రయాణాలను, ప్రజలకు సముద్ర ఉత్పత్తుల అందించడానికి మత్స్యకారులు చేసే సాహసాలను, చేపల వేటలో మెళకువలను వీడియోలు తీసి పోస్ట్ చేస్తున్నాను. నా యూట్యూబ్ ఛానెల్‌కు 2.5 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు 1.34 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. దక్షిణాదిలో 'ఏకైక మహిళా సీ వ్లోగర్' నేనే కావడం గర్వంగా ఉంది. మహిళలు కూడా ఈ వృత్తిలో రాణించగలరనడానికి నేనే ఉదాహరణ. ఒకప్పుడు నేను ఎదుర్కొన్న ఒత్తిడి ఇప్పుడు మాయమయింది. తరతరాల వారసత్వమైన ఈ వృత్తిని కొనసాగిస్తున్నందుకు సంతృప్తిగా ఉంది. ఒక విధంగా ఇది నా మూలాల్లోకి నేను చేస్తున్న ప్రయాణం. ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించడం, వీలైనన్ని ప్రాంతాలకు పర్యటించి, సముద్రపు వేటలో కొత్త నైపుణ్యాలు తెలుసుకోవడం... ప్రస్తుతానికి ఇవీ నా లక్ష్యాలు."

స్ఫూర్తి

చిన్న ప్రయత్నం... పెద్ద మార్పు

ఒక సర్పంచ్‌గా ఆమె చేసిన చిన్న ప్రయత్నం ఆ గ్రామ మహిళల ఆలోచనా విధానాన్నే మార్చేసింది. గృహిణి పేరుతో ఇంటి ముందు తగిలించిన నేమ్ ప్లేట్... వారి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచింది. మగవారికి మగువ ఎందులోనూ తీసిపోదని చెబుతూ... వారిని సాధికారత దిశగా అడుగులు వేయిస్తున్నారు శేషన్‌దీప్ కౌర్ సిద్ధూ. ప్రస్తుతం పదవిలో లేకపోయినా... తన ప్రాంత మహిళలకు మార్గదర్శి అయ్యారు ఈ మాజీ సర్పంచ్.

"తెల్లారి లేచింది మొదలు రాత్రి పడుకొనే వరకూ ఇంట్లో ఆడవారికి క్షణం తీరిక దొరకదు. కానీ వారి కష్టం ఎవరికీ పట్టదు. వారి ఆవేదన అరణ్యరోదన. కనీస గుర్తింపునకు నోచుకోని జీవితాలు గృహిణులవి. కాలంతో పోటీపడి పరుగెడుతున్నా... ప్రపంచం మన అరచేతులోకి వచ్చేసినా.. మా గ్రామంలో ఇంకా అసమానతలే. ఇది నన్ను కలచివేసింది. ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే ఎవరో ఒకరు తొలి అడుగు వేయాలి. నేను చేసింది అదే. సర్పంచ్‌గా నాకు వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకొని... గ్రామీణ మహిళల్లో చైతన్యం నింపే ప్రయత్నం చేశాను. పంజాబ్ బఠిండా జిల్లా మానక్‌ఖానా గ్రామం మాది. చిన్నప్పటి నుంచి నేను చదువులో ముందుండేదాన్ని. సివిల్స్ సాధించాలన్నది ఆశయం. దాని కోసం ఢిల్లీలో చదువుకొంటూ సన్నద్ధమయ్యాను.

గ్రామానికి తిరిగివచ్చి...

సివిల్స్ కోసం కఠోరంగా శ్రమించాను. 2018లో తొలిసారి పరీక్ష రాశాను. కానీ విఫలమయ్యాను. అది నన్ను బాగా కుంగదీసింది. అంత కష్టపడినా ర్యాంకు సాధించలేకపోవడంతో తిరిగి మా గ్రామానికి వచ్చేశాను. ఈసారి ఇంటి దగ్గరే ఉండి చదువుకొందామని నిర్ణయించుకున్నాను. కానీ మనం ఒకటి తలిస్తే దైవం మరోలా తలుస్తుందంటారు. నా విషయంలోనూ అదే జరిగింది. మా ఊళ్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకొని... నన్ను సర్పంచ్‌గా ఉండమని అడిగారు. పురుషాధిక్యం ఉన్న మా ప్రాంతంలో ఒక మహిళకు ఇలాంటి అవకాశం రావడం అరుదైన పరిణామం. గతంలో మా గ్రామంలో ఏ మహిళ కూడా ఈ పదవిని అలంకరించలేదు. దాంతో అడగంగానే సరేనన్నాను.

మార్పు వైపు తొలి అడుగు...

సర్పంచ్ అయ్యాను. బానే ఉంది. కానీ అసలు



సర్పంచ్‌గా నా విధులు, అధికారాలు ఏమిటన్న దానిపై స్పష్టత లేదు. ఎక్కడ మొదలు పెట్టాలి? ఎలా మొదలుపెట్టాలి? అంతా అయోమయం. కానీ మార్పు తేవడానికి నాకు లభించిన అద్భుత అవకాశం ఇది. దీన్ని వదులుకోకూడదని నిశ్చయించుకున్నాను. ఢిల్లీలో ఉండగా మహిళా సాధికారతకు సంబంధించి నేను కొన్ని స్వచ్ఛంద సంస్థలతో కలిసి పని చేశాను. ఆ అనుభవం నాకు ఇక్కడ పనికివచ్చింది. ఒకరిపై ఆధారపడకుండా స్వశక్తితో ఎదిగేందుకు కావల్సిన అంశాలపై దృష్టి పెట్టాను. అంతేకాదు, ఎప్పుడూ గుమ్మం దాటని ఆడవారి జీవితాల్లో వెలుగులు నింపి, వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టడమే ధ్యేయంగా పని చేయాలని అనుకున్నా. అందులో భాగంగా తొలుత తమ ఆశయాల సాధన దిశగా మహిళలను ప్రోత్సహించాను.

> **మహిళలకు ప్రత్యేకం...**
>
> మార్పు వైపు నేను వేసిన మలి అడుగు... మహిళలు, పిల్లల కోసం ప్రత్యేక పార్కు ఏర్పాటు. నిత్యం ఇంటి పనుల్లో తలమునకలయ్యే ఆడవారికి తమకంటూ కాస్త సమయం కూడా దొరకదు. సరదాగా కాసేపు సేద దీరేందుకు అవకాశం ఉండదు. దీన్ని దృష్టిలో పెట్టుకొని, తీరిక సమయంలో కాస్తంత ఆహ్లాదంగా గడిపేలా ఈ పార్కును తీర్చిదిద్దాము. ఇది స్థానిక మహిళల్లో గణనీయమైన మార్పునకు కారణమైంది. ఒక్కొక్కరుగా ఇంటి నుంచి బయటకు వచ్చి, స్వేచ్ఛగా కాసేపు పార్కులో గడుపుతున్నారు. స్నేహితులతో మనసు విప్పి మాట్లాడుకో గలుగుతున్నారు. అంతకముందు ఇక్కడ మహిళల కోసం ఎలాంటి ప్రత్యేక సదుపాయాలూ లేవు.

గ్రంథాలయంతో మొదలు...

ఆరంభంలో అందరూ నన్ను అవహేళన చేశారు. నీవల్ల ఏమవుతుందంటూ ప్రశ్నించారు. ఎవరు ఏమన్నా, ఎంత నిరుత్సాహపరిచినా... నా సామర్థ్యం ఏమిటో నాకు తెలుసు. సర్పంచ్‌గా నా తొలి ముద్ర గ్రంథాలయ నిర్మాణం. అధ్వాన్నంగా ఉన్న రోడ్ల పనుల వంటివి పక్కన పెట్టి ఎవరికీ ఉపయోగంలేని గ్రంథాలయం ఏంటని చాలా మంది ప్రశ్నించారు. నాకు పిచ్చి పట్టిందని కొందరు వ్యాఖ్యానించారు. అది ఒక భవనం మాత్రమే కాదు... గ్రామంలోని భవిష్యత్ తరాల ఆశలు, ఆశయాలకు ఒక చిహ్నమని చెప్పాను. పిల్లల ఎదుగుదలలో గ్రంథాలయాల పాత్ర ప్రముఖమైనదని వివరించాను. అందులో అన్ని వయసులవారికీ ఉపయోగపడేలా పంజాబీ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో విలువైన పుస్తకాలు పెట్టాము. భద్రత కోసం సీసీటీవీ కెమెరాలు అమర్చాం. క్రమంగా గ్రామస్తులందరూ గ్రంథాలయానికి వెళ్లడం అలవాటుగా మార్చుకున్నారు.

కన్నీళ్లు పెట్టుకున్నారు...

గ్రామ అభివృద్ధితో పాటు మహిళల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాను. ఆ క్రమంలోనే ఇంటి ముందు నేమ్ ప్లేట్లు నన్ను ఆకర్షించాయి. అవి చూసినప్పుడు అనిపించింది... 'వాటిపై మగవారి పేరు మాత్రమే ఎందుకు రాయాలి' అని! గృహిణుల పేరుతో నేమ్ ప్లేట్లు రాయించాను. ప్రతి ఇంటి ముందూ వాటిని తగిలించాము. అవి చూసుకొని మహిళలు భావోద్వేగానికి లోనయ్యారు. 'మా ఆత్మగౌరవాన్ని నిలబెట్టావంటూ' కృతజ్ఞతలు చెప్పారు. ఒక యువతి నా దగ్గరకు వచ్చి... 'ఇప్పటివరకు నన్ను బయటకు అడుగుపెట్టనివ్వలేదు. నా నిర్ణయాలు నేను తీసుకొనే స్వేచ్ఛ లేదు. కానీ ఇవాళ ఇంటి ముందు నా పేరు చూసినప్పుడు ఎంతో గర్వంగా అనిపించింది' అంటూ కన్నీళ్లు పెట్టుకుంది. ఇలా ఒక మహిళ పేరుతో డోర్ ప్లేటు కనిపించడం మా ఊళ్లో ఇదే మొదలు. ఈ ఏడాది సర్పంచ్‌గా నా పదవీకాలం అయిపోయింది. కానీ మహిళను సాధికారత వైపు నడిపించేందుకు, వారి జీవితాల్లో మార్పు తెచ్చేందుకు నా పయనం సాగుతూనే ఉంటుంది."

'సక్యులెంట్స్'తో సరికొత్తగా...

అందమైన ఆకులతో కనువిందు చేసే మొక్కలే 'సక్యులెంట్స్'. ఇవి ఎడారి మొక్కలు. దళసరి ఆకులతో సహజసిద్ధంగా ఉంటూ చూడడానికి పగడపు దిబ్బలు, ఆక్టోపస్ లాంటి సముద్ర జీవుల ఆకృతులను పోలి ఉంటాయి. చిన్న కుండీల్లో సైతం చక్కగా పెరుగుతాయి. సంరక్షణ కూడా పెద్దగా అవసరం ఉండదు. ప్రస్తుతం ఇంటి అలంకరణలో ప్రత్యేక స్థానం వీటిదే. కార్యాలయాల్లో కూడా విరివిగానే పెంచుతున్నారు. పలు సందర్భాల్లో ఈ మొక్కలను కానుకగా ఇచ్చి పుచ్చుకుంటున్నారు. ఇంట్లో అందంగా పెరిగే సక్యులెంట్స్ ఇవే...

జేడ్



దీనిని మోహిని మొక్క అని కూడా అంటారు. మందపాటి చిన్న ఆకులతో గుబురుగా పెరుగుతుంది. దీనికి నీరు ఎక్కువగా అవసరం లేదు. కుండీలోని మట్టి పూర్తిగా పొడిగా అయితేనే నీళ్లు పోయాలి. రోజుకి కనీసం నాలుగు గంటలు మొక్కకి ఎండ తగిలేలా చూసుకోవాలి. ఈ మొక్క ఇంటి లోపలి గాలిని శుభ్రం చేస్తుంది. కుండీని గదిలో ఆగ్నేయం మూలలో లేదా తూర్పు వైపున పెట్టుకుంటే అదృష్టం కలిసి వస్తుందనీ ఆర్థిక ప్రయోజనాలు సమకూరుతాయని వాస్తు నిపుణులు చెబుతున్నారు.

ఇకివేరియా



ఈ మొక్క చూడడానికి పెద్ద గులాబీ పువ్వులా ఉంటుంది. చక్కని రంగుల్లో ఆకర్షణీయంగా కనిపిస్తుంది. కొంచెం నీరు పోస్తే చాలు వేగంగా పెరుగుతుంది. ఎండిన ఆకులతో తయారు చేసే ఎరువు దీనికి సరిపోతుంది. వేడిని, చలిని తట్టుకుంటుంది.

సెడమ్

ఈ మొక్క గుబురుగా పైకి పెరుగుతుంది. దీని ఆకులు చిన్నగా



మందంగా ఉంటాయి. ఇది ఎండ తగలకపోయినా కూడా చక్కగా పెరుగుతుంది. చిన్న కుండీల్లో ఈ మొక్క అద్భుతంగా కనిపిస్తుంది.

బనానా స్ట్రింగ్

పేరుకు తగ్గట్టు ఈ మొక్క ఆకులు లావుగా పొడవుగా అరటిపండును గుర్తుకు తెస్తాయి. కొద్దిగా నీరు చిలకరిస్తే చాలు. తక్కువ వ్యవధిలోనే కుండీ మొత్తం వ్యాపిస్తాయి. వేలాడదీ



సిన కుండీల్లో ఈ మొక్క అందంగా పెరుగుతుంది.

పాండా



దీని ఆకులు వెడల్పుగా మందంగా ఉంటాయి. ఆకు మొత్తం ముదురు ఆకుపచ్చ రంగులో ఉన్నప్పటికీ అంచులు మాత్రం ఎర్రని రంగులో ఉంటాయి. చిన్న, పెద్ద ఆకులతో గుబురుగా పెరిగి ప్రత్యేకంగా కపిస్తుంది ఈ మొక్క. ఇంట్లో ఉండే కాంతి దీనికి సరిపోతుంది.

ఎలిఫెంట్ బుష్

ఇది జేడ్ మొక్కలాగే కనిపిస్తుంది కానీ ఆకులు అంత మందంగా ఉండవు. గుండ్రంగా ఉండే చిన్ని ఆకులతో కొమ్మ వేగంగా పెరుగుతూ నలు



వైపులా పచ్చదనాన్ని వ్యాపింపజేస్తుంది. ఇంటిని మొత్తం ఆక్సిజన్‌తో నింపేస్తుంది. ఇంట్లో ఉండే కాంతి, కొద్దిగా నీరు ఈ మొక్కకు సరిపోతాయి.

పెరల్స్ స్ట్రింగ్

దీని ఆకులు గుండ్రంగా ఉంటూ ఆకుపచ్చని ముత్యాల్లా కనిపిస్తాయి. ఈ మొక్క సన్నని తీగలా పెరుగుతుంది.



వేలాడే కుండీల్లో అందంగా కిందికి జాలువారుతూ చక్కని అనుభూతిని కలిగిస్తుంది. ఇంటి ముందు లేదంటే గేటుకి ఇరుపక్కలా కుండీలు అమర్చుకుంటే పరిసరాలు అహ్లాదకరంగా కనిపిస్తాయి.

బుర్రోస్ టైల్



ఈ మొక్క కాండం లావాటి తాడులా ఉంటుంది. ఈ కాండానికి మందమైన ఆకులు కప్పి ఉంటాయి. ఇది చూడడానికి ఆకుపచ్చని బెలూన్ల దండలా కనిపిస్తుంది. ఈ మొక్కకు కొద్దిగా ఎండ అవసరం. లివింగ్ రూమ్ లేదా స్టడీ రూమ్‌లో ఈ మొక్క కుండీని ఏర్పాటు చేసుకుంటే మనసు ఉత్సాహంగా ఉంటుంది.

సూర్య నమస్కారం చేద్దాం

సూర్యుడు నమస్కార ప్రియుడు. కేవలం అయిదు నిమిషాలు నమస్కరిస్తే చాలు శరీరం, మనసు ఉత్తేజితం అవుతాయని పెద్దలు చెబుతుంటారు. సూర్యుడు ఉదయించగానే తూర్పు దిక్కుకు అభిముఖంగా నిలబడి సూర్య నమస్కారం చేయాలి. అలాగే సాయంత్రం పూట పశ్చిమ దిక్కుకు నిలబడి సాధన చేయవచ్చు. యోగాలో సూర్య నమస్కారాన్ని పన్నెండు ఆసనాల ద్వారా చేస్తుంటారు. వీటిలో కనీసం మూడింటిని ప్రతిరోజూ సాధన చేస్తూ ఉంటే అనారోగ్యం దరిచేరదు. సూర్య నమస్కారంతో దినచర్య ప్రారంభించడం వల్ల కలిగే ప్రయోజనాలు తెలుసుకుందాం!

జీర్ణ వ్యవస్థకు

సూర్య నమస్కారంలో భాగంగా శరీరాన్ని ముందుకు వంచడం, సాగదీయడం వల్ల పొత్తికడుపుపై ఒత్తిడి పెరుగుతుంది. దీనితో కడుపులో పేరుకున్న వాయువులు బయటికి వెళ్లిపోతాయి. పేగుల్లో రక్త ప్రసరణ మెరుగవుతుంది. పొట్టలో వేడి ఉత్పత్తి కావడం వల్ల ఆహారపదార్థాలు తేలికగా జీర్ణమవుతాయి. అజీర్తి, కడుపు ఉబ్బరం, మలబద్ధకం లాంటి సమస్యలు రావు.

బరువు తగ్గేందుకు

ఏ భంగిమలో సూర్య నమస్కారం చేసినప్పటికీ శరీరంలో శక్తి ఖర్చయిపోతుంది. జీవక్రియలు వేగవంతమవుతాయి. దీనివల్ల శరీరంలో నిల్వ ఉన్న అదనపు కొవ్వులు పూర్తిగా కరిగిపోతాయి. ప్రతి రోజూ క్రమం తప్పకుండా కనీసం మూడు భంగిమల్లో సూర్య నమస్కారాలు చేయడం వల్ల శరీర బరువు నియంత్రణలో ఉంటుంది.



శిరోజాలకు

సూర్య నమస్కారాల్లో భాగంగా తల వంచడం, తిప్పడం, ఎత్తడం వంటివి చేస్తాం. దీనివల్ల తల మీద ఉన్న చర్మానికి వేగంగా రక్తప్రసరణ జరిగి వెంట్రుకల కుదుళ్లు గట్టిపడతాయి. దీంతో వెంట్రుకలు రాలడం, జుట్టు నెరవడం వంటి సమస్యలు తీరిపోతాయి. మంచి పోషణ అంది శిరోజాలు నల్లగా ఒత్తుగా పెరుగుతాయి.

చర్మానికి

సూర్యునికి ఎదురుగా నిలబడి సూర్య నమస్కారాలు చేస్తున్నపుడు చెమట ద్వారా చర్మంలోని వ్యర్థ పదార్థాలన్నీ బయటికి వచ్చేస్తాయి. దీంతో చర్మం తాజాగా ఆరోగ్యంగా కనిపిస్తుంది. ఉదయాన్నే సూర్య నమస్కారం చేస్తే చర్మానికి తగిన పోషణ అంది ముడతలు, గీతలు రావు. అంతగా తీవ్రతలేని సూర్యకిరణాల వేడివల్ల చర్మం మీద కొత్త కణాలు ఉత్పత్తి అయి మొటిమలు, మచ్చలు తగ్గిపోతాయి. సాయంత్రం సమయాల్లో సూర్య నమస్కారాలు చేయడం వల్ల శరీరం అలసిపోయి మంచి నిద్ర పడుతుంది. తగినంత విశ్రాంతి పొందడం వల్ల శరీరం, మనసు ఉత్సాహంగా ఉండి ముఖానికి కొత్త కాంతి వస్తుంది.

నెలసరి సమస్యలకు

మహిళలు ఉదయాన్నే సూర్య నమస్కారాలు చేయడం వల్ల లిపిడ్ ప్రొఫైల్ మెరుగుపడి నెలసరి సమస్యలు తగ్గుతాయి. నీరసం, బలహీనత, పొత్తికడుపు నొప్పి బాధించవు. ప్రతిరోజూ కనీసం పావుగంట శరీరానికి ఎండ తగిలేలా సూర్య నమస్కారాలు చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.

తెలగపిండి కూర

చలికాలంలో మనకు రోగనిరోధకశక్తి తక్కువగా ఉంటుంది. అందుకే తరచూ జబ్బుల బారిన పడుతుంటాం. ఇలాకాకుండా ఉండాలంటే బలవర్థకమైన ఆహారం తీసుకోవాలి. శీతాకాలంలో తినాల్సిన ఆహార పదార్థాల్లో నువ్వులు ప్రధానమైనవి. వీటిలో కాల్షియం, పీచుపదార్థాలు, ఇతర పోషకాలు నిండి ఉంటాయి. నువ్వులను గానుగలో వేసి తిప్పి నూనెను తీశాక మిగిలిన పిప్పినే తెలగపిండి అంటారు. ఇది కూడా మంచి పోషకాహారం. చలికాలంలో తెలగపిండి కూర తినడం శ్రేష్ఠమని పెద్దలు చెబుతుంటారు.

ఇలా చేయాలి...



స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి మూడు చెంచాల నూనె వేసి వేడి చేయాలి. అందులో ఆవాలు, జీలకర్ర, పచ్చి శనగపప్పులను ఒక్కోటి ఒక చెంచా చొప్పున వేసి వేగనివ్వాలి. తరవాత నాలుగు ఎండు మిరపకాయలు, రెండు రెమ్మల కరివేపాకు తుంచి వేయాలి. పెద్ద ఉల్లిపాయను సన్నగా తరిగి వేయాలి. రెండు వెల్లుల్లి రెబ్బలను పొడవుగా కోసి వేయాలి. అన్నీ బాగా కలిపి మూతపెట్టి మగ్గనివ్వాలి. తరవాత అర చెంచా పసుపు, రెండు చెంచాల కారం, ఒకటిన్నర చెంచా ఉప్పు వేసి కలిపి ఒక చిన్న గ్లాసు నీళ్లు పోసి మరగనివ్వాలి. ఈ నీళ్లలో ఒక చిన్న గ్లాసు తెలగపిండిని ఎడమ చేత్తో వేస్తూ కుడిచేత్తో పట్టుకున్న గరిటెతో వేగంగా తిప్పాలి. స్టవ్‌ని చిన్న మంటమీద ఉంచి పిండి ఉండలు కట్టకుండా దగ్గరకు వచ్చేదాకా గరిటెతో తిప్పుతూ ఉండాలి. నీళ్లన్నీ ఇంకిపోయి పిండి పొడిగా మారాక కొత్తిమీర తరుగు చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. ఇది వేడి అన్నంలోకి చాలా బాగుంటుంది.

ఎందుకు తినాలంటే...

తెలగపిండి కూర శరీరానికి బలాన్ని, పుష్టిని అందిస్తుంది. చలికాలంలో శరీరాన్ని వేడిగా ఉంచుతుంది. ఆస్తమా, జలుబు, దగ్గు, ముక్కు దిబ్బడ, శ్వాసకోశ వ్యాధుల నుంచి ఉపశమనాన్ని కలిగిస్తుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది. బాలింతలకు పాలు అధికంగా ఉత్పత్తి కావడానికి తోడ్పడుతుంది. శరీరానికి కావాల్సిన కాల్షియాన్ని అందించి ఎముకలు పెళుసుబారకుండా కాపాడుతుంది. చలికాలంలో రక్తనాళాలు కుంచించుకుపోయి రక్త ప్రవాహం అందక గుండెలో పలు సమస్యలు వస్తుంటాయి. తెలగపిండి కూర తినడం వల్ల వీటి నుంచి బయటపడవచ్చు.



తునికిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఉపరాష్ట్రపతితోపాటు గవర్నర్, మంత్రి కొండ సురేఖ తదితరులు

మా ఇంటికి భోజనానికి రండి

- **సేంద్రియ సాగు రైతులకు ఉపరాష్ట్రపతి ఆహ్వానం**
- **తునికి కృషి విజ్ఞాన సమ్మేళనంలో ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్**

నర్సాపూర్/కౌడిపల్లి, శంషాబాద్ రూరల్, హైదరాబాద్, నందిగామ, డిసెంబరు25(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో 655 మంది రైతులు సేంద్రియ సేద్యం చేపట్టి దేశంలోనే చరిత్ర సృష్టించారని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ చెప్పారు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తునికి సమీపంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో సేంద్రియ ఎరువులతో పంటలు పండించిన రైతులతో సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌తోపాటు ఉపరాష్ట్రపతి సతీమణి సుదేశ్ ధన్‌ఖడ్, గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, మంత్రి కొండా సురేఖ, ఎంపీ రఘునందన్‌రావు పాల్గొన్నారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో తునికి కేంద్రానికి చేరుకున్న ఉపరాష్ట్రపతి తొలుత మొక్క నాటి సేంద్రియ ఎరువులకు సంబంధించి ఏర్పాటు చేసిన స్టాల్స్‌తో పాటు పంటలను కూడా పరిశీలించారు. అనంతరం రైతులతో నిర్వహించిన సమ్మేళనంలో మాట్లాడుతూ తునికి గ్రామం చిన్నది కాదని, అందరికీ ఆదర్శమన్నారు. తునికి గ్రామ రైతులు సేంద్రియ సాగులో తక్కువ సమయంలో ఎక్కువ అభివృద్ధి, మార్పు సాధించారని కితాబునిచ్చారు. ఈ గ్రామ సేంద్రియ సాగు రైతులందరూ 3 రోజుల పాటు ఢిల్లీలో తన స్వగృహానికి అతిథులుగా రావాలని ధన్‌ఖడ్ ఆహ్వానించారు. త్వరలో కిసాన్ దివస్ రజతోత్సవం నిర్వహించబోతున్నామని, దేశంలోని 730 పైచిలుకు కృషి విజ్ఞాన కేంద్రాలు, 150 ఐకార్ సంస్థలు ఈ ఉత్సవాలలో పాల్గొనాలన్నారు. ప్రభుత్వ విద్యుత్ సబ్సిడీలపై ఆధారపడకుండా సోలార్ విద్యుత్ వినియోగించుకునే విధంగా రైతులను చైతన్యపర్చాలని అన్నారు. రైతులు ఆందోళనలో ఉన్నారని, వారితో చర్చించి వారి సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు.

కన్హాశాంతివనానికి ధన్‌ఖడ్

తునికి నుంచి ఉపరాష్ట్రపతి రంగారెడ్డి జిల్లా నందిగామ మండలపరిధిలోని కన్హాశాంతివనానికి చేరుకున్నారు. ఆ తర్వాత గురూజీ కమలేష్ పటేల్‌తో ధన్‌ఖడ్ సమావేశమయ్యారు. అనంతరం ధ్యానంలో నిమగ్నమయ్యారు. రాత్రికి కన్హాశాంతివనంలో బసచేసి గురువారం ఉదయం 11 గంటలకు ఢిల్లీకి తిరుగు ప్రయాణమవుతారని సమాచారం.

ఉప రాష్ట్రపతి దంపతులకు ఘన స్వాగతం

తెలంగాణ రాష్ట్రపర్యటనకు విచ్చేసిన ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కడ్ దంపతులకు శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో రాష్ట్రగవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, రాష్ట్రప్రభుత్వం తరపున పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఘనంగా స్వాగతం పలికారు. రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్, వద్దిరాజు రవిచంద్ర, సురేష్‌రెడ్డి తదితరులు కూడా స్వాగతం పలికారు. అనంతరం ఉపరాష్ట్రపతి దంపతులు హెలికాప్టర్‌లో మెదక్ జిల్లా తునికిలోని కృషి విజ్ఞాన కేంద్రానికి వెళ్లారు.

రూ.2 కోట్ల సాయం

(మొదటిపేజీ తరువాయి)

శ్వాస తీసుకోగలుగుతున్నాడని ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు తెలిపారు. అతని కుటుంబానికి అల్లు అర్జున్, నిర్మాతలు, దర్శకుడి తరఫున రూ.2 కోట్ల సాయం అందజేశామన్నారు. గురువారం సినీ పరిశ్రమకు చెందిన పెద్దలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తున్నామని చెప్పారు. ఈ మేరకు ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ ఇచ్చారని తెలిపారు. కాగా, ఉదయం 10 గంటలకు బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో నిర్వహించనున్న ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డితోపాటు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితోపాటు ఒకరిద్దరు ఇతర మంత్రులు, ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు, హోంశాఖ అధికారులు కూడా పాల్గొననున్నారు. సినీ పరిశ్రమ నుంచి నటుడు చిరంజీవితోపాటు నిర్మాతలు నాగవంశీ, అల్లు అరవింద్, సురేష్‌బాబు మరికొంత మంది నిర్మాతలు, దర్శకులు పాల్గొనే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ సమావేశంలో సినీ పరిశ్రమకు సంబంధించిన ప్రధాన సమస్యలపై చర్చించనున్నారు.

శ్రీతేజ్‌ను పరామర్శించిన జానీ మాస్టర్

హైదరాబాద్ సిటీ: కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను బుధవారం కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ పరామర్శించారు. శ్రీతేజ్‌ను చూడగానే త్వరగా కోలుకుంటున్నట్లు కనిపించాడని, ఇందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. శ్రీతేజ్ కుటుంబానికి తనవైపు నుంచి, సినిమా కొరియోగ్రాఫర్స్ అసోసియేషన్ తరఫున అండగా ఉంటామని చెప్పారు. తనపై ఉన్న కేసు గురించి ప్రస్తావించగా.. ప్రస్తుతం కేసు కోర్టు పరిధిలో ఉన్నందున ఆ విషయంపై తాను మాట్లాడలేనన్నారు.

తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు

- **సోషల్ మీడియాలో పోస్టులపై పోలీసుల హెచ్చరిక**
- **అల్లు అర్జున్ రాకముందే తొక్కిసలాట జరిగిందంటూ అపోహలకు గురిచేసేలా వీడియోలు**
- **ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం వ్యాప్తి: పోలీస్ శాఖ**

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించి సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ నగర పోలీసులు హెచ్చరించారు. సోషల్ మీడియా వేదికల్లో కొంతమంది ఈ ఘటనకు సంబంధించి పోలీసుల నిర్లక్ష్యం ఉందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ప్రజలను అపోహలకు గురిచేసేలా వీడియోలు, సమాచారం పోస్ట్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఘటన క్రమం, ప్రమాదం జరిగిన వివరాలు, సమయం తదితర విషయాలకు సంబంధించి సమగ్ర సమాచారంతో కూడిన వీడియోను రూపొందించి ప్రజల ముందుంచామని తెలిపారు. కేసును ఎంతో నిబద్ధతతో విచారణ జరుపుతున్నామని పేర్కొన్నారు. అయినా.. కొంతమంది పనిగట్టుకొని ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. పోలీస్ శాఖను అగౌరవపరిచేలా తప్పుడు ప్రచారం చేస్తే ఉపేక్షించబోమన్నారు. ఈ కేసుకు సంబంధించి ఎవరి వద్దనైనా ఆధారాలు, అదనపు సమాచారం ఉంటే పోలీస్ శాఖకు అందించాలని, అంతే తప్ప సొంత వాఖ్యానాలు చేయవద్దని అన్నారు. సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని కోరారు.

పిల్లలపై న్యుమోనియా పంజా

రాజధానిలో ఆస్పత్రులకు పెరిగిన తాకిడి.. నిలోఫర్ ఓపీకి రోజూ 15-20 కేసులు

- **ప్రైవేటు ఆస్పత్రులకు కూడా అదేసంఖ్యలో!**
- **అయిదేళ్లలోపు పిల్లల్లోనే ఎక్కువ ప్రభావం**
- **పిల్లలకు టీకాలు తప్పనిసరి: నిపుణులు**

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): చలి వాతారణం నేపథ్యంలో రాష్ట్రంలో న్యుమోనియా కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా రాజధాని హైదరాబాద్‌లోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు న్యుమోనియా బాధితుల తాకిడి పెరిగింది. బాధితుల్లో ఐదేళ్లలోపు చిన్నారులు ఎక్కువగా ఉంటున్నారని.. శ్వాస తీసుకోవడానికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నవారిని ఆస్పత్రిలో చేర్చుకుని చికిత్స చేస్తున్నామని వైద్యులు వివరించారు. గణాంకాలు చూస్తే.. నిలోఫర్ ఆస్పత్రిలో కొద్దిరోజులుగా నిత్యం 15-20 మంది ఓపీలో చికిత్స పొందుతుండగా, ఇరవై మంది వరకూ ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యి చికిత్స పొందుతున్నారు. న్యుమోనియా వచ్చిన వారిలో 59 శాతం మంది మాత్రమే ఆస్పత్రికి వస్తున్నారని, మిగతావారు వైద్యులను సంప్రదించకుండా, నిర్లక్ష్యం చేసి ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు నిద్రలో ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్నా, తీవ్ర జ్వరం, జలుబుతో బాధపడుతున్నా.. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచిస్తున్నారు. హెచ్‌ఐవీ, మీజిల్స్, మలేరియా మరణాల కంటే న్యుమోనియాతో చనిపోయే వారే ఎక్కువగా ఉంటున్న నేపథ్యంలో.. అప్రమత్తంగా ఉండాలని వారు హెచ్చరిస్తున్నారు.

జరభద్రం..

చలికాలం వైరస్ వ్యాప్తికి అనుకూలం కావడంతో.. న్యుమోనియా కేసుల సంఖ్య పెరుగుతుంది. రోగ నిరోధకశక్తి తక్కువగా ఉండే పిల్లలకు ఇది ప్రమాదకరం. చల్లటి ఆహార పదార్థాలు తినేవారు, శీతలపానీయాలు తాగేవారు న్యుమోనియాతో ఇబ్బంది పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని.. ఈ కాలంలో పిల్లలకు తాజా ఆహారం ఇవ్వాలని, వాతావరణం చల్లగా ఉన్నప్పుడు వెచ్చటి దుస్తులు వేయాలని.. త్వరగా జీర్ణమయ్యే పౌష్టికాహారం ఎక్కువగా ఇవ్వాలని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే.. రక్తహీనత, హెచ్‌ఐవీ, మధుమేహం, ఆస్తమా, గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాల వ్యాధులతో బాధపడేవారిలో న్యుమోనియా తీవ్రత ఎక్కువగా ఉండే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరించారు. రోగ నిరోధకశక్తి తక్కువగా ఉండే మహిళలు, అరవై ఏళ్లు పైబడిన వారు కూడా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

ఈ లక్షణాలుంటే జాగ్రత్త

విడవకుండా పొడి దగ్గు, తీవ్రమైన జ్వరం, శ్వాస తీసుకోవడం కష్టం కావడం, కఫం, దగ్గినప్పుడు రక్తం పడడం, ఛాతీనొప్పి, అలసట, నిద్రలో పిల్లి కూతలు పెట్టడం, ఆహారం తీసుకోవడానికి ఇష్టపడకపోవడం, మైకం వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. ఈ లక్షణాలు కనిపిస్తే అజాగ్రత్త చేయకూడదని వైద్యులు సూచిస్తున్నారు. క్రమం తప్పకుండా తల్లిపాలు 6 నెలల పాటు తాగిన పిల్లలకు న్యుమోనియా వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయని వైద్యులు వివరించారు. తక్కువ బరువుతో పుట్టే పిల్లలు, పౌష్టికాహార లోపం ఉండే నవజాత శిశువులకు న్యుమోనియా వచ్చే ప్రమాదం ఎక్కువని.. గర్భిణులకు పౌష్టికాహారం ఇవ్వడం ద్వారా ఈ ముప్పును నివారించవచ్చని వారు పేర్కొన్నారు. ధూమపానం చేసే వారికి పుట్టే పిల్లలకు కూడా న్యుమోనియా ముప్పు అధికమని.. కోరింత దగ్గు, మీజిల్స్ వంటి వాటికి టీకాలు సరిగ్గా వేసుకోకపోవడం వల్ల కూడా న్యుమోనియా బారిన పడుతున్నారని చెప్పారు.

ఎనిమిదేళ్ల వరకు ఫ్లూ వ్యాక్సిన్ తప్పనిసరి



మా వద్దకు వస్తున్న న్యుమోనియా బాధితుల్లో ఐదేళ్లలోపు పిల్లలే ఎక్కువగా ఉంటున్నారు. తీవ్ర లక్షణాలతో వచ్చినవారిని వెంటనే చేర్చుకుని చికిత్స చేస్తున్నాం. కొన్నికేసుల్లో వెంటిలేటర్ ద్వారా చికిత్స అందించాల్సి వస్తోంది. ఎనిమిదేళ్ల వరకు పిల్లలకు ఫ్లూ వ్యాక్సిన్, న్యుమోకోకల్ ఇవ్వాలి. దీనివల్ల పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఫ్లూ ఉన్న సమయంలో పిల్లలకు ద్రవ పదార్థాలు ఎక్కువగా ఇవ్వాలి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, తీవ్ర జ్వరం, జలుబు ఉంటే ఆస్పత్రికి తీసుకురావాలి. ఇంట్లో ఎవరికైనా దగ్గు, జలుబు, శ్వాస కోశ ఇబ్బందులు ఉంటే వారు పిల్లలకు దూరంగా ఉండాలి. అస్వస్థతగా ఉన్న పెద్దలు ఇంట్లో మాస్కులు ధరించి ఉండాలి. పిల్లలకు ఆహారం ఇచ్చే సమయంలో తల్లిదండ్రులు పరిశుభ్రత పాటించాలి, చేతులు శుభ్రంగా కడుకోవాలి. పిల్లలను ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలి. చలిలో ఎక్కువ సేపు పిల్లలను ఉంచొద్దు. చన్నీటి స్నానం అసలే చేయించవద్దు.

- డాక్టర్ నవిత, నవజాత శిశు, పిల్లల వైద్యురాలు, మెడికవర్ ఉమెన్ అండ్ చైల్డ్ ఆస్పత్రి

రాజకీయాలు వద్దు.. సామరస్యంగా పరిష్కరించుకోవాలి

అర్జున్ వివాదంపై అనురాగ్ ఠాకూర్

హైదరాబాద్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సినీ పరిశ్రమతో ఏవైనా సమస్యలు ఎదురైతే రాజకీయాలు చేయకుండా సామరస్యంగా పరిష్కరించుకోవాలని కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్ చెప్పారు. ఆర్ఆర్ఆర్, పుష్ప, కేజీఎఫ్ వంటి చిత్రాలు భారతీయ సినీ పరిశ్రమను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాయి. అల్లు అర్జున్ జాతీయ ఉత్తమ నటుడి అవార్డును, చిరంజీవి జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకున్నారని గుర్తుచేశారు. సినీ పరిశ్రమతో ఏవైనా సమస్యలు వస్తే రాజకీయాలు చేయవద్దని హితవు పలికారు. అల్లు అర్జున్ విషయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నేతలు ఇష్టానుసారంగా మాట్లాడారు. వారిపై ఆ పార్టీకి నియంత్రణ లేదా? అని ప్రశ్నించారు.

జానీ మాస్టర్ లైంగిక వేధింపులు నిజమే

చార్జిషీట్ దాఖలు చేసిన నార్సింగ్ పోలీసులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సినీ నృత్య దర్శకుడు జానీ మాస్టర్ కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. అతను తన వద్ద పనిచేసిన సహాయ నృత్య దర్శకురాలిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు చార్జిషీట్ దాఖలు చేశారు. జానీ మాస్టర్ ఆమెను ఈవెంట్ల పేరుతో పలు ప్రాంతాలకు తీసుకువెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని దర్యాప్తులో గుర్తించిన పోలీసులు ఇదే విషయాన్ని చార్జిషీట్‌లో పేర్కొన్నారు. బాధిత యువతి సెప్టెంబరు 15న పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈవెంట్ పేరుతో ముంబైకి తీసుకెళ్లిన జానీ మాస్టర్ హోటల్ రూములో తనపై లైంగిక దాడి చేశాడని, షూటింగ్ సమయంలో పలుమార్లు లైంగికంగా వేధించాడని ఫిర్యాదులో పేర్కొంది. దీంతో నార్సింగ్ పోలీసులు జానీ మాస్టర్‌ను అరెస్ట్ చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు. కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో అక్టోబరు 25న విడుదలయ్యాడు.



మలయాళ రచయిత వాసుదేవన్ నాయర్ కన్నుమూత



ప్రముఖ మలయాళ రచయిత, సినీ దర్శకుడు ఎంటీ వాసుదేవన్ నాయర్ (91) బుధవారం రాత్రి కొళిక్కోడ్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో గుండెపోటుతో కన్నుమూశారు. వయోభారం వల్ల వచ్చిన అనారోగ్య సమస్యలతో ఆయన కొంతకాలంగా చికిత్స పొందుతున్నారు. పాలక్కాడ్ సమీపంలోని కడలూరు ఆయన సొంతూరు. వాసుదేవన్ నాయర్‌కు బాల్యం నుంచే మలయాళ సాహిత్యంపై ఆసక్తి కలిగింది. ఆయన కలం నుంచి జాలువారిన బాల సాహిత్యం, కథలు, పర్యాటక రచనలు, వ్యాసాలు, నవలలు మలయాళ సాహిత్యంలో ప్రత్యేక స్థానం పొందాయి. 'నాలుకెట్టు, అసురవిత్తు, మంజు, సర్పవిత్తు' తదితర రచనలు విశేష పాఠకాదరణ పొందాయి. కొంతకాలం ఉపాధ్యాయుడిగా పనిచేసిన తర్వాత మలయాళ సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టిన వాసుదేవన్ 54 చిత్రాలకు స్క్రీన్‌ప్లే అందించారు. ఏడు సినిమాలకు దర్శకత్వం వహించారు. ఆయన దర్శకత్వం వహించిన 'నిర్మాల్యం', 'కడవు' సినిమాలకు ఉత్తమ చిత్రం విభాగంలో జాతీయ చలనచిత్ర పురస్కారాలు దక్కాయి. ఇప్పటివరకూ ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయితగా నాలుగుసార్లు జాతీయ అవార్డు అందుకున్న అరుదైన ఘనతను ఆయన సొంతం చేసుకున్నారు. వాసుదేవన్ రాసిన తొమ్మిది కథల ఆధారంగా తెరకెక్కిన 'మనోరథంగల్' వెబ్‌సిరీస్ ఈ ఏడాది ప్రముఖ ఓటీటీలో విడుదలై ప్రేక్షకాదరణ పొందింది. ఆయన పైన గౌరవంతో ఈ సిరీస్‌కు కమల్‌హాసన్ సమర్పకుడిగా వ్యవహరించగా, మోహన్‌లాల్, మమ్ముట్టి, ఫహద్ ఫాజిల్ లాంటి పలువురు అగ్రతారలు నటించారు. 1996లో జ్ఞాన్‌పీఠ్, 2005లో పద్మభూషణ్, 2013లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలను ఆయన అందుకున్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ కార్య నిర్వహక సభ్యుడుగా, కేరళ సాహిత్య అకాడమీ అధ్యక్షుడిగా, ఇండియన్ పనోరమ చైర్మన్‌గా ఆయన సేవలందించారు. కొంతకాలం మాతృభూమి వారపత్రికకు సంపాదకుడిగానూ ఆయన విధులు నిర్వర్తించారు. వాసుదేవన్ నాయర్ మృతి పట్ల కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్ సహా పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం ప్రకటించారు.

చిత్రజ్యోతి SINCE 1965

హిట్ అవుతుందని ప్రభాస్ చెప్పారు

హీరో ధర్మ



ధర్మ, ఐశ్వర్య శర్మ జంటగా నటించిన యూత్‌ఫుల్ ఎంటర్టైనర్ 'డ్రింకర్ సాయి'. 'బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్' అనేది ఉపశీర్షిక. కిరణ్ తిరుమలశెట్టి దర్శకత్వంలో బసవరాజు లహరిధర్, బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్ సంయుక్తంగా నిర్మించారు. ఈ నెల 27న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. ఈ కార్యక్రమంలో దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి మాట్లాడుతూ "ఈ సినిమా కచ్చితంగా మీ అందర్నీ కదిలిస్తుంది. ధర్మకు ఉత్తమ పరిచయ నటుడిగా అవార్డు రావడం పక్కా. కథను నమ్మి నిజాయితీగా చేసిన ప్రయత్నం ఈ సినిమా. చివరి 40 నిమిషాలు సినిమాకు ప్రధానాకర్షణ" అని చెప్పారు. "ఈ సినిమాను నిర్మించే విషయంలో నిర్మాతలు ఎక్కడా రాజీ పడలేదు. నా అభిమాన హీరో ప్రభాస్‌ను కలసినప్పుడు ఈ సినిమాకు ఆల్ ద బెస్ట్ చెప్పారు. "సినిమా బాగా వచ్చింది. టీజర్, ట్రైలర్ చూసిన ప్రతీ ఒక్కరూ కంటెంట్ బాగుందని మెచ్చుకుంటున్నారు" అని తెలిపారు.





కుటుంబ షేరు పైపైకి

వారి పొదుపులో ఈక్విటీల వాటా 31 శాతానికి..

- వచ్చే 8-10 ఏళ్లు ఇదే ట్రెండ్ కొనసాగే చాన్స్
- ఎమ్‌కే గ్లోబల్ ఫైనాన్షియల్ నివేదిక వెల్లడి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారతీయ కుటుంబాలు దీర్ఘకాలిక పొదుపు కోసం ఈక్విటీలపై ఆధార పడే ట్రెండ్ ఏటేటా పెరుగుతూ వస్తోందని బ్రోకరేజీ సంస్థ ఎమ్‌కే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీస్ లిమిటెడ్ వెల్లడించింది. దేశీయ కుటుంబాల పొదుపులో ఈక్విటీల వాటా 2016 ఆర్థిక సంవత్సరంలో 17 శాతంగా ఉండగా.. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లో సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికం నాటికి దాదాపు 31 శాతానికి చేరుకుందని నివేదికలో వెల్లడించింది. అంటే, 8 ఏళ్లకు పైగా కాలంలో ఈక్విటీ వాటా దాదాపు రెట్టింపైంది. ఈక్విటీల్లో వీరి పెట్టుబడుల పెరుగుదల ట్రెండ్ వచ్చే 8-10 ఏళ్లపాటు కొనసాగవచ్చని అంచనా వేసింది. బ్యాంక్ డిపాజిట్లపై వడ్డీ ఆదాయం తగ్గడం, సామాజిక భద్రత పథకాల లేమితో పాటు డిజిటల్ పెట్టుబడి వేదికలు అందుబాటులోకి రావడంతో కుటుంబాలు సంప్రదాయ పొదుపు సాధనాలైన ఫిక్స్‌డ్ డిపాజిట్లు, జీవిత బీమా పథకాల నుంచి ఈక్విటీల్లో పెట్టుబడుల వైపు దృష్టి మళ్లిస్తున్నారని నివేదికలో పేర్కొంది. గడిచిన కొన్నేళ్లలో భారత స్టాక్ మార్కెట్ల బలమైన పనితీరు కూడా కుటుంబాలను ఆకర్షిస్తోందని అంటోంది. దాంతో కుటుంబాలు ఈక్విటీల్లో నేరుగా లేదా మ్యూచువల్ ఫండ్ల ద్వారా పెట్టుబడులు పెడుతున్నారు. నివేదికలోని మరిన్ని విషయాలు..

- 2016-24 ఆర్థిక సంవత్సరాల మధ్య కాలంలో దేశీయ ఈక్విటీల్లో పెట్టుబడులు ఏటేటా 22 శాతం చొప్పున వృద్ధి చెందాయి. మన ఈక్విటీల్లో దేశీ ఇన్వెస్టర్ల వాటా క్రమంగా పెరుగుతుండటంతో విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల (ఎఫ్‌పీఐ)పై ఆధారం తగ్గుతోంది. దాంతో ఎఫ్‌పీఐలు భారీగా అమ్మకాలకు పాల్పడినప్పటికీ మన మార్కెట్ తట్టుకోగలుగుతోంది.
- 2019 మార్చి నుంచి బీఎస్ఈ 500 సూచీ కంపెనీల షేర్లలో ఎఫ్‌పీఐ వాటా 2.7 శాతం మేర తగ్గింది. మన మ్యూచువల్ ఫండ్లు సహా దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్ల వాటా 4 శాతం పెరిగింది.
- 2016-24 ఆర్థిక సంవత్సరాల మధ్యకాలంలో డీమ్యాట్ ఖాతాలు 39 శాతం సమ్మిళిత వార్షిక వృద్ధి రేటు (సీఏజీఆర్)ను నమోదు చేయగా.. మ్యూచువల్ ఫండ్ పెట్టుబడుల ఖాతాల సీఏజీఆర్ 19 శాతంగా ఉంది. ఇదే కాలంలో ఒక్కో డీమ్యాట్ ఖాతాలోని ఈక్విటీ షేర్ల రిటైల్ హోల్డింగ్ తగ్గింది. మార్కెట్లో కేంద్రీకృత ఈక్విటీ ఆస్తులు తగ్గుముఖం పడుతుందనడానికి ఇదే సంకేతం.
- మార్కెట్ పరిధి విస్తృతమవుతోంది. ప్రస్తుతం వ్యక్తిగత ఈక్విటీ పెట్టుబడుల్లో 27 శాతం ద్వితీయ, తృతీయ శ్రేణి నగరవాసులకు చెందినవే.
- మ్యూచువల్ ఫండ్లు స్మాల్, మిడ్‌క్యాప్ స్టాక్స్‌లో పెట్టుబడులకు మొగ్గుచూపుతుండగా.. ఎఫ్‌పీఐలు మాత్రం అధికంగా లార్జ్‌క్యాప్స్‌కే కట్టుబడి ఉంటున్నాయి.
- భవిష్యత్‌లో కుటుంబ పొదుపులో ఈక్విటీ వాటాయే కీలకం కానున్నప్పటికీ, రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్స్), ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఇన్విట్స్)ల్లోకీ వీరి పెట్టుబడులు పెరగనున్నాయి.

ఐపీఓకి ఇండిక్యూబ్ స్పేసెస్

రూ.850 కోట్ల సమీకరణ లక్ష్యం

న్యూఢిల్లీ: వర్క్‌ప్లేస్ సొల్యూషన్స్ సంస్థ ఇండిక్యూబ్ స్పేసెస్ లిమిటెడ్.. పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి వస్తోంది. ఈ మేరకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి ముసాయిదా పత్రాలు సమర్పించింది. బెంగళూరు కేంద్రంగా ఉన్న ఈ కంపెనీ కొత్త ఈక్విటీ షేర్ల జారీతో రూ.750 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా మరో రూ.100 కోట్లను సమీకరించనుంది. ఓఎఫ్ఎస్ ద్వారా ప్రమోటర్లు రిషి దాస్, మేఘనా అగర్వాల్ రూ.100 కోట్లకు సమానమైన వాటాలను విక్రయించనున్నారు. ఐపీఓ ద్వారా సమీకరించనున్న మొత్తాల్లో రూ.462.60 కోట్లను కొత్త సెంటర్ల ఏర్పాటుతో పాటు మూలధన వ్యయాల కోసం ఉపయోగించనుంది. మరో రూ.100 కోట్లను రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాల కోసం వినియోగించనుంది. 2015లో కార్యకలాపాలు ప్రారంభించిన ఇండిక్యూబ్ దేశవ్యాప్తంగా 13 నగరాల్లో 103 సెంటర్లను నిర్వహిస్తోంది.

2025లో జోరుగా విదేశీ పెట్టుబడులు!

2024లో ఫారిన్ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు భారీగా వెనక్కి

కొత్త ఏడాదిలో మళ్లీ పుంజుకోవచ్చంటున్న మార్కెట్ విశ్లేషకులు



గత సంవత్సరం భారత స్టాక్ మార్కెట్లో జోరుగా పెట్టుబడులు పెట్టిన విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ).. 2024లో తమ ఇన్వెస్ట్‌మెంట్లను భారీగా వెనక్కి తీసుకున్నారు. దాంతో ఈ ఏడాది మొత్తానికి ఎఫ్‌పీఐల నికర పెట్టుబడులు రూ.5,000 కోట్ల స్థాయికి పరిమితం కానున్నాయి. దేశీయ స్టాక్ మార్కెట్లో అధిక వాల్యుయేషన్లు, అంతర్జాతీయ భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు, సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసిక ఆర్థిక ఫలితాల సీజన్ నిరాశపర్చడం, అమెరికాలో వడ్డీ రేట్ల తగ్గుదల కారణంగా అక్కడి బాండ్ల రేటు పెరగడం వంటి అంశాలు విదేశీ పెట్టుబడుల ఉపసంహరణకు ప్రధాన కారణమయ్యాయి. కొత్త సంవత్సరం (2025)లో ఈ పెట్టుబడుల ప్రవాహం మళ్లీ పుంజుకోవచ్చని స్టాక్ మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. మెరుగుపడనున్న కార్పొరేట్ కంపెనీల పనితీరు ఇందుకు దోహదపడనుందని వెంచురా సెక్యూరిటీస్ రీసెర్చ్ విభాగ అధిపతి వినీత్ బోలింజ్‌కర్ అన్నారు.

అయితే, మన మార్కెట్లో చాలా కంపెనీల షేర్లు ఇప్పటికీ అధిక ధరల వద్ద ట్రేడవుతుండటంతో పాటు ఆసియాన్, లాటిన్ అమెరికా మార్కెట్లలో షేర్లు ఆకర్షణీయ ధరలకు లభిస్తుండటం, ప్రపంచ ఆర్థిక మాంద్యం ముప్పు, అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ సహా అభివృద్ధి చెందిన దేశాల సెంట్రల్ బ్యాంకుల వడ్డీ రేట్ల తగ్గింపు, ట్రంప్ సుంకాల వడ్డన వంటి పరిణామాలు మన మార్కెట్లోకి విదేశీ పెట్టుబడుల ప్రవాహాన్ని పరిమితం చేసే ప్రమాదమూ లేకపోలేదన్నారు. డిపాజిటరీల వద్ద అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం.. ఈ నెల 24 నాటికి మన ఈక్విటీల్లో ఎఫ్‌పీఐల నికర పెట్టుబడులు రూ.5,052 కోట్లుగా నమోదయ్యాయి. డెట్ మార్కెట్లో మాత్రం రూ.1.12 లక్షల కోట్లు పెట్టుబడిగా పెట్టారు. కాగా, 2023లో ఎఫ్‌పీఐలు మన ఈక్విటీల్లో నికరంగా రూ.1.71 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేశారు. అంతక్రితం సంవత్సరం (2022)లో రూ.1.21 లక్షల కోట్లు వెనక్కి తీసుకున్నారు. 2019 నుంచి 2021 వరకు వరుసగా పెట్టుబడులు పెంచుకుంటూ వచ్చారు. ఈ ఏడాది విషయానికొస్తే, జనవరి, ఏప్రిల్, మే, అక్టోబరు, నవంబరుల్లో పెట్టుబడులను భారీగా వెనక్కి తీసుకున్నారు. కేవలం అక్టోబరు, నవంబరులో మొత్తం రూ.1.16 లక్షల కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు.

కొనసాగనున్న ఎఫ్‌డీఐల జోష్

అంతర్జాతీయ అనిశ్చితులు, సవాళ్ల నేపథ్యంలోనూ ఈ ఏడాది భారత్‌లోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) భారీగానే వచ్చాయి. ఈ జనవరి నుంచి నమోదైన నెలవారీ ఎఫ్‌డీఐల సగటు 450 కోట్ల డాలర్ల పైమాటే. 2025లోనూ ఎఫ్‌డీఐల జోష్ కొనసాగనుందని.. మోదీ సర్కారు వ్యాపార, పెట్టుబడి సానుకూల విధానాలతో పాటు భారత్‌లో పెట్టుబడులపై ఆకర్షణీయ రిటర్నులు లభిస్తుండటం, చౌకగా నిపుణులు లభిస్తుండటం, సులభతర నియమావళి, అనుమతులకు సింగిల్ విండో సిస్టమ్, ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహకాల (పీఎల్ఐ) పథకాలు ఇందుకు దోహదపడనున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ జనవరి-సెప్టెంబరు కాలంలో దేశంలోకి వచ్చిన మొత్తం ఎఫ్‌డీఐలు 4,213 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. 2023లో ఇదే కాలానికి వచ్చిన 2,973 కోట్ల డాలర్లతో పోలిస్తే ఈ ఏడాది పెట్టుబడులు 42 శాతం పెరిగాయి.

గడిచిన 10 ఆర్థిక సంవత్సరాల్లో (2014-2024) దేశంలో వచ్చిన ఎఫ్‌డీఐలు అంతక్రితం పదేళ్లతో పోలిస్తే 67 శాతం వృద్ధి చెంది 99,100 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. కాగా, 2004-2014 మధ్యకాలంలో దేశీయ తయారీ రంగంలోకి వచ్చిన ఈక్విటీ ఎఫ్‌డీఐలు 9,800 కోట్ల డాలర్లుగా నమోదు కాగా.. 2014-2024 కాలానికి 69 శాతం వృద్ధితో 16,500 కోట్ల డాలర్లకు పెరిగాయి. ఈ శతాబ్దంలో ఇప్పటివరకు (2000-24) వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు లక్ష కోట్ల డాలర్ల మైలురాయిని దాటాయి.

ఓలా ఎలక్ట్రిక్ @ 4,000 స్టోర్లు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా నెట్‌వర్క్‌ను 4,000 స్టోర్లకు విస్తరించినట్లు ఓలా ఎలక్ట్రిక్ ప్రకటించింది. ప్రస్తుతమున్న నెట్‌వర్క్‌తో పోల్చితే ఇది నాలుగింతలు ఎక్కువని పేర్కొంది. సర్వీస్ సదుపాయలతో దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో కొత్తగా 3,200 కో-లొకేటెడ్ స్టోర్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. మెట్రో నగరాలతో పాటు ప్రథమ, ద్వితీయ శ్రేణి నగరాలతో పాటు చిన్న పట్టణాలు, మండల స్థాయిల్లో ఈ స్టోర్లను నెలకొల్పినట్లు ఓలా ఎలక్ట్రిక్ తెలిపింది. వాహన కొనుగోలు, సర్వీస్ సహా పలు అంశాల్లో వినియోగదారులకు మెరుగైన సేవలందించాలనే ఉద్దేశంతో వీటిని ఏర్పాటు చేసినట్లు పేర్కొంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,450 ▲	71,000 ▲	99,900 ▲
విజయవాడ	78,500 ▼	72,300 ▼	91,000 ▼
విశాఖపట్నం	76,400 ▲	70,030 ▲	89,340 ▲
రాజమండ్రి	77,450 ▲	71,000 ▲	90,300 ▲
ప్రొద్దుటూరు	78,350 ▲	72,550 ▲	90,300 ▲
ముంబై	75,874 ▼	69,501 ▼	87,511 ▲

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	103	విజయవాడ	106
వరంగల్	103	గుంటూరు	109
కరీంనగర్	103	ఒంగోలు	109
మహబూబ్‌నగర్	103	చిత్తూరు	96
కర్నూలు	103	నెల్లూరు	96
విశాఖపట్నం	104	అనంతపురం	96
గోదావరి	106		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

26వ తేదీ			
హైదరాబాద్	585	విజయవాడ	600
వరంగల్	587	గోదావరి	600
చిత్తూరు	603	విశాఖపట్నం	600
		డజను గుడ్లు రూ. 84	

యూపీఐ లావాదేవీల్లో 33 శాతం వృద్ధి

పేనియర్‌బై వెల్లడి

న్యూఢిల్లీ: ఈ ఏడాది సెమీ-అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లోని చిల్లర విక్రయ కేంద్రాల వద్ద యూపీఐ ద్వారా చెల్లింపులు వార్షిక ప్రాతిపదికన 33 శాతం వృద్ధి చెందాయని డిజిటల్ నెట్‌వర్క్ ప్లాట్‌ఫామ్ పేనియర్‌బై తాజా రిపోర్టు వెల్లడించింది. దేశంలో డిజిటల్ చెల్లింపుల సాధనాల వినియోగం శరవేగంగా పెరుగుతోందనడానికిదే నిదర్శనమని నివేదికలో పేర్కొంది. అంతేకాదు, బీమా పాలసీల కొనుగోలు, ప్రీమియం చెల్లింపుల లావాదేవీల సంఖ్య 127 శాతం పెరిగిందని, కొత్త కస్టమర్లు 96 శాతం పెరిగారని తెలిపింది. గ్రామీణ, సెమీ-అర్బన్ ప్రాంతాల్లోని 10 లక్షల రిటైల్ కేంద్రాల వద్ద ఈ ఏడాది జనవరి-నవంబరులో జరిగిన లావాదేవీల అధ్యయనం ఆధారంగా ఈ నివేదికను రూపొందించినట్లు పేనియర్‌బై వెల్లడించింది. వ్యాపార రుణాలు, బంగారం తాకట్టు రుణాలు వంటి రుణాలు ఈ ఏడాదిలో 297 శాతం పెరిగాయని తెలిపింది.

ఎన్ఎస్‌డీసీ ఇంటర్నేషనల్‌తో ఫిజిక్స్‌వాలా జట్టు

న్యూఢిల్లీ: నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇంటర్నేషనల్ (ఎన్ఎస్‌డీసీ ఇంటర్నేషనల్)తో భారతీయ ఎడ్‌టెక్ కంపెనీ ఫిజిక్స్‌వాలా (పీడబ్ల్యూ) జట్టు కట్టింది. ఇందులో భాగంగా ఇరు సంస్థలు సంయుక్తంగా భారత్ ఇన్నోవేషన్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ (బీఐజీ)ను ప్రారంభించింది. భారత్‌ను అంతర్జాతీయ ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చేందుకు రెండు సంస్థలు అవసరమైన చర్యలు తీసుకోనున్నాయి. అనుకూలమైన టెక్నాలజీ ఆధారిత లెర్నింగ్ విధానాల ద్వారా అకాడమిక్స్, ఉద్యోగాల కల్పన మధ్య ఉన్న అంతరాలను తొలగించటంపై బీఐజీ ప్రధానంగా దృష్టి కేంద్రీకరించనుంది. ప్రాథమిక దశలోనే విద్యార్థులు పరిశ్రమలకు సంబంధించిన కెరీర్స్‌పై దృష్టి పెట్టేలా 11,12 వ తరగతిలోనే నైపుణ్యాల శిక్షణను అందించనుంది. అలాగే ఐటీఐ, పాలిటెక్నిక్, విశ్వవిద్యాలయ విద్యార్థులకు కూడా నైపుణ్యాల శిక్షణను బీఐజీ అందించనుంది.

స్పోర్ట్స్

గగనంలో చిగురించి.. ఏడడుగులు నడిపించి..

దత్తసాయితో లవ్‌స్టోరీపై సింధు



న్యూఢిల్లీ: యువ వ్యాపారవేత్త వెంకట దత్తసాయితో స్టార్ షట్లర్ పీవీ సింధు ఏడడుగులు నడిచింది. భార్యగా కొత్త జీవితంలోకి అడుగుపెడుతున్న ఆమె..తన భర్త దత్తసాయితో తొలి పరిచయం గురించిన వివరాలను పంచుకుంది. 2022 అక్టోబరులో విమానంలో మొదటిసారి దత్తసాయిని చూడగానే అతడిపై ప్రేమ చిగురించిందని వెల్లడించింది. 'అది మొదలు నా జీవితం ఎంతో మారిపోయింది' అని సింధు ఉద్వేగంగా చెప్పింది. 'ఆ పయనం మా ఇద్దరిని దగ్గర చేసింది. రెండు నక్షత్రాలు ఒకటైన భావన కలిగింది. ఒక విధంగా అది 'లవ్ ఎట్ ఫస్ట్‌సైట్' అని సిగ్గుపడుతూ చెప్పుకొచ్చింది. తమ ఎంగేజ్‌మెంట్‌ను హడావుడి లేకుండా కొద్దిమంది సమక్షంలో జరుపుకోవడంపై వివరణ ఇచ్చింది. 'ఆ వేడుక ఆర్భాటంగా చేసుకొనేది కాదు. ముఖ్యమైన వ్యక్తులతో సన్నిహితంగా జరుపుకొనే మధుర క్షణం. అన్నింటికీ మించి జీవితాంతం గుర్తుండిపోయే అరుదైన జ్ఞాపకం' అని సింధు పేర్కొంది. వివాహానికి తాను, సాయి ఎలా ప్లాన్ చేసుకున్నామో కూడా తెలిపింది. 'ప్రొఫెషనల్ క్రీడాకారిణిగా నా షెడ్యూల్ ఎంతో బిజీగా ఉంటుంది. అందువల్ల పెళ్లికి ఏం కావాలి, ఎలా చేయాలనే విషయంలో నేను చాలా స్పష్టంగా ఉన్నా. అందుకు తగ్గట్టుగా ప్రణాళిక వేసుకున్నా. మరోవైపు..ఆ ప్రణాళికలన్నీ సాఫీగా సాగేలా..నా ప్రతి కలా నిజమయ్యేలా దత్తా సహకరించాడు. మొత్తంగా.. ఇద్దరమూ పెళ్లి వేడుకను అపురూపం చేసుకున్నాం' అని సింధు వివరించింది.

సస్పెన్షన్ సమయంలో టోర్నీలు ఎలా ఆడింది?

స్ప్రింటర్ హిమాదాస్‌పై వివాదం



న్యూఢిల్లీ: డోప్ టెస్ట్‌కు తన వివరాలు తెలియజేయని స్టార్ అథ్లెట్ హిమా దాస్‌పై జాతీయ డోపింగ్ నియంత్రణ (నాడా) సంస్థ క్రమశిక్షణ కమిటీ 16 నెలల సస్పెన్షన్ విధించింది. అయితే సస్పెన్షన్ సమయంలో ఆమె పోటీలలో పాల్గొనడం దుమారం రేపుతోంది. హిమపై విధించిన సస్పెన్షన్ జూలై 23, 2023 నుంచి అమలులోకి వచ్చింది. 16 నెలల శిక్ష గత నెల 21 తేదీతో పూర్తయింది. అంటే ఆ మరుసటి రోజునుంచే టోర్నీలలో పాల్గొనేందుకు దాస్ అర్హురాలు. కానీ ఆమె గత ఏప్రిల్‌లో బెంగళూరులో జరిగిన ఇండియన్ గ్రాండ్‌ప్రీతోపాటు జూన్‌లో పంచకులలో జరిగిన జాతీయ అంతర్రాష్ట్ర టోర్నీలలో పాల్గొనడం గమనార్హం. ఈనేపథ్యంలో నాడా సస్పెన్షన్‌కు విలువేమిటనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ప్రస్తుతం తిరువనంతపురంలో శిక్షణలో పాల్గొంటున్న హిమాదాస్‌ను వివరణ కోరితే స్పందించేందుకు ఆమె నిరాకరించింది.



ధోనీతో కృతీ సనన్

మహీ.. క్రిస్మస్ సంబరాలు

ముంబై: టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ క్రిస్మస్ సంబరాలను వినూత్నంగా జరుపుకొన్నాడు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి సంబరాలు చేసుకున్న మహీ.. తన కుమార్తె జివా కోసం శాంటాక్లాజ్ వేషం ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. ఈ వేడుకల్లో బాలీవుడ్ నటి కృతీ సనన్ తదితరులు పాల్గొని సందడి చేశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ధోనీ భార్య సాక్షీ సింగ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అవి వైరల్‌గా మారాయి. క్రిస్మస్ తాత వేషధారణలో ఉన్న ధోనీని చూసి అతని అభిమానులు మురిసిపోతున్నారు. ఆ ఫొటోలకు లైక్‌ల మీద లైక్‌లు కొడుతూ..కామెంట్లు పెడుతూ తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు.

'బాక్సింగ్ డే'లో పంచ్ ఎవరిదో?

నేటి నుంచే నాలుగో టెస్ట్

హ్యాట్రిక్‌పై భారత్ గురి



మళ్లీ ఓపెనర్‌గా రోహిత్!

బుమ్రా

ఉదయం 5 గం. నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో..

అశ్విన్‌తో సమంగా బుమ్రా

గాబాలో 9 వికెట్లతో అదరగొట్టిన పేసర్ బుమ్రా.. టెస్టుల్లో అత్యధిక రేటింగ్ పాయింట్లు సాధించిన భారత బౌలర్ అశ్విన్‌తో సమంగా నిలిచాడు. మూడో టెస్ట్ ద్వారా 14 పాయింట్లు సాధించిన బుమ్రా.. మొత్తంగా 904 పాయింట్లతో ఐసీసీ బౌలర్ల జాబితాలో టాప్ ర్యాంకర్‌గా తన స్థానాన్ని పదిలం చేసుకొన్నాడు. గతంలో అశ్విన్ అత్యధికంగా 904 పాయింట్లు దక్కించుకున్నాడు. మరో రెండు టెస్టులు జరగనున్న నేపథ్యంలో అశ్విన్‌ను బుమ్రా వెనక్కినెట్టే అవకాశం ఉంది. దక్షిణాఫ్రికా పేసర్ రబాడ (856), హాజెల్‌వుడ్ (852) రెండు, మూడు ర్యాంకుల్లో ఉన్నారు.

6 200 వికెట్ల మైలురాయిని అందుకోవడానికి బుమ్రాకు కావాల్సిన వికెట్లు.

4 మెల్‌బోర్న్‌లో 14 టెస్టులు ఆడిన భారత్ నాలుగు నెగ్గి, రెండు డ్రా చేసుకొంది. ఎనిమిది మ్యాచ్‌ల్లో ఓడింది. అయితే, 2014 నుంచి ఇక్కడ భారత్‌కు ఓటమే లేదు. 2014 టూర్‌లో డ్రా చేసుకొన్న టీమిండియా.. 2018, 2020లో విజయాలు సాధించింది.

జట్లు (అంచనా)

భారత్: యశస్వీ జైస్వాల్, రోహిత్ శర్మ, రాహుల్, కోహ్లీ, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), గిల్/జురెల్, జడేజా, నితీశ్/సుందర్, ఆకాశ్ దీప్, బుమ్రా, సిరాజ్.

ఆస్ట్రేలియా: ఉస్మాన్ ఖవాజా, సామ్ కోన్‌స్టాస్, లబుషేన్, స్మిత్, హెడ్, మార్ష్, క్యారీ (వికెట్ కీపర్), కమిన్స్ (కెప్టెన్), స్టార్క్, లియోన్, బోలాండ్.

పిచ్/వాతావరణం

మెల్‌బోర్న్ వికెట్ స్వతహాగా పేసర్లకు స్వర్గధామం. పిచ్‌పై పచ్చిక కనిపిస్తుండడంతో ఫాస్ట్ బౌలర్లు చెలరేగే అవకాశం ఉంది. అయితే, గత పర్యటనల్లో రహానె, పుజార సెంచరీలతో జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషించారు. సహజంగా ఇక్కడ టాస్ గెలిచిన జట్టు బౌలింగ్ చేయడానికే మొగ్గు చూపుతుంది. ప్రస్తుతం వాతావరణం వేడిగా ఉన్నా.. రెండో రోజు చిరుజల్లులు కురిసే చాన్సులున్నాయి. 90 వేల సీటింగ్ సామర్థ్యం కలిగిన మెల్‌బోర్న్‌లో టికెట్లన్నీ అమ్ముడుపోవడంతో.. స్టేడియం మొత్తం సందడి వాతావరణం నెలకొననుంది.

మెల్‌బోర్న్: వరుణుడి సహకారంతోపాటు లోయరార్డర్ బ్యాటర్లు పోరాటాన్ని ప్రదర్శించడంతో.. గాబా టెస్ట్‌లో భారత జట్టు డ్రాతో గట్టెక్కింది. పింక్ బాల్ మ్యాచ్‌లో ఘోరంగా ఓడిన టీమిండియాకు ఈ ఫలితం ఓదార్పునిచ్చేదే. ఐదు టెస్ట్‌ల సిరీస్ 1-1తో సమంగా నిలిచిన నేపథ్యంలో కొంత ఊపిరి పీల్చుకొన్న రోహిత్ సేన.. తమకు అచ్చొచ్చిన మెల్‌బోర్న్‌లో గురువారం నుంచి జరిగే కీలక నాలుగో, 'బాక్సింగ్ డే' టెస్ట్‌లో ఆస్ట్రేలియాతో అమీతుమీకి సిద్ధమైంది. ఈ మ్యాచ్‌లో భారత్ గెలిస్తే బోర్డర్-గవాస్కర్ ట్రోఫీతోపాటు వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ అవకాశాలు మెరుగవుతాయి. ఒకవేళ ఓడితే డబ్ల్యూటీసీ ఫైనల్ చాన్స్ దాదాపుగా చేజార్చుకొన్నట్టే. టీమిండియా బ్యాటింగ్ ఆందోళనకు గురి చేస్తోంది. ముఖ్యంగా సీనియర్లు రోహిత్, కోహ్లీ వరుస వైఫల్యాలు జట్టును ఇబ్బందుల్లోని నెడుతున్నాయి. ఓపెనర్‌గా రాహుల్‌ను కొనసాగిస్తుండడంతో.. గత రెండు టెస్టుల్లో మిడిలార్డర్‌లో ఆడిన రోహిత్ దారుణంగా విఫలమవుతున్నాడు. పెర్త్‌లో మురిపించిన కోహ్లీ.. ఆ తర్వాతి నాలుగు ఇన్నింగ్స్‌ల్లోనూ పేలవ ప్రదర్శన కనబర్చాడు. ఈ నేపథ్యంలో రోహిత్‌ను మళ్లీ ఓపెనర్‌గా దించి.. రాహుల్‌ను వన్ డౌన్‌లో ఆడించే దిశగా మేనేజ్‌మెంట్ ఆలోచిస్తున్నట్టు సమాచారం. అదే జరిగితే శుభ్‌మన్ గిల్‌ను పక్కనబెట్టి.. ధ్రువ్ జురెల్‌ను తుది జట్టులోకి తీసుకొనే అవకాశం ఉంది. యువ బ్యాటర్లు యశస్వి జైస్వాల్, రిషబ్ పంత్‌తోపాటు జడేజా భారీ స్కోర్లు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరో స్పిన్నర్ కావాలనుకొంటే ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ స్థానంలో సుందర్‌ను ఆడించొచ్చు. ఎంసీజీలో మెరుగైన రికార్డు ఉన్న కోహ్లీ మెరుపులు మెరిపించాలని అభిమానులు బలంగా కోరుకొంటున్నారు. ఆఫ్ స్టంప్ ఆవల పడిన బంతులను వేటాడి మరీ అవుటవుతున్న విరాట్.. ఆ బలహీనతను అధిగమించేందుకు నెట్స్‌లో తీవ్రంగా సాధన చేశాడు. ఇక, బౌలింగ్ విభాగానికొస్తే బుమ్రాకు మిగతా బౌలర్ల నుంచి తగినంత సహకారం అందడం లేదు. పేస్‌కు సహకరించే పిచ్‌పై సిరాజ్, ఆకాశ్ దీప్ రాణిస్తేనే టీమిండియా విజయావకాశాలు మెరుగుపడతాయి.



ప్రతీకారం కోసం ఆస్ట్రేలియా



కమిన్స్

బ్రేక్ వేయాలని..

దశాబ్దకాలంగా బాక్సింగ్ డే టెస్ట్‌లో టీమిండియాపై నెగ్గని ఆస్ట్రేలియా ఈసారి విజయం సాధించాలన్న కసితో ఉంది. అయితే, టాపార్డర్ బ్యాటర్ల వైఫల్యం జట్టును కలవరపెడుతోంది. ఓపెనర్‌గా మెక్‌స్వీని విఫలం కావడంతో అతడి స్థానంలో 19 ఏళ్ల సామ్ కోన్‌స్టాస్ అరంగేట్రం ఖాయం. మరోవైపు, ఖవాజా, లబుషేన్ ఫామ్‌కోసం తంటాలు పడుతున్నారు. సూపర్ ఫామ్‌లో ఉన్న ట్రావిస్ హెడ్ ఫిట్‌నెస్‌పై ఆందోళన రేగినా.. అతడు అందుబాటులో ఉంటాడని ఆసీస్ మేనేజ్‌మెంట్ ప్రకటించడం ఊరటనిచ్చేదే. బౌలింగ్‌లో కెప్టెన్ కమిన్స్, స్టార్క్, మార్ష్ రాణిస్తున్నారు. గాయపడిన హాజెల్‌వుడ్ స్థానంలో బోలాండ్ జట్టులోకి రానున్నాడు. ఇరుజట్లలోనూ లోపాలున్నా.. వాటిని సరిదిద్దుకొని ఆధిపత్యం ప్రదర్శించాలన్న ప్రయత్నంలో ఉండడంతో మ్యాచ్ రసవత్తరంగా సాగే అవకాశం ఉంది.

నమన్ ఓఝా తండ్రికి జైలు

బేతుల్ (మధ్యప్రదేశ్): బ్యాంకును మోసం చేసిన కేసులో భారత జట్టు మాజీ క్రికెటర్ నమన్ ఓఝా తండ్రి వినయ్ ఓఝాకు ఏడు సంవత్సరాల జైలు శిక్ష పడింది. 2013లో మధ్యప్రదేశ్‌లోని బేతుల్ జిల్లా కేంద్రంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర శాఖకు వినయ్ ఓఝా మేనేజర్‌గా వ్యవహరించారు. ఆ సమయంలో ఏజెంట్ల ద్వారా బ్యాంకులో నకిలీ ఖాతాలు తెరిచి రూ.1.25 కోట్లమేర అవినీతికి పాల్పడ్డారు. ఈకేసులో వినయ్ ఓఝాకు ఏడేళ్ల జైలు శిక్షతోపాటు రూ. ఏడు లక్షలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. ఇదే కేసులో మరో ముగ్గురికి కూడా జైలు శిక్ష, జరిమానా విధించారు.



మనూ భాకర్‌కు ఖేల్‌రత్న?

జాబితాలో చేర్చనున్న క్రీడా శాఖ

న్యూఢిల్లీ: ఈ ఏడాది ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డు జాబితాలో స్టార్ షూటర్ మనూ భాకర్ పేరు లేకపోవడం పెద్ద వివాదం సృష్టించింది. ఈ నేపథ్యంలో కేంద్ర క్రీడా శాఖ దిద్దుబాటు చర్యలు చేపట్టినట్టు తెలిసింది. ఖేల్ రత్న పురస్కారాల నామినేటెడ్ జాబితాలో మనూ భాకర్ పేరు చేర్చనున్నట్టు ఆ శాఖ వర్గాలు బుధవారం వెల్లడించాయి. సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ రామసుబ్రమణియన్ నేతృత్వంలోని 12 మంది సభ్యుల కమిటీ క్రీడా అవార్డులకు అథ్లెట్లను ఎంపిక చేయనుంది. ఇక ఈసారి ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డుకు పురుషుల హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, పారిస్ పారా ఒలింపిక్స్ హైజంప్‌లో స్వర్ణం నెగ్గిన ప్రవీణ్ కుమార్ తదితరుల పేర్లను సిఫారసు చేశారు.

ఖర్చు లేకుండా పూడికతీత!

- లోయర్ మానేరు, మిడ్ మానేరు, కడెం ప్రాజెక్టుల్లో చేపట్టాలని నిర్ణయం
- టెండర్లు పిలవాలని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం
- నీటి అభివృద్ధి సంస్థ ఖాతాకు నిధుల జమ

హైదరాబాద్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రిజర్వాయర్లలో పేరుకుపోయిన పూడికను పైసా ఖర్చు లేకుండా తొలగించి, రిజర్వాయర్ల సామర్థ్యాన్ని పూర్వ స్థాయికి చేర్చడంతోపాటు ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. రిజర్వాయర్లలో పూడికను తీసే క్రమంలో ఇసుక లభిస్తే రూ.406.64కు(జీఎస్టీ, పర్మిట్ ఫీజు, సినరేజ్ అదనం) వసూలు చేయనుంది. తోడిన ఒండ్రు మట్టిని వాణిజ్య అవసరాలు ఇటుకల తయారీ, గుంతలు పూడ్చటం వంటి పనులకు వినియోగిస్తే... ఆ మట్టికి విడిగా ధరను ఖరారు చేయనుంది. రైతులు తమ పొలాలకు తరలించాలనుకుంటే ఉచితంగా అందించనుంది. జాతీయ పూడికతీత పాలసీని అన్వయం చేసుకుంటూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం విదితమే. ఈ పాలసీపై మంత్రి వర్గ ఉప సంఘం ఇచ్చిన నివేదికను తెలంగాణ మంత్రి వర్గం ఆమోదించింది. దీనికి అనుగుణంగా లోయర్ మానేరు, మిడ్ మానేరుతోపాటు కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టుల్లో పూడికతీత చేపట్టనున్నారు. పూడికతీతతో వచ్చే నిధులను ప్రాజెక్టుల ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓ అండ్ఎం)కు వినియోగించాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉంది. ఈ నిధులను ప్రస్తుతానికి తెలంగాణ వాటర్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీడబ్ల్యూఆర్‌డీసీ)లో జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు టెండర్లు పిలవాలని నీటిపారుదల శాఖను ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిసింది. మహారాష్ట్ర, రాజస్థాన్‌లో ఫ్లోటింగ్ డ్రెడ్జింగ్(తేలియాడే పూడికతీత యంత్రం) తో పూడికను తీసి, మరో యంత్రం ద్వారా మట్టి, ఇసుకను వేరు చేస్తున్నారు. తెలంగాణలోనూ ఇదే విధానం అమలు కానుంది. తెలంగాణలో అమలు కానుంది. ఒండ్రు, బంకమట్టిని కేక్‌ల రూపంలో తయారు చేసి, ఇటుకల తయారీ పరిశ్రమలకు విక్రయించనున్నారు. రైతులకు ట్రాక్టర్ల ద్వారా మట్టిని సరఫరా చేయనున్నారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో 20ఏళ్ల గడువుతో అక్కడి ప్రభుత్వాలు టెండర్లు పిలిచాయి. అంటే.. పూడికతీతతో 20 ఏళ్లపాటు ప్రభుత్వానికి ఆదాయం రానుంది.

ఏటా తగ్గుతున్న సామర్థ్యం

తెలంగాణలో 929 టీఎంసీల సామర్థ్యం కలిగిన 159 రిజర్వాయర్లు ఉన్నాయి. రాష్ట్రంలో జాతీయ హైడ్రాలజీ ప్రాజెక్టు(ఎన్‌హెచ్‌పీ) కింద 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన 14 ప్రాజెక్టుల్లో పూడికపై అధ్యయనం చేయించగా... ఈ ప్రాజెక్టులు 35 టీఎంసీల మేర సామర్థ్యం కోల్పోయినట్లు గుర్తించారు. వరదల సమయంలో వచ్చి చేరే పూడికతో ప్రాజెక్టుల సామర్థ్యం ఏయేటికాయేడు గణనీయంగా తగ్గిపోతోంది. కేంద్రం లెక్కల ప్రకారం ఒక టీఎంసీ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ కట్టాలంటే భూసేకరణ, నిర్మాణ ఖర్చులు కలిపి రూ.162 కోట్లు ఖర్చవుతాయన్న అంచనాలున్నాయి. ఈ లెక్కన రాష్ట్రంలో అధ్యయనం చేసిన జలాశయాలకు రూ.5,670 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లేనని నిపుణులు చెబుతున్నారు.

పదేళ్లకు ఒకసారి అధ్యయనం

దేశవ్యాప్తంగా పదేళ్లకు ఒకసారి కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) లేదా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాజెక్టుల నీటి నిల్వలపై హైడ్రోగ్రాఫిక్/బాతోమెట్రిక్ సర్వేలు చేయిస్తుంటాయి. తాజాగా జాతీయ హైడ్రాలజీ ప్రాజెక్టు(ఎన్‌హెచ్‌పీ)లో భాగంగా ప్రపంచ బ్యాంకు నిధులతో తెలంగాణలోని పలు ప్రాజెక్టుల్లో పూడికపై అధ్యయనాలు జరగ్గా... అత్యధికంగా ర్యాలీ వాగు ప్రాజెక్టు 43.30 శాతం మేర సామర్థ్యం కోల్పోయినట్లు తేలింది. ఆ తర్వాత రామడుగు ప్రాజెక్టు 29.59 శాతం, జూరాల ప్రాజెక్టు 19.13 శాతం, ఎన్టీఆర్‌సాగర్ ప్రాజెక్టు 16.22 శాతం, మత్తడివాగు ప్రాజెక్టు 17.69 శాతం నిల్వ సామర్థ్యాన్ని కోల్పోయినట్లు తేలింది. ఇక, శ్రీశైలం ప్రాజెక్టు సామర్థ్యం 29.96 శాతం, నాగార్జునసాగర్ ప్రాజెక్టు సామర్థ్యం 23.52 శాతం మేర తగ్గింది. ప్రభుత్వం తాజాగా పూడికతీతపై మార్గదర్శకాలు సిద్ధం చేస్తుండగా... ఈ సమస్యకు స్వల్పంగానైనా పరిష్కారం లభించే అవకాశాలున్నాయి.

భూ సర్వేతోనే భూ భారతికి కీర్తి

ప్రతీ అంగుళం కొలిస్తేనే వివాదాలకు తెర.. సర్వే చేపట్టకుండా భూధార్ కార్డులు సవాలే

- పార్ట్-బీ, నిషేధిత భూముల సంగతేంటి?
- దశాబ్దాలుగా కార్యరూపం దాల్చని సర్వే
- నిజాం కాలం నాటి రికార్డులే ఆధారం



హైదరాబాద్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కొత్త ఆర్వోఆర్-2024 చట్టంతో భూ సమస్యలన్నింటికీ పరిష్కారం లభిస్తుందని ప్రభుత్వం చెబుతున్నా.. అది అంత సులభం కాదన్న వాదన వినిపిస్తోంది. భూముల రీ సర్వే చేయకుండా ఇప్పుడున్న వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడం సాధ్యం కాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రీ సర్వే చేయకుండా పాత అంశాల చుట్టూ ఎన్ని మెరుగులు దిద్దినా ఉపయోగం ఉండదని పేర్కొంటున్నారు. ఆర్వోఆర్-2020 స్థానంలో భూభారతి పేరుతో ఆర్వోఆర్-2024ను తీసుకు రావడం.. కొత్త సీసాలో పాత సారానే అన్న చందంగా ఉందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే, భూ లావాదేవీల సమయంలో క్షేత్ర స్థాయి సర్వే, సబ్ డివిజన్ మ్యాప్‌లను తప్పనిసరి చేస్తున్న నేపథ్యంలో కాలక్రమేణా భూముల రీ సర్వే పూర్తవుతుందనే భావనలో ప్రభుత్వం ఉంది. కానీ.. రీ సర్వే చేపట్టడం వెనుక ప్రభుత్వానికి ఉన్న ఇబ్బంది ఏంటి? కేంద్రం నుంచి రీ సర్వేకు నిధులు అందినా ఎందుకు ముందుకెళ్లడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

80 ఏళ్లుగా ముందుకు పడని అడుగు

రాష్ట్రంలో సుమారు 80 ఏళ్లుగా భూముల రీ సర్వే జరగలేదు. నిజాం హయాంలో 1936-42 మధ్య సమగ్ర భూముల సర్వే జరగ్గా... హైదరాబాద్‌తోపాటు పట్టణాల్లో 1972లో టౌన్ సర్వే జరిగింది. ప్రతి భూమి పదేసి మంది చేతులు మారినప్పటికీ రికార్డుల నవీకరణ జరగలేదు. భూమి ఒకరి చేతుల్లో ఉంటే... రికార్డు మరొకరి చేతుల్లో ఉంది. చివరికి భూముల సరిహద్దు పత్రాలు(టిప్పన్‌లు) కూడా 75 ఏళ్ల కిందటివే. దాని ఫలితంగానే ఇప్పుడు సమస్యలు తీవ్ర రూపం దాల్చాయి. కన్‌క్లూజివ్ టైటిల్ యాక్ట్ తెస్తామని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించినా.. కార్యాచరణ మాత్రం చేపట్టలేదు. ఒక అడుగు ముందుకు నాలుగు అడుగులు వెనక్కి అన్నట్లు కొన్ని ప్రయత్నాలు జరిగినా అనుకున్న లక్ష్యం నెరవేరలేదు. వాస్తవానికి జాతీయ భూ రికార్డుల నవీకరణ పథకం కింద 2014లోనే తెలంగాణలో భూ సమగ్ర సర్వేకు కేంద్రం నిధులు మంజూరు చేసింది. ఇందుకోసం రూ.250 కోట్లు ఖర్చవుతాయని అంచనా వేసి... రూ.83 కోట్ల విడుదల చేసింది. అయితే పదేళ్లుగా భూముల సర్వే దిశగా ప్రభుత్వం అడుగు పడలేదు. కేసీఆర్ హయాంలో అప్పటి రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన బీఆర్ మీనా పలు దఫాలుగా భూముల సర్వేకు అనుమతి ఇవ్వాలని సీఎంవోను కోరినా సానుకూల స్పందన రాలేదు. 2016లో సర్వేకు సంబంధించిన సన్నాహకాలు పూర్తి చేసిన అప్పటి సీసీఎల్ఏ రేమండ్‌పీటర్... రెండేళ్లలో సర్వే పూర్తి చేస్తామని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. దీనిపైనా స్పందన కనిపించలేదు. ఓ దశలో కేంద్రం కూడా భూముల సర్వే చేయకపోతే నిధులను వెనక్కి పంపించాలని రాష్ట్ర ప్రభుత్వానికి తాఖీదులు పంపింది.

రాష్ట్రంలో భూముల సమాచారం

భూముల విస్తీర్ణం	2,45,05,758 ఎకరాలు
సర్వే నెంబర్లు	1,78,27,308
కమతాలు	75,54,137
మండలాలు	612
జిల్లాలు	33
రెవెన్యూ డివిజన్లు	73

భూధార్ కార్డులతోనూ ఇబ్బందే

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 'ఎంజాయ్‌మెంట్' ఆధారంగా తాత్కాలిక భూధార్ కార్డులు ఇస్తామని చెబుతోంది. ఇదే జరిగితే కొత్త వివాదాలు తలెత్తే ప్రమాదం లేకపోలేదని రెవెన్యూ నిపుణులు చెబుతున్నారు. 2019లో పొరుగు రాష్ట్రమైన ఏపీ... భూ సమగ్ర సర్వే చేపట్టి రెండేళ్లలో పూర్తి చేసింది. ఇందుకోసం సుమారు రూ.1000 కోట్లు ఖర్చు చేసింది. తెలంగాణలో 10,954 రెవెన్యూ గ్రామాల డిజిటల్ మ్యాపులు సిద్ధంగా ఉన్నాయి. ప్రభుత్వం అనుమతిస్తే రెండేళ్లలోపు సర్వే పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నా.. ప్రభుత్వం వైపు నుంచి ఆ దిశగా సానుకూలత కనిపించడం లేదు. దేశంలో ఇప్పటికే గుజరాత్, త్రిపుర వంటి రాష్ట్రాల్లో సమగ్ర భూ సర్వే నిర్వహించారు. పొరుగున ఉన్న కర్ణాటకలో భూములకు సంబంధించిన రికార్డుల ప్రక్షాళన, సర్వే కోసం "భూమి-కావేరి" పేరిట ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు. భూమిని అమ్మాలన్నా లేదా కొనాలన్నా అక్కడి అధికారులు తొలుత క్షేత్ర స్థాయి సర్వేను నిర్వహిస్తారు. ఈ సర్వేలో సదరు భూమి సర్వే నంబర్లలో ఉండి, రైతు పొజిషన్‌లో ఉన్నప్పుడే.. సరైన భూమిగా గుర్తించి, మ్యాప్‌తో సహా డిజిటలైజ్ చేస్తారు. ఆన్ లైన్‌లో డిజిటలైజ్ చేసిన తర్వాతనే రిజిస్ట్రేషన్ చేయడానికి అవకాశం ఉంటుంది. తాజాగా ప్రభుత్వం తెచ్చిన భూభారతి చట్టం-2024 ఆధారంగా భూమిని సర్వే చేశాకే రిజిస్ట్రేషన్‌కు అనుమతించాలని ప్రతిపాదించింది. అయితే. ఇప్పటికే ఉన్న సరిహద్దు భూ వివాదాలను ఎలా పరిష్కరిస్తారనేది చర్చనీయాంశంగా మారింది. ధరణి పార్ట్-బిలో ఉన్న 18 లక్షల ఎకరాలకు, సాదాబైనామా దరఖాస్తులకు, నిషేధిత జాబితాలో ఉండే భూములకు పరిష్కార మార్గాలు చూపుతామని ప్రభుత్వం భరోసా ఇస్తుండడంతో ప్రజల్లో ఆశలు చిగురించాయి. సమగ్ర సర్వే చేయకుండా ఈ సమస్యలను ఎలా అధిగమిస్తారనే దానిపై గందరగోళం నెలకొంది.

సర్వేకు సిద్ధంగా నిధులు

జిల్లా యూనిట్‌గా సర్వే చేస్తే 16 నెలల్లో సర్వే పూర్తి చేయవచ్చని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. భూముల సర్వేకు గ్రామీణ ప్రాంతాలకు రూ.400-450 కోట్లు, పట్టణ ప్రాంతాలకు రూ.200 కోట్ల వరకు ఖర్చవుతుందని గతంలో ప్రతిపాదనలు చేశారు. భూముల సర్వేకు కేంద్రం విడుదల చేసిన రూ.83 కోట్ల నిధులు ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉన్నాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో భూముల రీ సర్వే 90శాతం పూర్తయింది. ప్రభుత్వం అనుమతి ఇవ్వకున్నా సర్వే విభాగం దాదాపు 10 వేల రెవెన్యూ గ్రామాల మ్యాపులను డిజిటైజేషన్ చేసింది. నిబంధనల ప్రకారం ప్రతి 30 ఏళ్లకు ఒకసారి రెవెన్యూ రికార్డుల నవీకరణ జరగాలి. అప్పుడే ఏ భూమికి ఎవరు యాజమానులో తేలుతుందని, సమస్యలు పరిష్కారమవుతాయని రెవెన్యూ నిపుణులు చెబుతున్నారు.

విశాఖలో మరో ఫార్మా సెజ్

- నక్కపల్లి వద్ద 1,800 ఎకరాల్లో ఏర్పాటు
- 8న శంకుస్థాపన చేయనున్న ప్రధాని మోదీ
- రూ.1,500 కోట్లు ఖర్చుచేయనున్న కేంద్రం
- ధ్రువీకరించిన ఎంపీ సీఎం రమేశ్

అమరావతి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విశాఖకు మరో మణిహారం అమరనుంది. విశాఖ సమీపంలోని అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద కొత్తగా మరో ఫార్మా సెజ్ ఏర్పాటు కానుంది. ఆ జిల్లాలో ఇప్పటికే అచ్యుతాపురం వద్ద ఫార్మా సెజ్ ఉంది. ఇప్పుడు ఇంకోదానిని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. దానికి ప్రధాని మోదీ జనవరి 9న శంకుస్థాపన చేయనున్నారు. ఆయన పర్యటనను అనకాపల్లి బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ ధ్రువీకరించారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. నవంబరు 29వ తేదీనే ప్రధాని రావలసి ఉందని, ఆ సమయంలో వాతావరణం అనుకూలంగా లేక వాయిదా పడిందని.. ఇప్పుడు వచ్చే నెలలో వస్తున్నారని తెలిపారు. కాగా.. ఫార్మా పరిశ్రమల ఏర్పాటుకు అనుకూల వాతావరణం ఉండడంతో అనకాపల్లి జిల్లాలో కేంద్రం కొత్త సెజ్‌ను మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే స్థలం ఎంపిక పూర్తి చేసింది. నక్కపల్లి వద్ద సుమారు 1,800 ఎకరాల్లో దీనిని ఏర్పాటు చేయనున్నారు. సెజ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు అనువుగా నేల చదును, రహదారుల నిర్మాణం, విద్యుత్, నీటి సదుపాయం, ఇతర వసతులను కేంద్రం తన ఖర్చుతో సమకూరుస్తుంది. పనుల నిర్వహణకు టెండర్లు కూడా పిలిచింది. దీనిపై కేంద్రం సుమారు రూ.1,500 కోట్లు ఖర్చు చేయనున్నట్లు అంచనా. ఇది పూర్తయితే పెద్ద సంఖ్యలో ఫార్మా పరిశ్రమలు వస్తాయని భావిస్తున్నారు. హోం మంత్రి వంగలపూడి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న పాయకరావుపేట నియోజకవర్గం పరిధిలోకి నక్కపల్లి ప్రాంతం వస్తుంది. ఫార్మా సెజ్‌తోపాటు ప్రధాని మరో రెండు శంకుస్థాపనలు కూడా చేయనున్నారు. అనకాపల్లి జిల్లా పూడిమడక వద్ద రూ.75 వేల కోట్లతో ఏర్పాటవుతున్న గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి కేంద్రానికి శంకుస్థాపన చేస్తారు. దీనిని కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్టీపీసీ ఏర్పాటు చేస్తోంది. సాధారణంగా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి భారీ స్థాయిలో స్వచ్ఛమైన నీరు కావాలి. కానీ ఎన్టీపీసీ సముద్రపు నీటితో హైడ్రోజన్ తయారు చేసే టెక్నాలజీని కనుగొంది. ఆ టెక్నాలజీ సాయంతో పూడిమడక వద్ద ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది థర్మల్ విద్యుత్‌కు ప్రత్యామ్నాయంగా గ్రీన్ హైడ్రోజన్‌ను వినియోగించే అవకాశం ఉంది. దీనితోపాటు విశాఖ కేంద్రంగా సౌత్ కోస్టల్ రైల్వే జోన్‌కు కూడా ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్ర విభజన హామీల్లో జోన్ ఉన్న సంగతి తెలిసిందే. స్థలం సమస్యతో జగన్ ప్రభుత్వ హయాంలో ఇది నెరవేరలేదు. కూటమి ప్రభుత్వం రాగానే సమస్యను పరిష్కరించి స్థలాన్ని రైల్వే శాఖకు అప్పగించింది. ఇందులో జోన్‌కు సంబంధించిన భవనాల నిర్మాణానికి ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. ఈ సందర్భంగా పూడిమడక లేదా విశాఖలో బహిరంగ సభ నిర్వహించే అవకాశముంది.

సంక్రాంతికి కొత్త కార్యవర్గం!

- పండగ తర్వాత పీసీసీ కార్యవర్గ ప్రకటన
- ప్రచార కమిటీ చైర్మన్‌గా జగ్గారెడ్డి!
- కార్యనిర్వాహక అధ్యక్షులుగా ముగ్గురు
- సీడబ్ల్యూసీ తర్వాత ఇన్‌చార్జి కార్యదర్శినీ మార్చే అవకాశం

హైదరాబాద్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి తర్వాత టీపీసీసీ కొత్త కార్యవర్గం కొలువుదీరనుంది. జనవరి మొదటి వారంలో ముగ్గురు కార్యనిర్వాహక అధ్యక్షులు, ప్రచార కమిటీ చైర్మన్ సహా కార్యవర్గాన్ని ఏఐసీసీ ఖరారు చేయనుంది. ఏఐసీసీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జినీ మార్చి.. కొత్త వారిని నియమించనుంది. మొత్తమ్మీద సంక్రాంతి తర్వాత తెలంగాణ కాంగ్రెస్ పార్టీ.. టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ సారథ్యంలో నిర్మాణ పరంగా కొత్త దనం సంతరించుకోనుంది. టీపీసీసీ అధ్యక్షుడిగా మహేశ్ కుమార్‌గౌడ్ నియామకం జరిగి వంద రోజులు పూర్తయిన నేపథ్యంలో కొత్త కార్యవర్గం ఏర్పాటుపై ఇటీవల ఏఐసీసీ కొంత కసరత్తు చేసింది. టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ నియామకం జరిగినప్పుడు ఏకంగా ఐదుగురికి కార్యనిర్వాహక అధ్యక్షులుగా అవకాశం ఇచ్చిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఉన్న తూర్పు జగ్గారెడ్డికి.. ప్రచార కమిటీ చైర్మన్ పదవి దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ వద్ద జగ్గారెడ్డికి.. మంచి ఆర్గనైజర్ అన్న పేరుంది. జగ్గారెడ్డి ఆర్గనైజింగ్ స్కిల్‌ను పార్టీకి ఉపయోగించుకోవాలంటూ రాహుల్‌గాంధీ చేసిన సూచన మేరకే ప్రచార కమిటీ చైర్మన్ పోస్టును ఆయనకు ఖరారు చేసినట్లు చెబుతున్నారు. ఈసారి కార్యనిర్వాహక అధ్యక్షులుగా ముగ్గురికే అవకాశం దక్కనున్నట్లు తెలుస్తోంది. రెడ్డి, ఎస్సీ మాదిగ, ఎస్టీ లంబాడా సామాజిక వర్గాల నుంచి తీసుకోవాలన్న నిర్ణయానికి ఏఐసీసీ వచ్చినట్లుగా చెబుతున్నారు. రెడ్డి సామాజిక వర్గం నుంచి సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీచంద్‌రెడ్డి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్లను పరిశీలిస్తున్నారు. ఏఐసీసీలోనే వంశీచంద్‌రెడ్డి సేవలను వినియోగించుకోవాలని అధిష్ఠానం భావిస్తే రేసులో రోహిన్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మిగులుతారు. ఎస్సీ సామాజిక వర్గం నుంచి ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, ఎస్టీ లంబాడా నుంచి ఎంపీ బలరాం నాయక్‌లను నియమించేందుకే ఎక్కువగా అవకాశం ఉంది. టీపీసీసీ అధ్యక్షుడే బీసీ కావడంతో.. ఆ వర్గం నుంచి కార్యనిర్వాహక అధ్యక్షుడిని తీసుకునే అవకాశం లేదంటున్నారు. ముస్లింల నుంచి కార్యనిర్వాహక అధ్యక్షుడిని తీసుకోవాలా.. వద్దా? అన్న తర్జనభర్జన కూడా పార్టీలో నడిచింది. ప్రస్తుతం కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఉన్న అజారుద్దీన్‌నే మళ్లీ నియమించాలా? లేక నాంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి ఫిరోజ్‌ఖాన్‌ను తీసుకోవాలా అన్నదానిపై చర్చ జరుగుతోంది. చివరి నిమిషంలో ముస్లింల నుంచీ ఒకరిని కార్యనిర్వాహకఅధ్యక్షుడిగా తీసుకోవాలని అధిష్ఠానం భావిస్తే ఫిరోజ్‌ఖాన్‌కే ఎక్కువ అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

దీపాదాస్ స్థానంలో భూపేశ్ భగేల్!

బెల్గాంలో గురు, శుక్రవారాల్లో జరిగే సీడబ్ల్యూసీ సమావేశాల్లో ఏఐసీసీ పునర్వ్యవస్థీకరణపైనా చర్చించనున్నట్లు తెలుస్తోంది. అలాగే, వివిధ రాష్ట్రాల ఇన్‌చార్జి కార్యదర్శులనూ మార్చనున్నట్లు చెబుతున్నారు. ఇందులో భాగంగా తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ స్థానంలో కొత్త ఇన్‌చార్జి రానున్నారు. సహజంగా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో సీఎంను డీల్ చేసేందుకు ఆ స్థాయి వ్యక్తులను ఇన్‌చార్జిలుగా నియమిస్తారు. ఈ సారి తెలంగాణకు ఛత్తీస్‌ఘడ్ మాజీ సీఎం భూపేశ్ భగేల్, రాజస్థాన్ మాజీ సీఎం అశోక్ గెహ్లాట్ పేర్లు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. వీరిలో భూపేశ్ భగేల్‌కే ఎక్కువ అవకాశాలు ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఏఐసీసీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా రాష్ట్రానికి మరో ఏఐసీసీ కార్యదర్శి పోస్టు దక్కే అవకాశం ఉంది. కమ్మ సామాజిక వర్గం నుంచి కుసుమ్‌కుమార్‌కు ఏఐసీసీ కార్యదర్శి పదవి దక్కే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

మాకు కాంగ్రెస్ సర్టిఫికెట్‌తో పనిలేదు

అసలు ప్రజాస్వామ్యంపై మాట్లాడే అర్హత ఆ పార్టీకే లేదు..: కిషన్‌రెడ్డి

- కాంగ్రెస్‌కు అబద్ధాల్లో ఆస్కార్: సంజయ్
- విలువలున్న వ్యక్తి వాజపేయి: లక్ష్మణ్

హైదరాబాద్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్, ప్రజాస్వామ్యం గురించి బీజేపీకి కాంగ్రెస్ సర్టిఫికెట్ ఇవ్వాల్సిన పనిలేదని, అసలు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. అంబేడ్కర్‌ను రెండు పర్యాయాలు ఎన్నికల్లో ఓడించిన పార్టీ కాంగ్రెస్ అని, అంబేడ్కర్‌ను మంత్రిగా రాజీనామా చేయించిన ఘనత నెహ్రూకే దక్కుతుందని విమర్శించారు. మాజీ ప్రధాని వాజపేయి శత జయంతి ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరాగాంధీ లాంటి నేతలకు భారతరత్న ఇచ్చుకున్న కాంగ్రెస్ పెద్దలు, రాజ్యాంగాన్ని రూపకల్పన చేసిన బాబాసాహెబ్ అంబేడ్కర్‌కు భారతరత్న ఇచ్చేందుకు మనసు రాలేదన్నారు. దేశంలో అనేక సామాజిక సంస్థలు వాజపేయి శతాబ్ది ఉత్సవాలను 2025 డిసెంబరు 25 వరకు నిర్వహించుకోవాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ ఉత్సవాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. అంబేడ్కర్‌ను కాంగ్రెస్ అడుగడుగునా అవమానించిందని, ఇప్పుడు ఆయనపై మొసలి కన్నీరు కార్చడం విడ్డూరమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. అబద్ధాల్లో ఆస్కార్ అవార్డు ఇవ్వాల్సి వస్తే అది కాంగ్రెస్‌కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా వాజపేయి పని చేశారన్నారు. తెలంగాణలో ఆనాడు కేసీఆర్, ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రజలకు 70 ఎంఎం సినిమాలు, గ్రాఫిక్స్ చూపుతూ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారన్నారని దుయ్యబట్టారు. అంబేడ్కర్ విషయంలో కాంగ్రెస్ అబద్ధాలను ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ప్రధానిగా వాజపేయి మూడు పర్యాయాలు దేశానికి సేవలందించారని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కె.లక్ష్మణ్ అన్నారు. నైతిక విలువలతో కూడిన రాజకీయాలు చేసిన మహోన్నత వ్యక్తి వాజపేయి అని కొనియాడారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలను తప్పుదారి పట్టించేలా రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్ కుట్రలను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. వాజపేయి జీవితం స్ఫూర్తిదాయకమని కేంద్ర మాజీ మంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్ వ్యాఖ్యానించారు. వాజపేయి ఆశయాలను నరేంద్ర మోదీ ముందుకు తీసుకెళుతున్నారని చెప్పారు. వాజపేయి జయంతి వేడుకల్లో భాగంగా 27 కేంద్రాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించినట్లు బీజేపీ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ తెలిపారు.



బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వాజపేయి జయంతి ఉత్సవాల సందర్భంగా జ్యోతి వెలిగిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, చిత్రంలో బండి సంజయ్, ఎంపీ లక్ష్మణ్ తదితరులు

గ్రామాల్లో 'స్థానిక' జోష్

- సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై చర్చ
- జనవరి, ఫిబ్రవరిలో ఎన్నికలంటూ ప్రచారం
- ప్రత్యేకంగా దృష్టి పెట్టిన రాజకీయ పార్టీలు

హైదరాబాద్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): "సర్పంచ్ ఎన్నికలు జనవరి, ఫిబ్రవరిలో అంటున్నారు.. నిజమేనా! బీసీలకు రిజర్వేషన్లను పెంచుతారా? ఈసారి మన ఊరు సర్పంచ్‌గిరీ ఎవరికి వస్తదో?" ప్రస్తుతం తెలంగాణ పల్లెల్లో రచ్చబండల దగ్గర జరుగుతున్న చర్చ ఇది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపైనా ఇదే చర్చ. రాష్ట్రంలో ఏ ప్రాంతంలో చూసినా "ఎన్నికలు ఎప్పుడంటున్నారు?" అనే ప్రశ్నతోనే సంభాషణలు మొదలవుతున్నాయి. స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల మార్పునకు సంబంధించి కూడా విస్తృత చర్చ జరుగుతోంది. రిజర్వేషన్లు మారితే తమ గ్రామాల్లో సర్పంచ్‌గా, మండలాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీగా ఏ సామాజిక వర్గానికి అవకాశం వస్తుందనే దానిపైనా బేరీజు వేస్తున్నారు. మరోవైపు రాజకీయ పార్టీల ద్వితీయ శ్రేణి నాయకత్వం కూడా స్థానికంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇందుకోసం గ్రామం, మండల స్థాయిలో ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. పార్టీల వారీగా ఎవరి వర్గాలను వారు బలోపేతం చేసుకుంటున్నారు. ఓటర్ల జాబితాలపైనా ప్రత్యేక దృష్టి పెడుతూ.. ప్రస్తుతం జాబితాలో ఎవరెవరు ఉన్నారు? ఎన్నికల నాటికి కొత్తగా ఓటు హక్కు వచ్చేవారు ఎవరైనా ఉన్నారా? అనేదానిపై గ్రామాల్లో తూర్పార పడుతున్నారు. మొత్తంగా రాష్ట్రంలో సంక్రాంతి కంటే ముందే స్థానిక జోష్ మొదలైందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. క్షేత్రస్థాయిలోనూ ఇదే తంతు మొదలైంది. ప్రభుత్వం అమలుచేసిన రుణమాఫీ పథకం అందరికీ అందలేదని, స్థానిక ఎన్నికల కోసమే సంక్రాంతి నుంచి రైతు భరోసా, కూలీలకు రూ.12వేల సాయం అందిస్తామంటున్నారని గ్రామీణ ప్రాంతాల్లో పార్టీల నడుమ మాటల మంటలు రాజుకుంటున్నాయి.

రిజర్వేషన్ల మార్పుపై ఆసక్తి..

తెలంగాణ సర్పంచ్‌ల పదవీకాలం పూర్తయి 9నెలలు అవుతోంది. ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీ కాలం పూర్తయి 7నెలలు అవుతోంది. వాస్తవానికి ఆయా పదవుల కాలం అయిపోయేనాటికే ఎన్నికలు జరిగి కొత్తవారు ఎన్నిక కావాల్సి ఉంది. కానీ, రాష్ట్రంలో గత ఏడాది డిసెంబరులో అసెంబ్లీ ఎన్నికలు, ఆ వెంటనే లోక్‌సభ ఎన్నికలు జరగడంతో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు ఆటంకం ఏర్పడింది. మరోవైపు స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్‌ను 42శాతం పెంచుతామంటూ ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం కులగణనకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ప్రభుత్వం నియమించిన ప్రత్యేక కమిషన్(బీసీ డెడికేటెడ్ కమిషన్) బీసీల రిజర్వేషన్‌పై ప్రభుత్వానికి సమగ్ర నివేదికను అందించనుంది. అనంతరం రిజర్వేషన్ల కేటాయింపుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. అయితే ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా.. ఏ కులానికి ఎంత రిజర్వేషన్ కేటాయించినా.. అన్నీ కలిపి 50శాతానికి మించకూడదు. దాంతో ఈసారి స్థానిక ఎన్నికల్లో ఏ సామాజిక వర్గం వారికి ఎంత మేర అవకాశాలు లభించనున్నాయనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.



ఉన్నది కాలదన్ని.. లేనిదానికి పాకులాట

- రెవెన్యూ, పురపాలక శాఖల నిర్లక్ష్యం
- రూ.200 కోట్ల స్థలం ప్రైవేటు పరం
- సొంత జాగా వదులుకుని తాజాగా భూ సేకరణ
- అప్పట్లో భూమి ఇచ్చేసిన అధికారులపై నేటికీ చర్యల్లేవు

హైదరాబాద్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): పురపాలక శాఖ అధికారుల నిర్లక్ష్యం, లోపాయికారి తనం.. ప్రైవేటు వ్యక్తులతో కుమ్మక్కు అవడం వల్ల రూ.200 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలం ప్రైవేటు పరం అయింది. ఇందులో రెవెన్యూ శాఖ పాత్ర కూడా అంతే ఉంది. హైదరాబాద్ గౌలిపురాలో నిజాం కాలం నుంచి కబేళా నిర్వహణ ఉంది. దీనికి సంబంధించి జీహెచ్ఎంసీ ఆధీనంలో 4.2 ఎకరాల స్థలం ఉన్నది. 2003లో హైకోర్టు ఆదేశాలతో గౌలిపురా కబేళా మూతపడింది. దీంతో కొందరు వ్యక్తుల కన్ను ఈ స్థలంపై పడింది. రెవెన్యూ, పురపాలక అధికారులు సహకరించడంతో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమి చేతులు మారింది. ఈ భూమిని 2010లో హైదరాబాద్ అప్పటి కలెక్టర్ ప్రైవేటు వ్యక్తులకు మ్యుటేషన్ చేశారు. దీంతో పురపాలక శాఖ అధికారులు, జీహెచ్ఎంసీ ద్వారా ఆ భూమి తమదని కోర్టును ఆశ్రయించారు. తర్వాత హైదరాబాద్ కలెక్టర్‌గా వచ్చిన గుల్జార్.. గౌలిపురా భూమి మ్యుటేషన్‌ను రద్దు చేసి ప్రభుత్వానికి చెందినదిగా ప్రకటించారు. మరోవైపు ప్రైవేట్ వ్యక్తులు కూడా కోర్టుకెళ్లారు. ఇదిలా ఉండగానే మళ్లీ కబేళా ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. ఇదే స్థలంలో 2 వేల గజాల్లో రాంకీ సంస్థ ద్వారా రూ.7కోట్లతో అత్యాధునికంగా నిర్మాణం చేపట్టారు. అయితే, కోర్టు వివాదం ఉండడంతో ఈ కబేళా ప్రారంభానికి నోచుకోలేదు. ఈలోగా ప్రైవేట్ వ్యక్తులతో కుమ్మక్కైన జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులు ఆ భూమితో తమకు సంబంధం లేదని అఫిడవిట్ ఇచ్చారు. దీంతో 2022లో కోర్టు సదరు భూమిని ప్రైవేట్ వ్యక్తులకే అప్పగించింది.

ఇప్పుడు సేకరణకు ప్రతిపాదనలు

సొంత భూమిని కాలదన్నుకున్న పురపాలక శాఖ అధికారులు.. కబేళాను నిర్వహణలోకి తీసుకొచ్చేందుకు సన్నద్ధమయ్యారు. ఇంకా భూమి కావాల్సి రావడంతో అదనపు అడ్వకేట్ జనరల్ రజినీకాంత్‌రెడ్డిని ఆశ్రయించగా పశు సంవర్ధక శాఖ సూచనల మేరకు స్థలం సేకరించాలని ప్రతిపాదించారు. ఓవైపు కబేళా ప్రారంభించాలని వృత్తిదారుల నుంచి ఒత్తిడి రావడం, కబేళా నిర్వహణ, వాహన రాకపోకలకు ఇబ్బందికర పరిస్థితులు ఉండటంతో మరో 2వేల గజాలు సేకరించేందుకు సన్నద్ధమవడం చర్చనీయాంశంగా మారింది. దీనికి రూ.15కోట్ల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. కబేళాకు సంబంధించిన 4 ఎకరాల్లో ఇప్పటికీ 2.50 ఎకరాలు ఖాళీగానే ఉంది. ఇందులో పశువుల సంత జరుగుతోంది. మళ్లీ ప్రభుత్వ నిధులతో సేకరణకు ప్రతిపాదనలు చేయడం గమనార్హం. జీహెచ్ఎంసీ కమిషనర్ త్వరలోనే భూసేకరణపై నిర్ణయం తీసుకోనున్నారు. ఇదంతా ఒక ఎత్తైతే.. అదే ప్రాంతంలో 1961లోనే జీహెచ్ఎంసీ అధికారులు 3 ఎకరాలను కొనుగోలు చేశారు. ఇప్పుడు ఆ భూమి ఎక్కడ ఉంది, ఎవరి చేతిలో ఉందో అంతుపట్టడం లేదు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ భూమి దస్త్రాలను సీపీఎం నాయకుడు శ్రీనివాస్ సేకరించారు. జీహెచ్ఎంసీ అధికారులను ప్రశ్నిస్తే మాత్రం ఏమీ చెప్పడం లేదని ఆయన అంటున్నారు. భూసేకరణకు వెళ్లే ముందు ఈ 3 ఎకరాలు ఏమైందో జీహెచ్ఎంసీ అధికారులు దృష్టిసారించాల్సి ఉంది. కొసమెరుపు ఏమంటే.. ఇంత విలువైన స్థలాన్ని అప్పనంగా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టిన జీహెచ్ఎంసీ అధికారులపై ఇప్పటికీ చర్యలు లేవు.

ప్రభువు ఆశీస్సులతోనే ప్రజా ప్రభుత్వం

క్రైస్తవ మిషనరీల స్ఫూర్తితో పేదలకు విద్య, వైద్యం.. మెదక్ చర్చితో నాకు విడదీయరాని అనుబంధం

- గతంలో పీసీసీ అధ్యక్షుడిగా వచ్చినప్పుడే.. సీఎం హోదాలో మళ్లీ వస్తానని మొక్కుకున్నా
- మెదక్ చర్చి శతాబ్ది వేడుకలు, క్రిస్మస్ సంబరాల్లో సీఎం రేవంత్
- ఏడుపాయల వనదుర్గమాత సన్నిధిలో పూజలు

సంగారెడ్డి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): "నేను పార్టీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడే మెదక్ చర్చికి వచ్చాను. మళ్లీ సీఎం హోదాలో ఇక్కడకు వచ్చేలా ఆశీర్వదించాలని ఆనాడు ప్రభువును మొక్కుకున్నాను. ఆ ప్రభువు ఆశీర్వాదంతోనే ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నాం. అందుకే మాట తప్పకుండా మళ్లీ మెదక్ చర్చికి వచ్చాను" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం క్రిస్మస్ పండుగ సందర్భంగా మెదక్ చర్చి నూరేళ్ల వేడుకలకు సీఎం రేవంత్ రెడ్డి హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏ దిక్కూ లేనివారికి ప్రభువే దిక్కు అన్నట్లుగా క్రైస్తవ మిషనరీలు సేవాభావాన్ని చాటుతున్నాయని గుర్తుచేశారు. ఈ సేవల స్ఫూర్తితోనే రాష్ట్రంలో పేద వారికి విద్య, వైద్యం అందిస్తున్నామని తెలిపారు. గురుకులాల బలోపేతం, ఫీజు రీయింబర్స్‌మెంట్, రాజీవ్ ఆరోగ్యశ్రీలకు స్ఫూర్తి క్రైస్తవ మిషనరీలేనని అన్నారు. దళిత, గిరిజన క్రైస్తవులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో తగిన ప్రాధాన్యం ఇస్తున్నామని సీఎం పేర్కొన్నారు. ఉచిత విద్యుత్తు, ఇందిరమ్మ ఇండ్లు, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ, పంట బోనస్, రూ.21 వేల కోట్ల రుణమాఫీలోనూ ఈ వర్గాలకే అధికంగా లబ్ధి చేకూరిందని తెలిపారు. కాగా, వందేళ్ల కిందట ఈ ప్రాంత ప్రజలు కరువు, కాటకాలతో ఇబ్బందిపడుతూ తినడానికి తిండి కూడా లేని సమయాన చర్చి నిర్మాణం జరిగిందన్నారు. మెదక్ చర్చి నిర్మాణంలో పాల్గొన్న ప్రజలకు ప్రతిరోజూ భోజనం పెడుతూ పదేళ్లపాటు శ్రమించి అద్భుతమైన కట్టడాన్ని ఆవిష్కరించారని కొనియాడారు. పనికి ఆహార పథకం, ఉపాధి హామీ పథకాలకు ఈ చర్చి నిర్మాణ విధానమే బీజం వేసిందన్నారు. ఇలాంటి గొప్ప దేవాలయం దేశంలో ఉండడం మన తెలంగాణకే గర్వకారణమని ప్రశంసించారు. చర్చి అభివృద్ధికి తాము ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రం అభివృద్ధి వైపు నడిచేలా ప్రభువు, భక్తుల ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. మెదక్ జిల్లా అభివృద్ధి విషయంలోనూ తాము చిత్తశుద్ధితో ఉన్నామన్నారు.


ఏడుపాయల వనదుర్గకు పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

వనదుర్గ అమ్మవారి సన్నిధిలో రేవంత్..

మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని ఏడుపాయల వనదుర్గ అమ్మవారి సన్నిధిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఆలయానికి వచ్చిన తొలి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే కావడం గమనార్హం. కాగా, ప్రభుత్వం తరఫున అమ్మవారికి సీఎం పట్టువస్త్రాలు సమర్పించారు. అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేదమంత్రోచ్చారణల నడుమ ఆశీర్వచనాలు అందించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పలు అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను సీఎం ఆవిష్కరించారు. ఆయన వెంట టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు, నీలం మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయంతో వారి జీవితాల్లో మార్పు

- ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియామకమైన ట్రాన్స్‌జెండర్లపై సీఎం రేవంత్



హైదరాబాద్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ట్రాన్స్‌జెండర్లు కొంతమంది ట్రాఫిక్ పోలీసు ఫోర్స్ అసిస్టెంట్లుగా నియామకమై వెంటనే విధులు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా "తరతరాల నుంచి ట్రాన్స్‌జెండర్లను జనజీవన స్రవంతిలోకి తీసుకువచ్చే విషయం ఎవరూ ఆలోచించలేదు. వాళ్ల శక్తిని సమాజానికి మంచి చేసే విధంగా ఉపయోగించుకోవడానికీ ఆలోచన చేయలేదు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఒక అసాధారణ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్ పోలీసు ఫోర్స్ అసిస్టెంట్లుగా నియమించింది. అందుకోసం వారిని గుర్తించి, శిక్షణ ఇచ్చి ఆ పోస్టుల్లో నియమించింది. నియామకమైన మొదటి రోజు నుంచే వాళ్లు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించడం గర్వంగా ఉంది. వాళ్ల జీవితాల్లో వచ్చిన ఈ మార్పు విజయవంతం అయ్యేందుకు అందరం సహకరిద్దాం." అంటూ సీఎం రేవంత్ బుధవారం తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారు.

నేడు బెల్గాంకు సీఎం రేవంత్

- టీపీసీసీ చీఫ్ మహేశ్, మంత్రులు ఉత్తమ్, దామోదర కూడా

హైదరాబాద్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఏఐసీసీ అధ్యక్షుడిగా మహాత్మాగాంధీ ఎన్నికై వంద సంవత్సరాలు గడిచిన సందర్భంగా కర్నాటకలోని బెల్గాంలో రెండు రోజుల పాటు జరగనున్న సీడబ్ల్యూసీ సమావేశంలో పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి గురువారం వెళ్లనున్నారు. ఆయనతో పాటుగా టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీడబ్ల్యూసీ సభ్యులు దామోదర రాజనర్సింహ, వంశీచంద్‌రెడ్డి, మండలిలో కాంగ్రెస్ పక్ష నేత జీవన్‌రెడ్డి వెళ్లనున్నారు. ప్రత్యేక విమానంలో బెల్గాంకు వెళ్లనున్న వీరు.. రెండు రోజుల పాటు జరిగే సీడబ్ల్యూసీ, ఏఐసీసీ సమావేశాల్లో పాలు పంచుకుంటారు.

క్లీన్.. గ్రీన్ ఎనర్జీ పాలసీపై 3న వాటాదారులతో భేటీ

- 2030 నాటికి 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి: భట్టి



హైదరాబాద్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ క్లీన్.. గ్రీన్ ఎనర్జీ పాలసీ- 2024పై జనవరి 3వ తేదీన వాటాదారులతో భేటీ నిర్వహించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. 2030 నాటికి 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిని చేపట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఆయన చెప్పారు. దీనిపై చర్చించడానికి వీలుగా వాటాదారులతో భేటీ నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని అన్నారు. రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల వల్ల రానున్న ఏళ్లలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరగనున్న నేపథ్యంలో.. పర్యావరణానికి మేలు చేసే ఇంధన వినియోగాన్ని పెంచేలా క్లీన్.. గ్రీన్ ఎనర్జీ పాలసీకి తుది రూపు ఇవ్వనున్నామని తెలిపారు. జనవరి 3న జరిగే సమావేశంలో విదేశాల నుంచి పారిశ్రామికవేత్తలు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొంటారని భట్టి వెల్లడించారు.

సైనిక పాఠశాలల్లో 6, 9 తరగతులకు ప్రవేశాలు

న్యూఢిల్లీ, డిసెంబరు 25 : త్రివిధ దళాలకు అవసరమైన అధికారులను పాఠశాల స్థాయి నుంచే సిద్ధం చేసేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం సైనిక పాఠశాలలు ఏర్పాటు చేసింది. ఈ పాఠశాలల్లో 2025-26 సంవత్సరానికి ఆరు, తొమ్మిది తరగతుల ప్రవేశాల నోటిఫికేషన్(ఆల్ ఇండియా సైనిక్ స్కూల్స్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్-2025) వెలువడింది. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు నేషనల్ డిఫెన్స్ అకాడమీ, ఇండియన్ నేవీ అకాడమీ, ఇతర అకాడమీల్లో క్యాడెట్లుగా చేరతారు. ఏఐఎస్ఎస్ఈఈ దరఖాస్తులను ఆన్‌లైన్‌లోనే దాఖలు చేయాల్సి ఉంటుంది. దీనికి చివరి తేదీ 2025 జనవరి 13. పరీక్ష తేదీని తరువాత ప్రకటిస్తారు. ఆరో తరగతికి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 2025 మార్చి 31నాటికి 10 నుంచి 12 సంవత్సరాల మధ్యలో ఉండాలి. తొమ్మిదో తరగతిలో ప్రవేశాలకు వయస్సు 13 నుంచి 15 సంవత్సరాల మధ్యలో ఉండాలి. వీరు ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, కరీంనగర్, అనంతపురం, గుంటూరు, కడప, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరంలో పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. ఈ ప్రవేశ పరీక్షకు సంబంధించిన పూర్తి వివరాల కోసం https://exams.nta.ac.in/AISSEE/ వెబ్‌సైట్ చూడవచ్చు.

షా వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం

30న జరిగే నిరసనకార్యక్రమాలను జయప్రదం చేయండి: లెఫ్ట్

హైదరాబాద్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రాజ్యసభలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను తెలంగాణ వామపక్ష పార్టీలు ఖండించాయి. అమిత్‌షా వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని, దీనిపై ఇంత వరకు ప్రధానమంత్రి మోదీ స్పందించలేదని పేర్కొన్నాయి. డిసెంబరు 30న దేశవ్యాప్తంగా జరిగే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చాయి. అమిత్‌షా వ్యాఖ్యల పట్ల బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి.

కిశోర్‌బాబు అక్రమాలపై విచారణ జరిపించండి

- ముఖ్యమంత్రికి సమాచార శాఖ ఉద్యోగుల ఫిర్యాదు

హైదరాబాద్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎల్ఎల్ఆర్ కిశోర్‌బాబు అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలంటూ సమాచార శాఖ ఉద్యోగులు బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. సమాచార శాఖతోపాటు ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో గత 29 ఏళ్లుగా తిష్టవేసి అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఉద్యోగులు ఆరోపించారు. బీసీ(సీ) కులానికి చెందిన ఆయన నకిలీ ఎస్సీ సర్టిఫికెట్ సమర్పించి ఉద్యోగానికి ఎంపికయ్యారని, 2001 నుంచి 2019 వరకు ఉమ్మడి ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో చీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీరుగా రూ.400 కోట్ల అక్రమ ఆస్తులు కూడబెట్టారని వారు ఫిర్యాదు చేశారు. అక్రమ పదోన్నతులు పొంది ప్రస్తుతం అడిషనల్ డైరెక్టర్‌గా ఉన్న కిశోర్‌బాబు సమాచార శాఖ డైరెక్టర్ పదవికి పైరవీలు చేస్తున్నారని, ఈ పదవికి ఆయన పేరును ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవద్దని ఉద్యోగులు కోరారు. ఆయన అవినీతి, అక్రమాలు, తప్పుడు ఎస్సీ సర్టిఫికెట్‌పై సమగ్ర విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు.

తుమ్మిడిహెట్టికి దిగువన ప్రాణహిత బ్యారేజీ

12 కి.మీ. దూరంలో బోరేపల్లి వద్ద అనువైన స్థలం.. ముంపు ఉండదు.. అటవీ ప్రాంత సమస్య లేదు

- 165 టీఎంసీల నీటి లభ్యత అని అంచనా
- గ్రావిటీతో ఎల్లంపల్లి కాలువకు కలిపే చాన్స్
- కొత్తగా ప్రతిపాదన, పరిశీలిస్తున్న సర్కారు
- సమాంతరంగా మేడిగడ్డ, అన్నారం పునరుద్ధరణ!

హైదరాబాద్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకంలో తుమ్మిడిహెట్టికి ప్రత్యామ్నాయంగా మరో ప్రాంతం తెరమీదికి వచ్చింది. తుమ్మిడిహెట్టికి 12 కిలోమీటర్ల దిగువన చింతలమానేపల్లి మండలం బోరేపల్లి గ్రామంలో బ్యారేజీ నిర్మాణానికి అనువైన స్థలం ఉందని, ఈ ప్రాంతంలో బ్యారేజీ కడితే 165 టీఎంసీల నీటి లభ్యత ఉంటుందని గుర్తించారు. దీనిపై నీటిపారుదల శాఖ సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో)లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)గా పనిచేసిన ఓ అధికారి సర్వే చేసి, ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక అందించారు. ఈ ప్రాంతంలో బ్యారేజీ నిర్మాణంతో మహారాష్ట్రలో ముంపు ఉండదని, టోపోషీట్ ప్రకారం అటవీ ప్రాంతం కూడా లేదని, మొత్తం రాతి ప్రదేశం ఉండటంతో పునాదులకు సమస్య ఉండదని నివేదించారు. 165 టీఎంసీల నీటి లభ్యత ఉండగా 20 టీఎంసీలను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు అందించి... మిగిలిన 145 టీఎంసీలను శ్రీపాద ఎల్లంపల్లి సాగర్‌కు తరలించి.. ప్రాణహిత-చేవెళ్ల కింద (ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు కింద) ఆయకట్టుకు అందించే అవకాశం ఉందని పేర్కొన్నారు. బ్యారేజీతో పాటు 5 కిలోమీటర్ల అప్రోచ్ కెనాల్, అక్విడెక్ట్, పంప్‌హౌస్ నిర్మాణానికి కలిపి రూ.4300 కోట్ల దాకా వ్యయం అవుతుందని ప్రతిపాదించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో పోలిస్తే 50 శాతం కరెంట్ బిల్లులు ఆదా అవుతాయని, నిర్వహణ ఖర్చు కూడా గణనీయంగా తగ్గుతుందని పేర్కొన్నారు. 16 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే అవకాశం ఉంటుందని నివేదించారు. ఈ ప్రతిపాదనలపై చర్చించిన ప్రభుత్వం, సాధ్యాసాధ్యాలపై సీరియస్‌గా చర్చిస్తోంది. వ్యాప్కోస్ లేదా మరో సంస్థతో సర్వే చేయించాలని నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించినట్లు సమాచారం. బోరేపల్లి ప్రాంతంలో బ్యారేజీ కట్టేలా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని ఎమ్మెల్సీ కోదండరామ్ ఇటీవలే కాళేశ్వరం విచారణ కమిషన్‌ను కోరడం గమనార్హం.

అనుమతి సాధించి.. పక్కనపెట్టి...

తుమ్మిడిహెట్టి బ్యారేజీని ప్రాణహిత నదిపై 148 మీటర్ల ఎత్తుతో కట్టడానికి గత ప్రభుత్వం మహారాష్ట్ర నుంచి అనుమతి సాధించి... ప్రాజెక్టుల రీ-డిజైనింగ్‌లో పక్కనపెట్టింది. దీనికి వన్యప్రాణుల అభయారణ్యం, ఇతర సాంకేతిక అంశాలను కారణాలుగా చూపించింది. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కడితే 71.5 కిలోమీటర్ల దాకా గ్రావిటీతో నీరు ఎల్లంపల్లి సమీపం దాకా చేరేవి. తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి డ్యామ్ 116 కిలోమీటర్ల దూరం. అందులో 71.5 కిలోమీటర్ల దాకా (మైలారం గ్రామం దాకా) గ్రావిటీతో పంపులు లేకుండా ప్రాణహిత వచ్చి చేరుతుంది. అక్కడ చిన్న పంపులు ఏర్పాటు చేసి, నీటిని ఎత్తిపోస్తే... తక్కువ ఖర్చుతో ఎల్లంపల్లిలో నీరు పడుతుంది. ఎల్లంపల్లి కూడా 148 మీటర్ల ఎత్తులోనే ఉంది. అలా కాకుండా 100 మీటర్ల ఎత్తుతో 100 కిలోమీటర్ల దిగువన మేడిగడ్డ కట్టి, నీటిని ఎత్తిపోయడం విమర్శలకు తావిచ్చింది. తుమ్మిడిహెట్టి నుంచి మైలారం దాకా లైనింగ్ చేసిన కాలువ ఉంది. బ్యారేజీ కడితే చాలు నీళ్ల వడివడిగా ఎల్లంపల్లివైపు పరుగులుపెట్టే అవకాశం ఉంది. బోరేపల్లి దగ్గర రిజర్వాయర్ కట్టినా గ్రావిటీతో నీటిని ఎల్లంపల్లి కాలువకు అనుసంధానం చేసే అవకాశం ఉంటుందని ఇంజనీరింగ్ నిపుణులు పేర్కొంటున్నారు.

కాళేశ్వరం బ్యారేజీలు కూడా...

బోరేపల్లి బ్యారేజీ నిర్మాణంతో పాటు మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల పునరుద్ధరణ/మరమ్మతు పనులను ప్రభుత్వం ఏకకాలంలో చేపట్టే అవకాశాలున్నాయి. గత ప్రభుత్వం కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా కట్టిన మేడిగడ్డ 2023 అక్టోబరులో కుంగిపోగా అన్నారం, సుందిళ్లలో సీపేజీలు బయటపడిన సంగతి తెలిసిందే. ఇవి నిరర్థకంగా మారాయని కాంగ్రెస్ ప్రభుత్వం విమర్శిస్తున్న సంగతి తెలిసిందే. ఈ డిసెంబరులోపు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై నివేదిక ఇస్తామని జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్ఏ) ఇదివరకే స్పష్టం చేసింది. వానాకాలం తర్వాత జియో టెక్నికల్ పరీక్షలు చేసి, నివేదికలు ఇవ్వాలని కోరినా అధికారులు ఇవ్వకపోవడంతో ఎన్‌డీఎస్ఏ నివేదిక ఆలస్యమయ్యే అవకాశాలున్నాయి. ఈ బ్యారేజీల మరమ్మతులు చేయడానికి జూన్ నెలాఖరు దాకా అవకాశం ఉంటుంది. ఏటా జూలైలో గోదావరికి వరదలు వస్తాయి. మరమ్మతుల అనంతరం మేడిగడ్డ (16.17 టీఎంసీలు), అన్నారం(10.87 టీఎంసీలు), సుందిళ్ల (8.83 టీఎంసీలు) బ్యారేజీల్లో నీటిని నిల్వ చేసే ఎత్తును తగ్గించుకోవాలని ప్రభుత్వం ఇదివరకే సూత్రప్రాయంగా నిర్ణయించింది. వాస్తవానికి మూడు బ్యారేజీలతో పాటు మూడుచోట్ల ఉన్న పంప్‌హౌస్‌లకు రూ.27,637 కోట్ల దాకా ఖర్చు చేశారు. వీటిని వృథాగా పెట్టడం వల్ల నిర్వహణ ఖర్చు కూడా భారీగా ఉంటుందని గుర్తించిన ప్రభుత్వం... మూడింటినీ కూడా వాడుకోవాలనే యోచనతోనే ఉంది. బోరేపల్లి వద్ద బ్యారేజీ కోసం సర్వే అనంతరం విధాన నిర్ణయం తీసుకుంటే ఏకకాలంలో నాలుగు బ్యారేజీలు ప్రాణహిత-చేవెళ్లకు నీరు అందించనున్నాయి.



ప్రజాపాలన భేష్!

హామీలన్నీ అమలు చేసే దిశగా సాగుతున్న తెలంగాణ సర్కారు

- రవాణా, బీసీ సంక్షేమశాఖ కార్యక్రమాలకు ప్రత్యేక అభినందనలు: రాహుల్
- మంత్రి పొన్నం ప్రభాకర్‌కు లేఖ

హైదరాబాద్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అన్ని గ్యారెంటీలను నెరవేర్చే దిశగా ముందుకు సాగుతున్న తెలంగాణ ప్రభుత్వానికి లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అభినందనలు తెలిపారు. ప్రజాపాలన అద్భుతంగా కొనసాగుతోందన్నారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజాప్రభుత్వం ముందుకెళ్తున్న తీరు అభినందనీయమన్నారు. అలాగే రవాణా, బీసీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ ఆకాంక్షలను సాకారం చేసే దిశగా ప్రజాప్రతినిధులందరూ నిరంతరం కృషి చేస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు రాహుల్ లేఖ రాశారు. ప్రజా ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఇందిరమ్మ రాజ్యంలో, రాహుల్ మార్గదర్శకత్వంలో మరింత ముందుకు వెళతామంటూ ఇటీవల రాహుల్‌కు పొన్నం లేఖ రాశారు. ఆ లేఖకు స్పందనగా రాహుల్ మంత్రికి లేఖ రాసి, అభినందనలు తెలిపారు.

తక్కువ ధరకే ఇసుక, ఉక్కు, సిమెంటు

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ అందజేసిన ఓ నివేదికను ప్రభుత్వం పరిశీలిస్తోంది. గృహ నిర్మాణ సంస్థ ఇచ్చిన నివేదికలో.. వ్యక్తిగతంగా ఒక్కో ఇంటికి ఎంత సిమెంట్, ఇసుక, ఉక్కు అవసరం? రాష్ట్రవ్యాప్తంగా నిర్మించ తలపెట్టిన 4.5 లక్షల ఇళ్లకు ఎంత అవసరం? అనే వివరాలను వెల్లడించింది. 400 చదరపు అడుగుల్లో నిర్మించే ఒక్కో ఇంటికి 25 క్యూబిక్ మీటర్ల ఇసుక, 180-190 బస్తాల(9 మెట్రిక్ టన్నులు) సిమెంటు, 1.5 మెట్రిక్ టన్నుల ఉక్కు అవసరం అని అధికారులు ఆ నివేదికలో స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల ఇళ్ల నిర్మాణానికి 112 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక, 40.5 లక్షల మెట్రిక్ టన్నుల సిమెంట్, 68 లక్షల మెట్రిక్ టన్నుల ఉక్కు అవసరం అని పేర్కొన్నారు. ఇసుక ప్రభుత్వ పరిధిలోనే ఉండడంతో.. ఇందిరమ్మ ఇళ్లకు మార్కెట్ ధర కంటే తక్కువకే అందజేసేలా మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు ఆదేశాలు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. ఇక సిమెంట్ బస్తా ధర రూ.260కి పైగా, ఉక్కు ధర ఒక మెట్రిక్ టన్నుకు రూ.49 వేల నుంచి రూ.54 వేల వరకు ఉంది. ఈ రెండు అంశాలపై సంబంధిత కంపెనీలతో చర్చలు జరపాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ రంగ సంస్థల నుంచి ఉక్కు కొనుగోలు అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

నమూనా ఇళ్ల నిర్మాణం షురూ

రాష్ట్రంలోని 500 మండల కేంద్రాల్లో ఇందిరమ్మ ఇళ్ల నమూనాలను నిర్మించాలని సర్కారు నిర్ణయించిన విషయం తెలిసిందే.! రూ.5 లక్షలతో.. 400 చదరపు అడుగుల్లో ఎలాంటి ఇంటిని నిర్మించుకోవాలనేదానిపై లబ్ధిదారుల్లో అవగాహన కల్పించేందుకు ఈ ఇళ్లను నిర్మిస్తోంది. ఈ పథకాన్ని పర్యవేక్షించే గృహ నిర్మాణ సంస్థ అసిస్టెంట్ ఇంజనీర్లు(ఏఈ) ఈ ఇళ్లను తమ కార్యాలయాలుగా వినియోగించుకుంటారు. 500 మండలాల్లో 474 చోట్ల స్థలాల ఎంపిక జరగ్గా.. ఆదిలాబాద్, భద్రాద్రి-కొత్తగూడెం, మహబూబాబాద్, కొమురంభీం-ఆసిఫాబాద్, నాగర్‌కర్నూల్, ఖమ్మం, నిజామాబాద్, వికారాబాద్ జిల్లాల్లోని 23 చోట్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ఈ నమూనా ఇళ్ల వద్దే.. నిర్మాణ ఖర్చు ఎంత అవుతుందనే వివరాలను ప్రదర్శించనున్నారు.

80.5 లక్షల దరఖాస్తులు

ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా.. ఇందిరమ్మ ఇళ్లకు రాష్ట్రవ్యాప్తంగా 80.50 లక్షల దరఖాస్తులు అందాయి. వీటిల్లో 69,83,895 దరఖాస్తులు గ్రామీణ ప్రాంతాల నుంచి, 10,70,659 జీహెచ్ఎంసీ పరిధి నుంచి వచ్చాయి. వీటిల్లో గ్రామీణ ప్రాంతాల్లోని 30.83 లక్షలు, జీహెచ్ఎంసీ పరిధిలో 74,380 దరఖాస్తుల పరిశీలన పూర్తయింది. పూర్తయిన దరఖాస్తుల పరిశీలనకు సంబంధించి 9,19,676 మంది వివరాలను ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో నమోదు చేశారు. నల్లగొండ నుంచి అత్యధికంగా 4,31,831 దరఖాస్తులు రాగా.. ఆ తర్వాతి స్థానాల్లో రంగారెడ్డి జిల్లా(3,75,013), ఖమ్మం(3,57,869), సూర్యాపేట(3,09,062), నిజామాబాద్(3,20,831), సంగారెడ్డి(3,18,775) జిల్లాలు ఉన్నాయి.

హైడ్రాతో రియల్ ఎస్టేట్ తగ్గలేదు

2024 ప్రథమార్థంలో.. రియల్‌ఎస్టేట్ ఐదేళ్ల గరిష్ఠానికి చేరిక.. ఇళ్ల విక్రయాల విలువ రూ.58వేల కోట్లు

- వృద్ధి చెందుతున్న మార్కెట్లలో హైదరాబాద్
- హైడ్రాతో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏలకు పెరిగిన దరఖాస్తులు
- వచ్చే ఏడాది హెచ్‌సిటీలో భారీ ప్రాజెక్టులు
- 2025 నవంబరు వరకు డ్రాఫ్ట్ మాస్టర్‌ప్లాన్
- పది రోజుల్లో ఎలివేటెడ్ కారిడార్ పనులు ప్రారంభం
- ఈ నెలలోనే ఆరాంఘర్ ఫ్లైఓవర్ అందుబాటులోకి
- చిట్‌చాట్‌లో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కమిషనర్లు

జూలై-నవంబరు నెలల్లో హెచ్ఎండీఏకు వచ్చిన దరఖాస్తులు, వాటి పరిష్కారం ఇలా..

	దరఖాస్తులు			పరిష్కారాలు		
వివిధ దరఖాస్తులు	2023	2024	పెరుగుదల శాతం	2023	2024	పెరుగుదల శాతం
లేఅవుట్ అనుమతులు	1326	1920	45	2065	2563	24
భవన నిర్మాణ అనుమతులు	756	1061	40	1196	1414	18
ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల జారీ	467	560	20	690	811	18
హౌసింగ్, తుది లేఅవుట్లు	103	299	190	179	335	87


మీడియాతో చిట్‌చాట్ చేస్తున్న జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కమిషనర్లు ఇలంబర్తి, సర్ఫరాజ్ అహ్మద్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు25 (ఆంధ్రజ్యోతి): హైడ్రా వల్ల హైదరాబాద్‌లో రియల్‌ఎస్టేట్ తగ్గిందనడం అవాస్తవమని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ స్పష్టం చేశారు. నిజానికి దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న రియల్‌ఎస్టేట్ మార్కెట్లలో ఒకటిగా హైదరాబాద్ నిలిచిందని వివరించారు. ఈ ఏడాది ప్రథమార్థంలో ఇళ్ల విక్రయాల విలువ రూ.58,481 కోట్లుగా నమోదైందని, ఇది గడిచిన అయిదేళ్ల గరిష్ఠమని పేర్కొన్నారు. గత ఏడాదితో పోలిస్తే.. ఈ సంవత్సరం రియల్‌ఎస్టేట్ పెరిగిందని.. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏలకు వచ్చిన దరఖాస్తులే ఇందుకు నిదర్శనమని స్పష్టం చేశారు. బుధవారం వారు మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. "హెచ్‌సిటీ ప్రాజెక్టు కింద వచ్చే ఏడాది ప్రభుత్వం ప్రతిపాదించిన మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు-- ఎస్ఆర్‌డీపీ ఫ్లైఓవర్లు, నాలాల విస్తరణ, అండర్‌పాస్‌ల నిర్మాణం, కూడళ్ల అభివృద్ధి, రోడ్ల విస్తరణ రియల్‌ఎస్టేట్ రంగానికి ఊతమిస్తాయని భావిస్తున్నాం. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏల్లో భవన నిర్మాణ అనుమతులను వేగవంతం చేసేందుకు ప్రణాళిక విభాగం అధికారులు ఎప్పటికప్పుడు సమావేశమవుతున్నారు. భవన నిర్మాణాలకు సంబంధించి ఈ ఏడాది నవంబరు వరకు జీహెచ్ఎంసీలో 21,346కు గాను.. 20,240 దరఖాస్తులను పరిష్కరించాం. గత ఏడాదితో పోలిస్తే.. 20% అధికంగా దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల పరిష్కారం ఈ ఏడాది 40% మేర వృద్ధిని నమోదు చేసింది. హెచ్ఎండీఏలో లేఅవుట్, భవన నిర్మాణాలు, ఆక్యుపెన్సీతోపాటు వివిధ అనుమతుల దరఖాస్తులు ఈ ఏడాది 45% పెరిగాయి. దరఖాస్తుల పరిష్కారాలు కూడా 24% మేర పెరుగుదలను నమోదు చేసుకున్నాయి. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించడంలో దేశంలోనే హైదరాబాద్ ముందంజలో ఉంది. ఈ ఏడాది రికార్డు స్థాయిలో 25 కోట్ల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్ లీజింగ్ నమోదైంది. గత ఏడాది సగటు త్రైమాసిక లీజు ఒప్పందాలతో పోలిస్తే.. ఇది 11 శాతం అధికం" అని వారు వివరించారు. ఆరాంఘర్ ఫ్లైఓవర్ పనుల్లో కొంత ఆలస్యం జరిగిందని, ఈ నెలలో ప్రారంభిస్తామని వెల్లడించారు. మరో ఐదు ప్రాంతాల్లో ఫ్లైఓవర్ల పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. "దీంతోపాటు.. హెచ్‌సిటీ కింద రూ.7,032 కోట్లతో 38 ప్రాజెక్టులు చేపడతాం. సీఆర్ఎంపీ-2 కింద రూ.3925 కోట్లతో 1,143 కిలోమీటర్ల మేర 934 రోడ్లను నిర్మించేందుకు చర్యలు చేపట్టాం. ఎస్ఎన్‌డీపీ-2 కింద రూ.667కోట్లతో 40 పనులను చేపడతాం. ఎన్‌డీఎంఎస్ కింద రూ.291 కోట్లు రానుండడంతో 41 పనులను చేపట్టేందుకు అంచనాలను రూపొందించాం" అని వ్యాఖ్యానించారు.

నవంబరులోగా మాస్టర్‌ప్లాన్ ముసాయిదా

జీహెచ్ఎంసీతోపాటు హెచ్ఎండీఏ పరిధిలో.. 2050 వరకు భవిష్యత్తు అవసరాల అనుగుణంగా ఒకే మాస్టర్‌ప్లాన్ రూపొందించేందుకు చర్యలు చేపట్టామని, వచ్చే ఏడాది నవంబరులోగా ముసాయిదా మాస్టర్‌ప్లాన్‌ను తీసుకొస్తామని ఇలంబర్తి, సర్ఫరాజ్ అహ్మద్ వెల్లడించారు. టీజీబీపాస్ స్థానంలో తీసుకొచ్చిన బిల్డ్‌నౌను జీహెచ్ఎంసీలో త్వరలో అమలు చేస్తామని, ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. సికింద్రాబాద్‌లోని ఎలివేటెడ్ కారిడార్లు, ఫోర్త్ సిటీకి ఔటర్ రావిర్యాల-13 ఎగ్జిట్ నుంచి గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఇలంబర్తి, సర్ఫరాజ్ తెలిపారు. ఎలివేటెడ్ కారిడార్లకు రక్షణ శాఖ నుంచి 124 ఎకరాల భూములకు క్లియరెన్స్ వచ్చిందని, ఎయిర్‌పోర్టు అథారిటీ నుంచి మరో 24 ఎకరాలకు క్లియరెన్స్ రావాల్సి ఉందన్నారు. రెవెన్యూ అధికారులు 70 ఎకరాల వరకు ప్రైవేటు స్థలాల సేకరణను చేపట్టారని, ఈ ప్రక్రియ వచ్చే ఏడాది జూలై వరకు పూర్తవుతుందని తెలిపారు. మరో పది రోజుల్లో ఎలివేటెడ్ కారిడార్ల పనులను చేపడుతామన్నారు.

నల్లగొండ నవజాత శిశు కేంద్రానికి అధునాతన వైద్య పరికరాలు: మంత్రి కోమటిరెడ్డి


మాతా శిశు సంరక్షణ కేంద్రంలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రిలోని నవజాత శిశువు సంరక్షణ కేంద్రానికి కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.30 లక్షల వ్యయం కలిగిన వైద్య పరికరాలను అందించినట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రిలోని మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మాతా శిశు సంరక్షణ కేంద్రానికి అధునాతన వైద్య పరికరాలు అందించడంతో పాటు ఇంకా అవసరం ఉన్న సౌకర్యాలను 24గంటల్లో ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. హైదరాబాద్ తర్వాత అతి పెద్ద జనాభా కలిగిన నల్లగొండ జిల్లా కేంద్రంలో ప్రతీ రోజూ 1500 మంది అవుట్ పేషెంట్లు, 1000 మందికి పైగా ఇన్ పేషెంట్లు వస్తున్నారని తెలిపారు. ప్రతీ నెలా సుమారు 600 ప్రసవాలు జరుగుతాయని వెల్లడించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సందర్భంలోనే నవజాత శిశు సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశానని, తిరిగి ప్రస్తుతం కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా అధునాతన పరికరాలు అందజేసినట్లు చెప్పారు.

జనవరిలో మరో 50 ఎలక్ట్రిక్ బస్సులు!

- హయత్‌నగర్ డిపో నుంచి నడిపే ఏర్పాట్లు
- 6 నెలల్లో 300 ఈవీ బస్సులు తీసుకురావాలని ఆర్టీసీ లక్ష్యం
- ఇప్పటికే గ్రేటర్‌లో 190 ఈవీ బస్సులు



హైదరాబాద్ సిటీ, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి నాటికి గ్రేటర్‌లో మరో 50 ఎలక్ట్రిక్ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులను అందుబాటులోకి తెచ్చేందుకు ఆర్టీసీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇప్పటికే గ్రేటర్‌లో 190 ఈవీ బస్సులను ఆర్టీసీ నడుపుతోంది. మహాలక్ష్మి ఉచిత ప్రయాణంతో సిటీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ రెట్టింపయ్యింది. ఈ నేపథ్యంలో ఆర్డినరీ బస్సులపై ఓవర్ లోడ్ పడుతున్న కారణంగా గ్రేటర్‌లో ఎలక్ట్రిక్ బస్సులు పెంచడంపై టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక దృష్టిసారించింది. డిసెంబరులోనే 50 ఎలక్ట్రిక్ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు రోడ్లపైకి తీసుకురావాలనుకున్నా పలు కారణాలతో ఆలస్యం అయ్యింది. దాంతో జనవరిలో హయత్‌నగర్ డిపో నుంచి 50 మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులను అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో డ్రైవర్లకు రూట్ మ్యాప్‌లు చూపిస్తూ క్షేత్రస్థాయిలో డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్నారు. గ్రేటర్‌జోన్ పరిధిలో రాబోయే 6 నెలల్లో 300 ఎలక్ట్రిక్ బస్సులు తీసుకురావాలనే లక్ష్యంగా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. 2025 డిసెంబర్ నాటికి గ్రేటర్ పరిధిలో మొత్తం 1500 ఎలక్ట్రిక్ బస్సులు రోడ్లపైకి తెచ్చే లక్ష్యంగా ఆర్టీసీ ముందుకు వెళ్తుందని అధికారులు చెబుతున్నారు. ఈవీ బస్సులు పెరుగుతున్న క్రమంలో గ్రేటర్‌జోన్ పరిధిలోని 25 బస్ డిపోల్లో ఈవీ చార్జింగ్ స్టేషన్లను ఆర్టీసీ ఏర్పాటు చేస్తోంది.



ఢిల్లీలోని వాజపేయి సమాధి 'సదైవ్ అటల్' వద్ద నివాళి అర్పిస్తున్న చంద్రబాబు

జాతి గర్వించదగిన నేత వాజపేయి: ఏపీ సీఎం చంద్రబాబు

- సదైవ్ అటల్ వద్ద వాజపేయికి ఘననివాళి

న్యూఢిల్లీ, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): భారతజాతి గర్వించదగిన నేత వాజపేయి అని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కొనియాడారు. వాజపేయి శత జయంతి సందర్భంగా బుధవారం ఉదయం వాజపేయి సమాధి 'సదైవ్ అటల్' వద్ద రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని మోదీ, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో కలిసి సీఎం చంద్రబాబు ఘననివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీఎం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'నేషన్ ఫస్ట్' అని ఎప్పుడూ భావించే వాజపేయితో కలిసి పనిచేసిన అనుభూతి తనకు చిరకాలం గుర్తుండిపోతుందన్నారు. దేశం గురించి వాజ్‌పేయి ఆలోచించే తీరు విలక్షణమైనదని, దానికి ఆధునికత, సాంకేతికత జోడించాలని తాను సూచించినప్పుడు, సంస్కరణల గురించి ప్రతిపాదనలు చేసినప్పుడు ఆయన స్పందించిన తీరును ఎన్నటికీ మరచిపోలేనని అన్నారు. వాజపేయితో తాను దిగిన ఫొటోను చంద్రబాబు పంచుకున్నారు.

కల్తీ మిర్చి విత్తనాలతో నష్టంపై నివేదిక ఇవ్వండి

- వ్యవసాయశాఖ డైరెక్టర్‌కు వ్యవసాయ కమిషన్ చైర్మన్ లేఖ

హైదరాబాద్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం కేలోత్ తండాలో మిర్చి సాగు చేసిన రైతులు నకిలీ విత్తనాల తో నష్టపోయారని, దీనిపై సంబంధిత అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపించి సమగ్ర నివేదిక సమర్పించాలని వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి.. వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపికి బుధవారం లేఖ రాశారు. కేలోత్ తండాకు చెందిన నలుగురు గిరిజన రైతులు కొంత భూమిని కౌలుకు తీసుకొని స్థానిక సాయికృష్ణ సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంలో విత్తనాలు కొని మిర్చి పంట సాగు చేసినట్లు పేర్కొన్నారు. పెట్టుబడి పెట్టి, శ్రమించి మిర్చితోటను పెంచితే చివరికి కల్తీ విత్తనాలుగా తేలి రైతులు నష్టపోయారని కోదండరెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై తక్షణమే విచారణ చేపట్టి నివేదికివ్వాలని డైరెక్టర్ గోపిని కోదండరెడ్డి కోరారు. విత్తనాలకు సంబంధించిన బిల్లులు కూడా లేఖతో జతపరిచారు.

క్రిస్మస్ వేడుకల్లో అపశ్రుతి

- శిలువ జెండా పైపునకు విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతం
- యువకుడు మృతి, నలుగురికి గాయాలు
- సంగారెడ్డి జిల్లాలో ఘటన



సోపాన్ (ఫైల్)


కల్హేర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకల్లో సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం ఖాజాపూర్ గ్రామంలో అపశ్రుతి జరిగింది. చర్చి ఎదుట ఉన్న శిలువ జెండా పైపును పెయింట్ వేసేందుకు తీస్తుండగా, పైన ఉన్న విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. ఖాజాపూర్ గ్రామంలోని చర్చిని క్రిస్మస్ వేడుకలకు ముస్తాబు చేస్తున్నారు. అదే గ్రామానికి చెందిన రాసాలం సోపాన్ (19) మరికొందరు కలిసి చర్చి ఎదుట ఉన్న శిలువ జెండా ఇనుప పైప్‌ను పెయింట్ వేసేందుకు తీస్తున్నారు. ఆ సమయంలో పైన ఉన్న విద్యుత్ తీగలు పైప్‌నకు తగిలి విద్యుదాఘాతంతో సోపాన్ అక్కడిక్కడే మృతిచెందగా, పైపును పట్టుకుని ఉన్న మరో నలుగురు గాయపడ్డారు. గ్రామస్థులు గాయపడిన వారిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. సోపాన్ తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మన రైల్వే ఖ్యాతి

ఆ సేతు హిమాచలం!

కన్యాకుమారి నుంచి నేరుగా కశ్మీర్‌కు రైలు.. ఉధంపూర్‌-శ్రీనగర్‌-బారాముల్లా ప్రాజెక్టు పూర్తి

- 37వేల కోట్ల వ్యయం.. నిర్మాణంలో ఇంజనీరింగ్ అద్భుతాలు
- ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన చినాబ్ ఆర్చిస్టీల్ బ్రిడ్జి
- 725మీ మేర అంజీఘాట్ కేబుల్ బ్రిడ్జి
- 119 కి.మీలలో 38 సొరంగాలు.. 934 వంతెనలు
- జనవరి 26న ప్రారంభించనున్నమోదీ




హైదరాబాద్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టాలపై తానే పరుగులు తీస్తున్నా చెట్టూ చేమా వెనక్కు పరుగెడుతున్నట్లుగా అనుభూతినిచ్చే రైలు.. మరింత ప్రకృతి రమణీయతను తనలో ఇముడ్చుకొని, ప్రయాణికులకు పంచుతూ వారికి ఆ ప్రయాణాన్నే మరిచిపోలేని గొప్ప జ్ఞాపకంగా మిగల్చనుంది. కొండాకోనల్లోంచి.. లోయల్లోంచి.. సొరంగాల్లోంచేకాదు.. నీలాకాశ మీదుగా ప్రయాణిస్తున్నామా? మేఘాల్లో తేలిపోతున్నామా? అనిపించేలా భారీ కొండల మధ్య ఉన్న వంతెనపై, తీగల వంతెనపై రైలు చుక్ చుక్‌మంటూ పరుగులు పెడుతుంటే ఆ ప్రకృతి రమణీయత అస్వాదించినవారికి ఆస్వాదించినంత! ఇదంతా కన్యాకుమారి నుంచి కశ్మీర్ దాకా వేసిన రైల్వే లైన్ గురించే! జనవరి 26న ప్రధాని మోదీ ఈ ట్రాక్‌పై రైళ్ల రాకపోకలను ప్రారంభించనున్నారు. ప్రపంచంలోనే ఎత్తయిన ఆర్చి స్టీల్ బ్రిడ్జి రికార్డును ఉధంపూర్-శ్రీనగర్, బారాముల్లా లింక్ ప్రాజెక్టు (యూఎస్‌బీఆర్‌ఎల్) సొంతం చేసుకుంది. ఈ ప్రాజెక్టు ఇప్పటిది కాదు. 25 ఏళ్ల క్రితం నాడే పురుడుపోసుకుంది. కశ్మీర్‌లో పర్యాటకం మరింత పెంచేలా.. కశ్మీర్ లోయ నుంచి దేశ నలుమూలలకు వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలను మరింత విస్తృతం చేసే సంకల్పంతో 1999 యూఎస్‌బీఆర్‌ఎల్ ప్రాజెక్టును ప్రతిపాదించారు. ఇందుకు రూ.37వేల కోట్లు అవసరపడతాయని అంచనా వేశారు. ఉధంపూర్ నుంచి బారాముల్లా వరకు 356 కిమీ రైలు మార్గంలో అనేక విశిష్టతలు, ప్రత్యేకతలు ఉండటంతో 2002లో యూఎస్‌బీఆర్‌ఎల్‌ను జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఈ క్రమంలో ఎత్తైన కొండల మధ్య మొత్తం 119 కిమీ పొడవులో 38 సొరంగాలు తవ్వి ట్రాక్‌ను నిర్మించారు. అలాగే దాదాపుగా 13 కి.మీ మేర 934 వంతెనలున్నాయి. చినాబ్ స్టీల్ ఆర్చి బ్రిడ్జి, అంజీఘాట్ కేబుల్ బ్రిడ్జిల నిర్మాణాలు ఇంజనీరింగ్ అద్భుతాలుగా రైల్వే వర్గాలు పరిగణిస్తున్నాయి. అత్యంత ఎత్తైన కాశ్మీర్ లోయలు, నదీప్రవాహం, పర్వత శ్రేణుల్లో రైల్వే ట్రాక్ నిర్మాణాన్ని రైల్వే బోర్డు అధికారులు సవాల్‌గా స్వీకరించి పనులు ప్రారంభించి సాహసోపేతంగా పూర్తి చేయడం విశేషం. ప్రపంచంలోనే అద్భుత నిర్మాణాలుగా చరిత్రకెక్కనున్న రైల్వే వంతెనల నిర్మాణాల ప్రత్యేకతను, నిర్మాణ సందర్భంగా ఎదురైన సవాళ్లను తెలియజేసేందుకు రైల్వే బోర్డు అధికారులు మీడియా ప్రతినిధుల బృందాన్ని తీసుకువెళ్లారు. రెండు రోజుల పాటు జమ్ము, శ్రీనగర్ ప్రాంతాల్లో పర్యటించి చినాబ్ నదిపై నిర్మించిన స్టీల్ ఆర్చిబ్రిడ్జి, అంజీఘాట్ వద్ద నిర్మితమైన కేబుల్ బ్రిడ్జి, రియాసీ రైల్వే స్టేషన్‌లను మీడియా ప్రతినిధులు పరిశీలించారు.

ఈఫిల్ టవర్‌కన్నా 35 మీ ఎత్తులో చినాబ్ వంతెన

హిమాచల్‌ప్రదేశ్ నుంచి పంజాబ్, జమ్మూ మీదుగా పాకిస్థాన్ వైపు ప్రవహించే చినాబ్ నదీ గర్భంపై నిర్మించిన చినాబ్ రైల్వే స్టీల్ బ్రిడ్జి మన దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన బ్రిడ్జిగా రైల్వే వర్గాలు చెబుతున్నాయి. ఈఫిల్ టవర్ కంటే 35 మీటర్ల ఎక్కువ ఎత్తులో నిర్మించిన చినాబ్ బ్రిడ్జి నిర్మాణ పనులను 2013 ఆగస్టులో ప్రారంభించారు. కౌరి-బక్కల్ స్టేషన్ల మధ్య చినాబ్ నదీ ప్రవాహంపై 359 మీటర్ల ఎత్తు, 1315 మీటర్ల పొడవుతో ప్రతిపాదించిన బ్రిడ్జి నిర్మాణ పనుల కోసం సుమారు 28,660 మెట్రిక్ టన్నుల స్టీల్‌ను వినియోగించారు. నదీ గర్భంపై 725 మీటర్ల పొడవులో ప్రధాన వంతెన ఉంటుంది. సుమారు 120 ఏళ్ల పాటు రైళ్ల రాకపోకలకు ఉపయోగపడేందుకు, టెర్రరిస్టులు దాడిచేసినా తట్టుకొని నిలబడేలా దీనిని నిర్మించారు. గంటకు 260 కి.మీ వేగాన్ని కూడా ఈ వంతెన తట్టుకోగలదు. ఈ నిర్మాణం కోసం రూ.1486 కోట్లు వ్యయం చేశారు.

అంజిఘూట్ కేబుల్ బ్రిడ్జి



ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైల్వేలింక్ ప్రాజెక్ట్‌లో మరోముఖ్యమైన నిర్మాణం అంజిఘూట్ కేబుల్ బ్రిడ్జి. జమ్మూ నుంచి సుమారు 80 కి.మీ దూరంలో కాట్రా- బనిహాల్ సెక్షన్ల మధ్య పర్వత ప్రాంతంలో అంజి నదిపై 725 మీటర్ల పొడవులో నిర్మించారు. ప్రధానమైన బ్రిడ్జి 473 మీటర్లు కాగా బ్రిడ్జి నుంచి 196 మీటర్ల ఎత్తులోని పైలాన్‌పై నుంచి 96 కేబుళ్లను బ్రిడ్జికి అనుసంధానం చేశారు. దేశంలోనే మొట్టమొదటి త్రీ లేయిడ్ కేబుల్ వంతెనగా రైల్వే వర్గాలు పేర్కొన్నాయి. సముద్ర మట్టానికి 331 మీటర్ల ఎత్తులో ఉన్న కేబుల్ బ్రిడ్జి 213 కి.మీ వేగంగా గాలి, వరదలు వచ్చినప్పటికీ తట్టుకునే విధంగా నిర్మించారు. సింగిల్ రైల్వే ట్రాక్‌తో నిర్మించిన వంతెనకు 3.75 మీటర్ల వెడల్పులో సర్వీస్ రోడ్‌ను ఏర్పాటు చేశారు. ఇరువైపులా 1.5 మీటర్ల వెడల్పుతో ఫుట్‌పాత్‌ను విస్తరించారు. మొదట ఇక్కడ స్టీల్ ఆర్చి శైలిలో బ్రిడ్జి నిర్మించాలని ప్రతిపాదించగా పర్వత ప్రాంతంతో పాటు నదీ తీర ప్రాంతంలో పునాదికి అవసరమైన గట్టిదనం లేకపోవడంతో కేబుల్ బ్రిడ్జిని నిర్మించినట్లు అధికారులు పేర్కొన్నారు.



ముసురుకున్న మేఘాలు!

- కొన్నిచోట్ల ముసురు.. చాలాచోట్ల చిరుజల్లులు
- అక్కడక్కడ కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- నేడు, రేపు మోస్తరు వర్షాలు

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్

రాష్ట్రంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో ఆకాశం నలువైపులా మేఘాలు ముసురుకోవడంతో పగలంతా చల్లబడింది. కొన్నిచోట్ల ముసురు పడగా.. చాలాచోట్ల చిరుజల్లులు కురిశాయి. దీంతో అక్కడక్కడ కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. బుధవారం ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాలతో పాటు హైదరాబాద్‌లోనూ అక్కడక్కడ వానలు కురిశాయి. వరంగల్ జిల్లా చెన్నారావుపేటలో అత్యధికంగా 3.3, మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటలో 2.1 ములుగు జిల్లా తాడ్వాయిలో 1.9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మహబూబాబాద్ జిల్లాలో మంగళవారం రాత్రి నుంచే ముసురు పడుతోంది. డోర్నకల్, చిన్నగూడూరు మండలాల్లోని పలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటా వేసి 15 రోజులు అవుతున్నప్పటికీ లారీలు రాకపోవడంతో తరలించలేదు. దీంతో కొన్ని బస్తాలు తడిసిపోయాయి. భూపాలపల్లి జిల్లాలో ఇంకా 50 వేల టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మగ్గుతోంది. వర్షాలు పడుతుండటంతో సరిపడా టార్పాలిన్ కవర్లు లేక ఏం చేయాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పలు మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. కొన్నిచోట్ల చేలల్లో పత్తి తడవడంతో ధర తగ్గే అవకాశముందని రైతులు వాపోతున్నారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు, యాచారం, మొయినాబాద్, ఇబ్రహీంపట్నం మండల పరిధిలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తుంపర్ల వర్షం పడింది. వికారాబాద్ జిల్లాలో వర్షం లేనప్పటికీ వాతావరణం చల్లబడింది. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్, పోచారం మునిసిపాలిటీల పరిధిలో మోస్తరు వర్షం కురిసింది. ఇక గురు, శుక్రవారాల్లో కూడా ఆకాశం మేఘావృతమై ఉంటుందని.. కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. నల్లగొండ, సూర్యాపేట, నాగర్‌కర్నూల్, గద్వాల, యాదాద్రి భువనగిరి, జనగామ, మంచిర్యాల జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు పడే అవకాశముందని వెల్లడించింది. రాత్రిపూట ఉష్ణోగ్రతలు 16-21 డిగ్రీల మధ్య నమోదవుతాయని పేర్కొంది.



బేగంపేట విమానాశ్రయంలో డీకే శివకుమార్‌కు స్వాగతం పలుకుతున్న మహేశ్‌కుమార్‌గౌడ్

సీఎం రేవంత్‌కు క్రిస్మస్ శుభాకాంక్షలు

హైదరాబాద్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) :క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసిన నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహ, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. కాగా.. ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు బుధవారం హైదరాబాద్‌కు వచ్చిన కర్నాటక పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌ను టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ కలిశారు. శంషాబాద్ విమానాశ్రయంలో ఆయనకు స్వాగతం పలికారు.

క్రీస్తు బోధించిన శాంతి ఆచరణీయం : మహేశ్‌కుమార్‌గౌడ్

ప్రేమ, త్యాగం, దాతృత్వం, కరుణ కలయికే జీవితమంటూ మానవాళికి క్రీస్తు మహోన్నత సందేశం ఇచ్చారని, ఆయన బోధించిన శాంతి, సహనం, ఔదార్యం.. ఆచరణీయమని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. సత్యపథం వైపు నడిచేలా మానవాళికి ఆయన మార్గ నిర్దేశం చేశారన్నారు. రాష్ట్ర ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

కల్వరిటెంపుల్‌కు 4 లక్షల మంది భక్తులు.. పలు చర్చిల్లో వైభవంగా పండుగ నిర్వహణ

- హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఆగమాగం
- కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు



మియాపూర్ కల్వరి టెంపుల్ వద్ద పోటెత్తిన భక్తులు

మియాపూర్, రెజిమెంటల్‌బజార్, హైదరాబాద్, కేపీహెచ్‌బీకాలనీ/హైదరాబాద్ సిటీ, డిసెంబరు25(ఆంధ్రజ్యోతి): ఏసు క్రీస్తు జన్మదినం క్రిస్మస్ పండుగను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. ఎక్కడ చూసిన క్రిస్మస్ సందడే కనిపించింది. మంగళవారం రాత్రి నుంచే క్రిస్మస్ ప్రార్థనలతో చర్చిలు మార్మోగిపోయాయి. పండుగ నేపథ్యంలో ఆసియా ఖండంలోనే అతిపెద్ద చర్చిగా పేరుగాంచిన మియాపూర్‌లోని కల్వరిటెంపుల్‌కు బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి సుమారు 4లక్షల మంది భక్తులు వచ్చారు. భక్తులకు బ్రదర్ డాక్టర్ సతీష్‌కుమార్ క్రిస్మస్ సందేశం అందించారు. ఇక సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్ బసలికా, సీఎస్ఐ వెస్లీ, మిలీనియం మెథడిస్ట్, సెంటినరీ బాప్టిస్ట్, గుడ్ న్యూస్ చర్చిలలోనూ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి.

వాహనదారులకు నరకయాతన:

క్రిస్మస్ పండుగ వేళ నగరంలో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఆగమాగమయ్యారు. క్రిస్మస్ ప్రార్థనల సందర్భంగా కొన్ని ప్రాంతాల్లో వాహనాల రద్దీ పెరిగి కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. మరోవైపు సెలవు రోజు కావడంతో నగరవాసులు ఆహ్లాదం కోసం బయటకు రావడంతో కీలక జంక్షన్‌లు, షాపింగ్ మాల్‌లు, సినిమాహాల్‌లు, పర్యాటక ప్రాంతాలు కిటకిటలాడాయి. మియాపూర్‌లోని కల్వరిటెంపుల్ వచ్చే భక్తులు దృష్టిలో ఉంచుకుని పోలీసులు 70 మందిని ఏర్పాటు చేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. కానీ ఇతర ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులు విఫలమయ్యారు. దాంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చందానగర్, మియాపూర్, మదీనగూడ, ఏఎంబీ మాల్, సైబర్‌టవర్, హైటెక్ సిటీ, అయ్యప్ప సొసైటీ, గచ్చిబౌలి, రాయదుర్గం, సైబర్‌టవర్, ఐమ్యాక్స్, లులు మాల్, నెక్సస్ మాల్ వదవద్ద భారీగా వాహనాలు నిలిచిపోయాయి. మియాపూర్ నుంచి గచ్చిబౌలి చౌరస్తాకు 15 నిమిషాల ప్రయాణానికి గంటకు పైగా సమయం పట్టిందంటే ట్రాఫిక్ ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

కేసీఆర్‌ను కలిసిన క్రిస్టియన్ జేఏసీ నాయకులు

క్రిస్మస్ సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ రాజీవ్ సాగర్‌తో పాటు బిషప్ నెహేమియా, క్రిస్టియన్ జేఏసీ నాయకులు సోలోమన్ రాజు, క్యాథలిక్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ లియో లూయిస్ తదితరులు కలిశారు.



కొండాపూర్ ఏఎంబీ మాల్ వద్ద భారీగా ట్రాఫిక్

పదోన్నతులివ్వరు.. నియామకాలూ చేపట్టరు!

బోధనాస్పత్రుల్లో పదేళ్లుగా డైటీషియన్లే లేరు

- రోగులకు అందని నాణ్యమైన ఆహారం
- ఇటీవల ఓ బోధనాస్పత్రిలో పురుగుల అన్నం
- 34 ఆస్పత్రుల్లో ఖాళీగా డైటీషియన్ పోస్టులు
- పదోన్నతులపై డీఎంఈ చిన్నచూపు
- కోర్టుకెక్కిన బాధితులు.. అయినా పట్టని వైనం

హైదరాబాద్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్య విద్య సంచాలకుల (డీఎంఈ) పరిధిలో పదేళ్లుగా పదోన్నతులు నిలిచిపోయాయి. 2014 నుంచి నేటి వరకు కింది స్థాయి ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వలేదు. లేనిపోని మెలికలు పెడుతూ పదోన్నతులు నిరాకరిస్తున్నారు. డీఎంఈ పరిధిలో నాలుగు రకాల కేడర్లకు గడిచిన పదేళ్లుగా పదోన్నతులివ్వడం లేదు. డైటీషియన్లు, బయోకెమిస్ట్, లైబ్రేరియన్, అసిస్టెంట్ లైబ్రేరియన్ పోస్టులు ఉన్నాయి. వీటిలో బయోకెమిస్టుకు సంబంధించి మాత్రం ఒక్కసారి పదోన్నతులిచ్చారు. మిగిలిన వాటికి ఇంతవరకు ఇవ్వలేదు. అప్పటి డీఎంఈ రమేశ్‌రెడ్డి, ఇప్పటి డీఎంఈ డాక్టర్ వాణి కూడబలుక్కొనే తమకు పదోన్నతులు ఇవ్వడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. అసలు మీకెందుకు పదోన్నతులు ఇవ్వాలంటూ ఉన్నతాధికారులు అవమానకరంగా మాట్లాడడం మరింత బాధిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

34 బోధనాస్పత్రుల్లో 2, 3 చోట్లే డైటీషియన్లు!

బోధనాస్పత్రుల్లో డైటీషియన్లు లేకపోవడంతో రోగులకు ఇచ్చే డైట్‌ను పర్యవేక్షించే వారే ఉండడం లేదు. దీంతో రోగులకు నాణ్యమైన ఆహారం లభించడం లేదు. ఇటీవల ఓ బోధనాస్పత్రిలో రోగులకు ఇచ్చే ఆహారంలో పురుగులు వచ్చాయి. ఇప్పటికే గురుకులాల్లో కలుషిత ఆహారం తిని విద్యార్థులు ఆస్పత్రులపాలు అవుతుండగా.. చికిత్స అందించాల్సిన ఆస్పత్రిలోనే అలాంటి ఆహారం ఇస్తే.. రోగుల పరిస్థితి దైవాధీనమే! బోధనాస్పత్రుల్లో రోగులకు సరైన ఆహారాన్ని సూచించేది డైటీషియన్లే. రోజూ డైట్ కాంట్రాక్టర్లు మెనూ పాటిస్తున్నారా? లేదా? అనే విషయాన్ని తనిఖీ చేసేదీ వారే. అలాంటి కీలక పోస్టులు లేకపోవడంతో డైట్ కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ఈ పోస్టులను పదోన్నతిపై చేపట్టాలి. కానీ, దశాబ్దకాలంగా డీఎంఈ సీట్లో కూర్చుంటున్న వారు ఈ పదోన్నతులు ఇవ్వడం లేదు. నేరుగా నియామకాల ద్వారానైనా ఆ పోస్టులను భర్తీ చేయాలి. కానీ, అదీ చేయడం లేదు. అంతా తమ ఇష్టానుసారం అన్నట్లుగా డీఎంఈ వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు ఆ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయడం లేదు. ఉమ్మడి రాష్ట్రంలో 2013లో డైటీషియన్లకు పదోన్నతులు ఇచ్చారు. ఆ తర్వాత ఇప్పటి వరకూ ప్రమోషన్ల ఊసే లేదు. ప్రస్తుతం 34 బోధనాస్పత్రులుంటే రెండు మూడు చోట్ల మాత్రమే డైటీషియన్లు ఉన్నారు. 42 డైటీషియన్, 27 బయోకెమిస్టు, 44 లైబ్రేరియన్, 22 అసిస్టెంట్ లైబ్రేరియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటన్నింటినీ ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాల్సి ఉండగా.. పట్టించుకోవడం లేదు. అసలు ఇలాంటి పరిస్థితి ఏ శాఖలోనూ లేదని, పదోన్నతుల గురించి అడిగితే హేళన చేస్తున్నారని 'ఆంధ్రజ్యోతి'తో బాధితులు వాపోయారు.

హడావుడి చేయడం.. ఆపై అటకెక్కించడం..

ప్రభుత్వాలు మారినప్పటికీ తమ తలరాతలు మారడం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా పదోన్నతుల ఫైలు పెట్టడం, ప్యానెల్ ఇయర్ ముగిసేదాకా సాగదీయడం, మళ్లీ పక్కనపెట్టడమనేది ఆనవాయితీగా వస్తోందని వాపోతున్నారు. ఈ ఏడాది కూడా డీఎంఈ కార్యాలయ అధికారులు అదే తంతు కొనసాగించారు. దీంతో తమకు తక్షణమే ప్రమోషన్లు ఇవ్వాలని డీఎంఈని ఆదేశించాలంటూ 15 మంది బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు నోటీసులకు డీఎంఈ కార్యాలయం సమాధానం ఇవ్వలేదని ఉద్యోగులు చెబుతున్నారు. కోర్టులనూ లెక్కచేయడం లేదని బాధితులు అంటున్నారు. ఇక కోర్టును ఆశ్రయించారనే కోపంతో వారి పదోన్నతులకు మరిన్ని కొర్రీలు వేసినట్లు తెలుస్తోంది. వారికి పదోన్నతులు రాకుండా, కోర్టును ఆశ్రయించినా ఫలితం లేకుండా ఫైల్‌ను సిద్ధం చేసినట్లు వైద్యవర్గాలు తెలిపాయి.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: **N.Rahul Kumar.** Ph. No. (0870) 2100480/84.
RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.